సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 19
గురువారం 11-4-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

వివరాలు 6లో ▶



ఆప్ మంత్రి రాజీనామా

ఢిల్లీ సంక్షేమ శాఖ మంత్రి పదవికి ఆప్ నేత రాజ్‌కుమార్ ఆనంద్ రాజీనామా చేశారు. పార్టీని సైతం వీడుతున్నట్లు ప్రకటించారు.

వివరాలు 6లో ▶



పోస్టర్లపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు

హోర్డింగ్‌లు, పోస్టర్లు తదితర ఎన్నికల ప్రచార సామగ్రిపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు తప్పని సరిగా ముద్రించాలని ఈసీ ఆదేశించింది.

వివరాలు 6లో ▶


వెల్లలచెరువు వద్ద ఓ మహిళ కన్నీళ్లు తుడుస్తున్న సీఎం జగన్


పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మేమంతా సిద్ధం సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

ఇదీ మా ప్రోగ్రెస్ రిపోర్ట్

2.31 లక్షల ఉద్యోగాలు, ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం.. చంద్రబాబు హయాంలో కేవలం 32 వేల ఉద్యోగాలే

పిడుగురాళ్ల సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- చంద్రబాబు, పచ్చమీడియా కుట్ర రాజకీయాల్లో నిజాల నిగ్గు తేలుద్దాం
- వారు చెప్పే అబద్ధాలు, మోసాలపై జాయింట్‌గా నిజ నిర్ధారణ చేద్దాం
- వ్యవసాయం దండగన్న ఏకైక సీఎం బాబే
- ఉచిత విద్యుత్ ఇస్తే బట్టలు ఆరేసుకోవాలని చెప్పింది ఈ పెద్దమనిషే
- రైతులను విచారించేందుకు కోర్టులు ఏర్పాటు చేసింది కూడా ఈయనే
- 2014 ఎన్నికలప్పుడు ఇచ్చిన ఏ హామీ అయినా నెరవేర్చారా?
- మన 58 నెలల పాలనలో ప్రతి రైతుకు రూ.67,500 ఇచ్చాం
- వ్యవసాయానికి పగటిపూటే 9 గంటలు నాణ్యమైన విద్యుత్.. ఆర్బీకే వ్యవస్థ ద్వారా **రైతన్నను చెయ్యి పట్టుకుని నడిపిస్తున్నాం**
- ప్రతి ఊర్లోనూ విప్లవాత్మక మార్పులు
- మొన్నటిదాకా వలంటీర్లపై చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ఎన్ని మాటలన్నారు?
- వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని బాబు చెప్పడం మన ప్రభుత్వానికి గొప్ప సర్టిఫికెట్..
- గాలి ఎదురు తిరిగిందని ఊసరవెల్లిలా రంగులు మార్పు
- నిమ్మగడ్డతో ఫిర్యాదు చేసి అవ్వాతాతల మరణానికి కారణమైంది మీరు కాదా?
- నీకు అధికారమిస్తే జన్మభూమి కమిటీలను వలంటీర్లుగా తెస్తావని అందరికీ తెలుసు

7లో

మండుటెండలో అభిమాన సంద్రం

'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వెంట పల్నాటి జన సైన్యం
విశ్వసనీయతే తమ వీరత్వమంటూ గర్జించిన అభిమాన జనం
ధర్మాన్ని గెలిపిస్తామంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదం
పింఛన్ ఇంటికి పంపిన జగన్ కోసం తరలివచ్చిన అవ్వాతాతలు
సీఎం జగన్ సంక్షేమాభివృద్ధికి జైకొట్టిన ప్రజానీకం

8లో

గ్రూప్-2 ఫలితాల విడుదల



- మెయిన్స్‌కు 92,250 మంది అర్హత.. 1:100 నిష్పత్తిలో ఎంపిక చేసిన ఏపీపీఎస్సీ
- డిసెంబర్‌లో 897 పోస్టులకు నోటిఫికేషన్.. తాజాగా 905కి పెరిగిన పోస్టుల సంఖ్య
- ఫిబ్రవరి 25న ప్రిలిమ్స్ నిర్వహణ
- 45 రోజుల రికార్డు వ్యవధిలో ఫలితాల ప్రకటన.. జూలై 28న మెయిన్స్ నిర్వహణ

3లో



ఎమ్మెల్యేలపై ఏడుపు

గురివింద రామోజీ తలా తోకలేని రాతలు

వలంటీర్ల ఫోన్లు స్వాధీనం చేసుకున్నాక వాట్సాప్ గ్రూపులు ఎలా సాధ్యం?

10లో

సెన్సెక్స్ బుల్ జర్నీ



1986 జనవరిలో ఊపిరిపోసుకున్న స్టాక్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ 550 పాయింట్ల వద్ద ప్రారంభమై ప్రస్తుతం 75,000 పాయింట్ల శిఖరానికి చేరింది. ఈ ప్రయాణంలో 2008లో గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలను కుదిపేసిన సబ్‌ప్రైమ్ సంక్షోభం, 2020లో కోవిడ్‌ను సైతం తట్టుకుని దౌడు తీస్తూ వచ్చింది. తాజాగా సరికొత్త రికార్డులకు తెరతీస్తూ బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ సైతం రూ. 400 లక్షల కోట్లను అధిగమించింది.

13లో


బాబుకు 'ఈడీ' వేడి

కేజ్రీవాల్ కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పుతో ముచ్చెమటలు

అక్రమ నిధులు పొందే పార్టీలపై ఈడీ కేసులకు కోర్టు గ్రీన్‌సిగ్నల్

సంబంధిత పార్టీ అధ్యక్షుడే అందుకు బాధ్యుడు.. ఢిల్లీ మద్యం కేసు తరహాలోనే ఏపీలో స్కిల్ స్కామ్

హవాలా మార్గంలో టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు.. పూర్తి ఆధారాలతో ఈడీకి ఇప్పటికే నివేదించిన 'సిట్'



సాక్షి, అమరావతి: మద్యం కుంభకోణంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిస్తోంది! హవాలా మార్గంలో అక్రమ నిధులు పొందే రాజకీయ పార్టీలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అందుకు సంబంధిత పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలని తేల్చి చెప్పింది. మద్యం కుంభకోణం ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ అక్రమంగా నిధులు పొందినట్లు ఆధారాలున్నందున ఆ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్‌పై ఈడీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం సరైనదేనని పేర్కొంది. ఈ కేసులో హవాలా మార్గంలో ఆమ్ ఆద్మీ పార్టీకి నిధులు చేరిన తరహాలోనే చంద్రబాబు హయాంలో స్కిల్ స్కామ్ ద్వారా కొల్లగొట్టిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి చేరినట్లు ఇప్పటికే

మిగతా 10వ పేజీలో ▶

ఎలాగూ చేయం కదా.. ఇచ్చేద్దాం మాట!

అలవి కాని హామీలు... అధికారం కోసం చంద్రబాబు తాయిలాలు



- రోజుకో హామీతో ప్రజలను మభ్య పెడుతున్న టీడీపీ అధినేత.. నిన్న మొన్నటి వరకూ సూపర్ సిక్స్ పేరుతో మాయ మాటలు
- అన్ని పార్టీల నుంచి కాపీ కొట్టి కొత్తగా కిచిడి మేనిఫెస్టో విడుదల.. ఇప్పుడు ప్రజామేనిఫెస్టో అంటూ నయా హామీతో మాయోపాయాలు
- గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ బుట్టదాఖలు చేసిన చరిత్ర బాబుది.. ప్రజలు ప్రశ్నిస్తారన్న కారణంతో మేనిఫెస్టోనే మాయం చేసిన మేధావి
- ఇప్పుడు అదే రీతిలో హామీలిచ్చేస్తూ హంగామా

9లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు

- సీఎం వైఎస్ జగన్ సమక్షంలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు
- రాయచోటి నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి
- పి.గన్నవరం జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీ దేవి
- విజయవాడ పశ్చిమ జనసేన ఇన్‌చార్జ్ పోతిన మహేశ్

9లో

ఐఎంజీ భారత్ అక్రమ భూకేటాయింపుపై దర్యాప్తునకు సీబీఐ సిద్ధం

కోర్టుకు తెలిపిన పిటిషనర్ల తరఫు న్యాయవాది



'ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అక్రమంగా భూముల కేటాయింపుపై దర్యాప్తునకు సీబీఐ సిద్ధంగా ఉంది. దేశంలో 2003లో జరిగిన అతిపెద్ద భూకుంభకోణమిది. దీనిపై పిటిషనర్లు వ్యాజ్యాలు దాఖలు చేసి దాదాపు 12 ఏళ్లు గడిచింది. ఎస్‌ఎల్‌పీతో ముడిపెట్టడం సరికాదు' అని పిటిషనర్ల తరఫు న్యాయవాది గంద్ర మోహన్‌రావు తెలంగాణ హైకోర్టుకు వివరించారు.

9లో

ఆర్థిక ఉగ్రవాది ఉన్మాదం

మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు, టీడీపీ డీలాతో రామోజీ బెంబేలు

నైరాశ్యంలో పాతాళానికి పతనమైన ఈనాడు రాతలు

- వేల కోట్లు కుమ్మరించేస్తోందంటూ వైఎస్సార్‌సీపీపై బురదజల్లుతూ రోతరాతలు
- కోర్టు తీర్పుతో తన ఆర్థిక నేరాల గుట్టంతా రట్టవుతుందని గురివింద ఆందోళన
- ఈసీ కనుసన్నల్లో అధికారులు పనిచేస్తుంటే కూడా వంకర రాతలు.. ఎస్పీలు, కలెక్టర్లను బదిలీ చేస్తే 'ఈడ్చికొట్టిన ఈసీ' అంటూ ఆనందం
- మార్గదర్శి కేసు విచారించిన అధికారిని ఎన్నికల విధులకు వేరే రాష్ట్రానికి పంపితే చంకలు గుద్దుకున్న వైనం
- ఇప్పుడు వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని తేలడంతో మతిస్థిమితం కోల్పోయి పిచ్చిరాతలు
- మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తుంటే ముందస్తు చెల్లింపులు ఎలా సాధ్యం రామోజీ?
- జనసేన-బీజేపీతో జట్టుకట్టి.. నోట్ల కట్టలు వెదజల్లుతున్నా బాబుకు కనిపించని జనస్పందన
- చంద్రబాబు ఘోర పరాజయానికి ఇప్పటి నుంచే రామోజీ సాకులు వెతుకుతున్నారంటున్న పరిశీలకులు.. వాస్తవానికి రాజకీయాలను ఫక్తు వ్యాపారంగా మార్చేసింది చంద్రబాబే
- అందుకే రూ. కోట్లు వెదజల్లే వారికే టికెట్లు
- టిప్పర్ డ్రైవర్, ఉపాధి కూలీ వంటి సామాన్యులకు పెద్దపీట వేస్తూ టికెట్లు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

10లో



కాకి లెక్కలు కుదరవ్!

మార్గదర్శికి తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

డిపాజిటర్లకు పూర్తిగా చెల్లించేశామన్న రామోజీ

తమ ఆడిటర్లు లెక్కలు తేల్చేశారంటూ వాదన

మీ సొంత ఆడిటర్లు చెబితే చెల్లదు..

అది ధ్రువీకరించాల్సింది రెండు రాష్ట్ర ప్రభుత్వాలేనన్న సుప్రీం

- వివరాలు 10లో

ఇనుంకుతూత్



అనుభవం అనగానే 'వెన్నుపోట్ల'లో అని మీకు మీరే అనుకుంటే ఎలా?

కాలం చెల్లిన విధానాలకు స్వస్తి పలికి, విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా, NEET కోచింగ్‌లో ఎప్పటికప్పుడు మార్పులు చేపడుతూ, స్థాపించిన విజయవాడలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో సైతం నెంబర్ 1 స్థానాన్ని సుస్థిర పరచుకున్న

శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ

NEET-2024
జూనియర్ ఇంటర్
అడ్మిషన్లు జరుగుతున్నవి
పరిమిత సంఖ్యలో మాత్రమే సీట్లు కలవు



కాలంతో పాటు విద్యా విధానం మారుతుంది, అలాగే తరం కూడా మారుతుంది. వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నీట్ కోచింగులో మార్పులు చేపడుతూ, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుంది శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ, అదే మా ప్రత్యేకత. అందుకే, రారాజులమని చెప్పుకుంటున్న వాళ్ళు సైతం మమ్మల్ని, మా కోచింగ్ పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. ఈ ఒక్క ఉదాహరణ చాలు, శ్రీ గోసలైట్స్ నెంబర్ 1 అని సగర్వంగా చెప్పడానికి.

రెండు తెలుగు రాష్ట్రాల్లో, ఒక్క విజయవాడ నుండి ఒకే ఒక్క బ్రాంచితో, అందరి కంటే అత్యధికంగా నీట్-2023లో 1,237 ఫ్రీ మెడికల్ సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్, నీట్-2024లో 2,000+ ఫ్రీ మెడికల్ సీట్లు సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయబోతుంది. అదే విధంగా, గత 3 ఏళ్లలో 3 వేల ఫ్రీ మెడికల్ సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్, 4వ ఏడాది (నీట్-2024లో) ఆలిండియా బెస్ట్ ర్యాంకులతో మరియు అత్యధిక ఫ్రీ మెడికల్ సీట్లతో, గత రికార్డులన్నీ బద్దలు కొట్టబోతుందని నమ్ముతున్నాము.



సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి
ప్రతీక అయిన రంజాన్ పండుగ జరుపుకుంటున్న
ముస్లిం సోదర, సోదరీమణులందరికీ
ఈద్ ముబారక్

మారిన తరానికి అనుగుణంగా మార్పులు చేసి శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ స్థాపించాము. అందరికంటే ముందుగానే, ప్రతి సంవత్సరం ఆ సంవత్సరానికి తగిన విధంగా అకడమిక్ షెడ్యూల్స్ మార్చుకుంటూ, కొత్త రకమైన కోచింగ్ మెటీరియల్స్ తయారు చేసుకుంటూ, నీట్ క్వశ్చన్ పేపర్స్ యొక్క స్టాండర్డ్స్ కు అనుగుణంగా మార్చుకుంటూ, మైక్రో లెవల్ కోచింగ్ పద్ధతులు పాటిస్తూ, వినూత్నంగా బోధన కొనసాగించడం వల్లనే, ఆలిండియా టాప్ ర్యాంకులతో పాటు, అందరి కంటే ఎక్కువ ఫ్రీ మెడికల్ సీట్లు సాధిస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నాము. ప్రారంభించిన మొదటిరోజు నుండి ఖర్చుకు వెనుకాడకుండా, ప్రతి క్లాస్ రూమును డిజిటలైజ్ చేసి, స్మార్ట్ బోర్డు ద్వారా బోధన కొనసాగిస్తూ, ఇరు తెలుగు రాష్ట్రాల్లో నూరు శాతం డిజిటలైజ్ చెయ్యబడిన ఏకైక విద్యాసంస్థ శ్రీ గోసలైట్స్ అని సగర్వంగా చెప్పగలము. స్థాపించిన తొలి ఏడాదిలోనే (నీట్-2021) 724 సీట్లు, రెండవ ఏడాదిలో (నీట్-2022) 1,013 సీట్లు, మూడవ ఏడాదిలో (నీట్-2023) 1,237 సీట్లు సాధించిన మా మెడికోలు అందరికీ అభినందనలు.

మా వెన్నుతట్టి, అడుగడుగునా మమ్మల్ని ప్రోత్సహించి, మా విజయాలకు మూలస్తంభాల్లా నిలబడిన మా శ్రేయోభిలాషులకు, ముఖ్యంగా విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు కృతజ్ఞతాభివందనాలు.

మీరే మా నమ్మకం, మీరే మా బలం,
ముమ్మాటికీ ఇది మీ సంస్థ.

అమ్మలాంటి ప్రేమ..
నాన్నలాంటి బాధ్యత...



మీ **నరేంద్ర బాబు**, చైర్మన్
ఉష, డైరెక్టర్

NEET-2023 ఫలితాల్లో శ్రీ గోసలైట్స్ ఆల్ టైం రికార్డ్.

స్థాపించిన రెండేళ్లలో మొట్టమొదటి ఇంటర్ బ్యాచ్ నుండే నీట్-2023లో ఓపెన్ EWS ఆలిండియా 1st ర్యాంక్, ఆంధ్ర ప్రదేశ్ లో 2nd ర్యాంక్, తెలుగు రాష్ట్రాల్లో 3rd ర్యాంక్, ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 25th ర్యాంక్, 61st ర్యాంక్

711/720


YELAMPALLI LAKSHMI PRAVARDHAN REDDY
H.T. No.1205150228

1ST RANK — ఓపెన్ EWS ఆలిండియా
2ND RANK — ఆంధ్ర ప్రదేశ్ లో
3RD RANK — తెలుగు రాష్ట్రాల్లో
25TH RANK — ఆలిండియా ఓపెన్ కేటగిరీలో

710/720


ROHIT VARMA VEGESNA
H.T. No.1205220038

61ST RANK — ఆలిండియా ఓపెన్ కేటగిరీలో

శ్రీ గోసలైట్స్ స్థాపించినప్పటి నుండి సాధించిన ఫ్రీ మెడికల్ సీట్లు

NEET-2021	NEET-2022	NEET-2023
724	1013	1237

NEET-23లో అత్యుత్తమ ర్యాంకులతో, దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ మెడికల్ కళాశాలల్లో ఫ్రీ సీట్లు సాధించిన **1,237** మంది శ్రీ గోసలైట్స్ విద్యార్థులు.

NATIONAL MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	AIIMS, New Delhi	1
2	AIIMS Mangalagiri	2
3	AIIMS, Bhopal	1
4	AIIMS, Bibi Nagar, Hyderabad	1
5	AIIMS, Raipur	2
6	JIPMER, Puducherry	3
7	JIPMER, Karaikal	1
8	AFMC	1
9	Stanley Medical College, Chennai	2
10	BMC, Bangalore, Karnataka	1
11	CMC, Vellore, Tamilnadu	2
12	ESIC, Faridabad, Haryana	1
13	ESIC, Gulbarga, Karnataka	2
	TOTAL	20

ANDHRA PRADESH MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	NARN - Narayana Medical College, Nellore	62
2	KMCK - Kurnool Medical College, Kurnool	61
3	ASRA - Alluri Sitarama Raju Academy of Medical Sciences, Eluru	50
4	GSLR - GSL Medical College & General Hospital, Rajahmundry	48
5	SVMC - Sri Venkateswara Medical College, Tirupati	44
6	NRIM - NRIM Medical College, Guntur	42
7	GMCK - RIIMS, Kadapa	38
8	GMCG - Guntur Medical College, Guntur	37
9	PESK - P.E.S. Institute of Medical Sciences and Research, Kuppam	36
10	KONA - Konaseema Institute of Medical Sciences, Amalapuram	35
11	MAHA - Maharajah's Institute Of Medical Sciences, Vizianagaram	34
12	APLC - Apollo Institute of Medical Sciences & Research, Chittoor	33
13	SRMC - Santhiram Medical College, Nandyal	31
14	AMCV - Andhra Medical College, Visakhapatnam	30
15	ACSR - ACSR Government Medical College, Nellore	30
16	BMCT - Sri Balaji Medical College & Hospital, Tirupati	30
17	GMCN - Government Medical College, Nandyal	30
18	GMCA - Government Medical College, Anantapur	27
19	VMCK - Viswabharathi Medical College & General Hospital, Kurnool	26
20	PSIM - Dr. Pinnamaneni Siddhartha Institute of Medical Sciences & Research Foundation, Gannavaram	23
21	PADT - Sri Padmavathi Medical College for Women (SVIMS), Tirupati	22
22	RMCK - Rangaraya Medical College, Kakinada	22
23	GEMS - Great Eastern Medical School & Hospital, Srikakulam	21
24	GMCM - Government Medical College, Machilipatnam	21
25	GMCR - Government Medical College, Rajahmundry	21
26	FIMS - Fathima Institute of Medical Sciences, Kadapa	20
27	KATR - Katuri Medical College & Hospital, Guntur	20
28	GVPT - Gayatri Vidya Parishad Medical College, Vizag	19
29	GMCE - Government Medical College, Eluru	19
30	NRVP - NRI Medical College, Vizag	18
31	SMCV - Siddhartha Medical College, Vijayawada	17
32	GMCV - Government Medical College, Vijayanagaram	16
33	GMCO - RIIMS, Ongole	13
34	GMCS - RIIMS, Srikakulam	12
35	NIMR - Nimra Institute of Medical Sciences, Ibrahimpatnam	10
	TOTAL	1018

TELANGANA MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	OMCH - Osmania Medical College, Hyderabad	8
2	GAND - Gandhi Medical College and Hospital, Secunderabad	2
3	KKTI - KMC Warangal - Kakatiya Medical College	5
4	GOVT Medical College, Mahabubabad	8
5	GOVT Medical College, Bhadradri Kothagudem	6
6	GOVT Medical College, Jagityal	5
7	PRTM - Prathima Institute of Medical Sciences, Karimnagar	11
8	RADL - RIIMS, Adilabad	4
9	GOVT Medical College, Sangareddy	4
10	MMTA - Mamata Medical College, Khammam	15
11	KMNI - Kamineni Institute Of Med. Sci., Narketpally	7
12	GOVT Medical College, Karimnagar	4
13	GOVT Medical College, Nizamabad	4
14	SGMC - Government Medical College, Siddipet	3
15	GMNL - Government Medical College, Nalgonda	3
16	MLRD - Malla Reddy Institute of Medical Sciences, Suraram	8
17	GMCM - Government Medical College, Mahabubnagar	3
18	GOVT Medical College, Khammam	3
19	GOVT Medical College, Kumuram Bheem Asifabad	3
20	GOVT Medical College, Ramagundam	3
21	SVSM - SVS Medical College, Mahabubnagar	5
22	GOVT Medical College, Wanaparthy	2
23	KMHD - Kamineni Academy of Medical Sciences and Research Centre, Hyderabad	6
24	CARK-C Anand Rao Institute of Medical Sciences, Karimnagar	6
25	BASK - Bhaskar Medical College, Moinabad	5
26	SHDN - Shadan Institute of Medical Sciences, Chevella	2
27	GOVT Medical College, Mancherial	2
28	GOVT Medical College, Vikarabad	2
29	Pratima Relief Institute of Medical Sciences, Warangal	7
30	MAHE - Maheshwara Medical College, Patancheruvu	3
31	GMSR - Government Medical college, Suryapet	1
32	MHVR - Mahaveer Institute of Science & Technology, Vikarabad	3
33	GOVT Medical College, Nagarkurnool	1
34	Apollo nstitute of Medical Sciences, Hyderabad	1
35	SURB - Surabhi Institute of Medical Sciences, Siddipet	4
36	RVMC - RVM Institute of Medical Sciences and Research Center, Mulugu	6
37	MNRS - MNR Medical College & Hospital, Sangareddy	4
38	MEDI - MediCiti Institute of Medical Sciences, Medchal	3
39	VRKW - Dr. VRK Women's Medical College, Aziznagar	1
40	ESIM - ESIC Medical College, Hyderabad	1
41	CMR Institute of Medical Sciences, Kandlakoya	1
42	Father Colombo Institute of Medical Sciences, Warangal	1
43	Govt Medical College, Jangaon	1
44	Govt Medical College, Jayashankar Bhupalpally	1
45	Govt Medical College, Kamareddy	1
46	Govt Medical College, Nirmal	1
47	MAMS - Mamata Academy of Med Sci, Bachupally	1
48	MRWN - Mallareddy Medical College for Women, Suraram	1
49	NIMG - Neelima Institute of Medical Sciences, Ghatkesar	1
	TOTAL	183

OTHER STATE MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	TOT
1	MMC, Madurai, Tamilnadu	2
2	MMC, Mysore, Karnataka	2
3	BIMS, Belgaum, Karnataka	1
4	Chikkaballapura Institute of Medical Sciences, Karnataka	1
5	IGMC, Nagpur, Maharashtra	1
6	JSS Medical College, Mysuru, Karnataka	1
7	KILPAUK MC, Chennai, Tamilnadu	1
8	KIMS, Hubballi, Karnataka	1
9	SIMS, Shivamogga, Karnataka	1
10	Vydehi MC, Karnataka	1
11	Assam Medical College, Dibrugarh	1
12	St Johns Medical College, Banglore	1
13	GMC, Tiruvalluru	1
14	Bhaarath Medical College And Hospital, Tamil Nadu	1
	TOTAL	16


Ganguru - Girls Campus (Long Term)


Penamaluru - Girls Campus (Senior Inter)


Penamaluru - Girls Campus (Junior Inter)


Penamaluru - Boys Campus (Inter GOAL-100)


Poranki - Boys Campus (Long Term)


Poranki - Boys Campus (Inter)


Edupugallu - Girls Campus (Inter GOAL-100)

Sri Gosalites Medical Academy
...brand of future medicos

Sri Gosalites, Vijayawada
శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ - విజయవాడ
Saiganesh Towers, Ganguru, Penamaluru (M), VIJAYAWADA - 521 139
M: 98 582 18888, 98 583 18888, 98 584 18888
E: official@gosalites.com, gosalitesvja@gmail.com
www.gosalites.com /srigosalites

Scan & Visit our Website

క్లుప్తంగా...

ముస్లింలకు సీఎం జగన్ శుభాకాంక్షలు

అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలి



సాక్షి, అమరావతి: రంజాన్ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలిపారు. దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరించే ఈ రంజాన్ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు కలిగించాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని పేర్కొన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

రేపు ఇంటర్ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్ ఫలితాలను శుక్రవారం ఉదయం వెల్లడించనున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఏర్పాట్లు చేసింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇంటర్మీడియట్ పరీక్షలను మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించారు. ఇంటర్మీడియట్ రెండేళ్లు కలిపి మొత్తం 9,99,698 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4వ తేదీకి పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాలను వెల్లడించనున్నారు.

బీఈడీ అభ్యర్థుల అకౌంట్‌కు 'టెట్' ఫీజు

సాక్షి, అమరావతి: ఫిబ్రవరిలో నిర్వహించిన టెట్-2024, డీఎస్సీ కోసం ఫీజు చెల్లించి అనర్హులైన అభ్యర్థులకు వారి ఫీజును తిరిగి ఇస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు బీఈడీ చేసిన అభ్యర్థులు టెట్ పేపర్-1కు, డీఎస్సీలో ఎస్‌జీటీలకు అనర్హులు అవడంతో బీఈడీ అభ్యర్థులు ఈ పరీక్షలకు చెల్లించిన ఫీజును వారి ఆధార్ నంబర్‌తో లింక్ అయ్యి ఉన్న బ్యాంక్ ఖాతాల్లో వేస్తున్నట్లు చెప్పారు. ఈ విభాగంలో టెట్, డీఎస్సీకి 50,206 మందికి ఫీజు మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు 44,690 మందికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో జమ చేశామన్నారు. కొంతమంది అభ్యర్థుల ఆధార్ నంబర్ వారి బ్యాంక్ ఖాతాకు లింక్ చేసుకోకపోవడంతో వారికి ఫీజు జమ కావడం లేదని ఇలాంటి వారు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి వారి ఆధార్ కార్డ్‌కు లింక్ చేసిన బ్యాంక్ ఖాతా వివరాలను ఇవ్వాలని సూచించారు. కొంతమంది అభ్యర్థులు ఫీజు చెల్లించినా వారికి ఐడీ జనరేట్ కాలేదని, వీరికి కూడా ఫీజును తిరిగి ఇచ్చేందుకు అభ్యర్థి ఖాతాకు సరిగా జమ అవుతున్నాయో లేదో పరిశీలించేందుకుగాను అభ్యర్థులకు రూ.7.50 (ఫీజులో ఒక్క శాతం) చెల్లించామని, అన్నీ సక్రమంగా ఉన్నవారి అకౌంట్‌కు మిగిలిన ఫీజు మొత్తాన్ని వారి ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఫీజును ఇంటర్నెట్ సెంటర్ల వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. అభ్యర్థి వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్న బ్యాంక్ ఖాతా నంబర్ ఆధారంగానే ఫీజును తిరిగి జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.

గ్రూప్-2 ఫలితాల విడుదల

మెయిన్స్‌కు 92,250 మంది అర్హత / 1:100 నిష్పత్తిలో ఎంపిక చేసిన ఏపీపీఎస్సీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ప్రిలిమ్స్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) బుధవారం విడుదల చేసింది. ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన 45 రోజుల రికార్డు వ్యవధిలోనే ఫలితాలను కూడా వెల్లడించింది. మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. గత ఏడాది డిసెంబర్ 7న ఏపీపీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేయగా.. 4,83,525 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ముందే ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఫిబ్రవరి 25న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు 4,04,039 మంది (87.17 శాతం) హాజరయ్యారు. సర్వీస్ కమిషన్ గతంలో నిర్వహించిన గ్రూప్-2తో పాటు ఇతర పరీక్షలకు గరిష్టంగా 70 శాతం మాత్రమే హాజరవగా, ఈ ఏడాది ప్రిలిమ్స్‌కు మాత్రం భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరు కావడం గమనార్హం. తొలుత మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కమిషన్ నిర్ణయించింది. అయితే, నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఏపీపీఎస్సీకి అందిన విజ్ఞప్తుల మేరకు ఎక్కువ మందికి మెయిన్స్ రాసేందుకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఒక పోస్టుకు 100 చొప్పున అభ్యర్థులను ఎంపిక చేశారు. ఏపీపీఎస్సీ డిసెంబర్ 7వ తేదీన 897 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి 21 నుంచి జనవరి 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం మరో 8 పోస్టులు నోటిఫికేషన్‌కు కలిపారు. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 905కి పెరిగాయి. పెరిగిన పోస్టుల ఆధారంగా మెయిన్స్‌కు మొత్తం 92,250 మందిని ఎంపిక చేశారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను జూలై 28న నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ ప్రకటించింది. సర్వీస్ కమిషన్ పరీక్షల నిర్వహణలో అనేక సవాళ్లు, ఆటంకాలు ఎదురయ్యాయని, అయినా.. గ్రూప్-2, గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను విజయవంతంగా నిర్వహించామని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన పూర్తి సహకారంతో తక్కువ సమయంలోనే గ్రూప్-2 ప్రిలిమ్స్ ఫలితాలను సైతం ప్రకటించామని ఆయన తెలిపారు.

92,250 మందికి మెయిన్స్‌కి చాన్స్

2018లో నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమ్స్ రాసినవారి నుంచి 1:12 నిష్పత్తిలో మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేయగా.. ఈసారి ఎక్కువ సంఖ్యలో 92,250 మంది అభ్యర్థులకు మెయిన్స్ రాసే ఛాన్స్ లభించింది. గ్రూప్ పరీక్షలకు 1:100 విధానంలో ఎంపిక చేయడం సర్వీస్ కమిషన్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. కాగా, కమిషన్ ప్రకటించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో 114 డిప్యూటీ తహసీల్దార్, 150 ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, గ్రేడ్-3 మునిసిపల్ కమిషనర్ పోస్టులు 4, గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్ 16, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ 28 పోస్టులతో కలిపి 59 శాఖల్లో 331 ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ), సీనియర్ ఆడిటర్, ఆడిటర్ ఇన్ పే అండ్ అకౌంట్స్, వివిధ సెక్షన్లలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 566 ఉన్నాయి. కాగా, ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే మెయిన్స్ పరీక్షలో పేపర్-1, పేపర్-2 150 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ http://www.psc.ap.gov.inలో చూడవచ్చు.

నిరుద్యోగులకు ఎంతో మేలు

గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షను అడ్డుకునేందుకు ఎంతమంది ఎన్ని ప్రయత్నాలు చేసినా అవేమీ ఫలించలేదు. ఇంత తక్కువ సమయంలో ఫలితాలను ప్రకటించడం చాలా గొప్ప విషయం. నిరుద్యోగుల పట్ల సీఎంకు చిత్తశుద్ధి ఉంది. చెప్పిన సమయానికి ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించింది. నిరుద్యోగుల విజ్ఞప్తి మేరకు 1:100 నిష్పత్తిలో గ్రూప్-2 మెయిన్స్‌కు ఎంపిక చేయడం అభినందనీయం. చరిత్రలో ఇంతమంది నిరుద్యోగులకు అవకాశం కల్పించడం ఇదే ప్రథమం. ఈ అవకాశం ఇచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వై.రామచంద్ర, అధ్యక్షుడు, నిరుద్యోగ ఐక్య సమితి

విజయవంతంగా 'టోఫెల్' ప్రైమరీ

3–5 తరగతుల విద్యార్థులు 92 శాతం మంది హాజరు



కృష్ణాజిల్లా పోరంకి జెడ్పీ హైస్కూల్లో టోఫెల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



ఈటీఎస్ సంస్థ సీనియర్ డైరెక్టర్ అలైన్ డుమాస్ ట్వీట్

సాక్షి, అమరావతి: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో ప్రపంచ స్థాయి ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ ప్రిపరేటరీ సర్టిఫికేషన్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 13,104 పాఠశాల్లో టోఫెల్ ప్రైమరీ పరీక్ష నిర్వహించారు. ఇందులో 3 నుంచి 5 తరగతుల విద్యార్థులు 4,53,265 మంది విద్యార్థులకుగానూ 4,17,879 మంది (92 శాతం) హాజరైనట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాగా, 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఈనెల 12న జూనియర్ టోఫెల్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. బుధవారం జరిగిన పరీక్షను అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) సంస్థ ప్రతినిధులు లిజో, రాజీవ్ పరీక్ష జరిగిన విధానాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా, ఈటీఎస్ సంస్థ సీనియర్ డైరెక్టర్ అలైన్ డుమాస్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చాలా మంది విద్యార్థులు టోఫెల్ రెడీనెస్ టెస్ట్ ద్వారా తమ తొలి ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ పరీక్ష రాసిన అందరికీ విజయం సిద్ధించాలని అలెన్ డుమాస్ 'ఎక్స్' (ట్విట్టర్)లో పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై చైతన్యం

- పెట్రోల్ బంకుల వద్ద కూడా హోర్డింగ్‌లతో ప్రచారం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా

సాక్షి, అమరావతి: దేశంలోనే అత్యధిక పోలింగ్ శాతం ఏపీలో నమోదయ్యే విధంగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో పోలింగ్ శాతం 79 శాతం దాటగా.. దానిని ఈ సారి 83 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓటు హక్కు విలువ తెలియజేసేందుకు స్వీప్(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) పేరుతో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 10,670 పోస్టాఫీసుల ద్వారా ప్రచారం చేస్తున్న ఎన్నికల సంఘం.. తాజాగా పెట్రోల్ బంకుల వద్ద కూడా అవగాహన కార్యక్రమాన్ని చేపడుతోంది. బుధవారం రాష్ట్ర సచివాలయంలో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా అవగాహన కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ముఖేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. స్వీప్ అమల్లో భాగంగా చమురు పరిశ్రమల ద్వారా కూడా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందని చెప్పారు. ఈసీఐ లోగోతో ఎన్నికల తేదీ, ఓటు హక్కు విలువను తెలియజేసే నినాదాలతో కూడిన హోర్డింగుల డిజైన్లను అందజేస్తామన్నారు. వాటిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పెట్రోల్ బంకుల వద్ద ఏర్పాటు చేసి.. ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

మిగిలిన జిల్లాల్లో ఉపాధి శిక్షణ సంస్థలు ఏర్పాటు చేయండి

- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి కేంద్రం ఆదేశం
- జిల్లాల వారీగా శిక్షణా సంస్థల ఏర్పాటు బ్యాంకులకు అప్పగింత
- గ్రామీణ యువతకు సుస్థిర సూక్ష్మ సంస్థల దిశగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహణ
- ఆయా జిల్లాల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, నైపుణ్యాల పెంపుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ యువతకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు పది జిల్లాల్లో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీని ఆదేశించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 16 జిల్లాల్లోనే ఉపాధి శిక్షణ సంస్థలు ఉన్నాయని, మిగతా 10 జిల్లాల్లో ఆ శిక్షణ సంస్థలను ఈ నెలాఖరులోగా ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ జిల్లాల లీడ్ బ్యాంకులకు స్పష్టం చేసింది. స్వయం ఉపాధి శిక్షణ సంస్థలకు సొంత భవనాల కోసం కనీసం ఎకరం స్థలం అవసరమని, ఈ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని పేర్కొంది. నైపుణ్య శిక్షణ కోసం గ్రామీణ యువతను సమీకరించేందుకు అవసరమైన పోస్టర్లు, ప్రకటనల జారీ, టీవీల్లో ప్రచారం నిర్వహించాల్సిందిగా కమిటీ సూచించింది. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద రుణాలు పొంది స్వయం ఉపాధి చేసుకునే గ్రామీణ యువతకు ఆయా రంగాల్లో నైపుణ్యాలను పెంచేందుకు ఈ శిక్షణ సంస్థలు ఎంతో దోహదపడనున్నాయని కమిటీ పేర్కొంది. దేశ వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆరు లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని కేంద్రం నిర్దేశించింది. కాగా, లీడ్ బ్యాంకు స్కీం కింద ఆయా జిల్లాల్లో గ్రామీణ యువతకు సూక్ష్మ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆయా జిల్లాల అవసరాలకు అనుగుణంగా ఆయా రంగాల్లో గ్రామీణ యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణతో పాటు నైపుణ్యాల పెంపుదలకు కార్యకలాపాలను నిర్వహిస్తారు.

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు ఇలా

జిల్లా పేరు	బ్యాంకు పేరు
శ్రీ సత్యసాయి	కెనరా బ్యాంక్
పార్వతీపురం మన్యం	ఎస్‌బీఐ
అన్నమయ్య	ఎస్‌బీఐ
అల్లూరి సీతారామరాజు	యూనియన్ బ్యాంక్
అనకాపల్లి	యూనియన్ బ్యాంక్
కాకినాడ	యూనియన్ బ్యాంక్
డా.అంబేడ్కర్ కోనసీమ	యూనియన్ బ్యాంక్
బాపట్ల	యూనియన్ బ్యాంక్
పల్నాడు	యూనియన్ బ్యాంక్
నంద్యాల	యూనియన్ బ్యాంక్

డిమాండ్‌కు తగ్గట్లు కరెంట్ కొనుగోళ్లు

- ఏపీ అభివృద్ధికి సూచికగా పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- రాష్ట్రంలో లభిస్తున్న విద్యుత్‌తో పాటు మార్కెట్‌లోనూ కొనుగోలు
- రోజూ 30.21 మిలియన్ యూనిట్ల కోసం రూ. 20.63 కోట్ల వ్యయం
- చంద్రబాబు హయాంలో కాలంతో సంబంధం లేకుండా కరెంటు తిప్పలు
- జగన్ ప్రభుత్వ ముందస్తు ప్రణాళికలతో ప్రజలకు తప్పిన విద్యుత్ కోతలు



సాక్షి, అమరావతి: ఒక రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది అనడానికి నిదర్శనంగా కనిపించే సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఒకటి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఏపీలో విద్యుత్ డిమాండ్ ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. 2022లో తలసరి విద్యుత్ వినియోగం 1,234 యూనిట్లు ఉంటే 2023లో అది 1,357 యూనిట్లకు పెరిగింది. ఇలా ఏ ఏటికాయేడు కిందటి ఏడాదికి మించి కరెంటు రికార్డులు నమోదు చేస్తూనే ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ 236.73 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. ఇది గతేడాది ఇదే సమయానికి జరిగిన వినియోగం 231.05 మిలియన్ యూనిట్ల కంటే 2.46 శాతం ఎక్కువ. పగలు పీక్ డిమాండ్ 11,926 మెగావాట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి 11,358 మెగావాట్లు ఉండేది. అంటే 5 శాతం పెరిగింది. ఈ ఏడాది వేసవి ఆరంభం కాకముందే ఎండలు ముదిరినప్పటికీ.. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు భారీగా ఉంటున్నప్పటికీ రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత రాకుండా, కోతలు విధించాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు ప్రజలకు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నాయి.

కొనుగోలుకు వెనుకాడకుండా..

రాష్ట్ర ప్రజలకు విద్యుత్ అందించేందుకు ప్రస్తుతం ఏపీజెన్‌కో థర్మల్ నుంచి 94.427 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 4.528 మి.యూ, ఏపీ జెన్‌కో సోలార్ నుంచి 2.419 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 31.868 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 29.849 మి.యూ, సోలార్ నుంచి 21.635 మి.యూ, విండ్ నుంచి 20.535 మిలియన్ యూనిట్లు చొప్పున సమకూరుతోంది. నెల రోజుల్లో పవన విద్యుత్ ఉత్పత్తి దాదాపు రెట్టింపు అయ్యింది. దీనితో పాటు బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.754 చొప్పున రూ. 20.634 కోట్లతో 30.211 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నారు. డిమాండ్ ఫోర్‌కాస్ట్ విధానం ద్వారా ప్రతి పదిహేను నిమిషాలకూ విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయగలిగే సామర్థ్యం మన విద్యుత్ సంస్థలకు ఉంది. దాని సాయంతో షార్ట్‌టెర్మ్ టెండర్ల ద్వారా బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కోసం ముందస్తు బిడ్‌లు దాఖలు చేస్తున్నాయి. తద్వారా అప్పటికప్పుడు ఏర్పడే విద్యుత్ కొరత నుంచి బయటపడుతున్నాయి. రాష్ట్రంలో మునుపెన్నడూ ఇలాంటి ఏర్పాటు లేదు. గత ప్రభుత్వంలో అత్యవసర సమయాల్లో కరెంటు కొనేవారే కాదు. అనవసరంగా చేసుకున్న దీర్ఘకాల విద్యుత్ ఒప్పందాల వల్ల ఒరిగేదేమీ ఉండేది కాదు. ఫలితంగా రాష్ట్రంలో అన్ని కాలాల్లోనూ ప్రజలు విద్యుత్ కోతలతో అల్లాడిపోయేవారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు ప్రణాళికల కారణంగా విద్యుత్ వినియోగదారులకు అప్పటి ఇబ్బందులు ఇప్పుడు ఎదురవ్వడం లేదు.

వలంటీర్లకు బాబు, పవన్ క్షమాపణ చెప్పాలి

లోకేశ్‌లా వలంటీర్లు తాగుబోతులు, తిరుగుబోతులు కాదు

- జయప్రద జీవితాన్ని నాశనం చేసి.. ఎన్టీఆర్ భార్యను బజారుకీడ్చావు
- నాడు కమ్మవారిపై దాడులు జరిగితే ఎక్కడ దాక్కున్నావు బాబు?
- గేదెలు కాసేవారు కూడా పవన్‌లా మాట్లాడరు
- వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణమురళి ధ్వజం



సాక్షి, అమరావతి: వలంటీర్లపై ఇష్టమొచ్చినట్టు కారుకూతలు కూసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బహిరంగంగా వారికి క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణమురళి డిమాండ్ చేశారు. నారా లోకేశ్‌లా వలంటీర్లు తిరుగుబోతులు, తాగుబోతులు కాదన్నారు. చంద్రబాబు.. జయప్రద జీవితాన్ని నాశనం చేసి ఎన్టీఆర్ భార్య లక్ష్మీపార్వతిని బజారుకీడ్చారని మండిపడ్డారు. వంగవీటి రంగాను చంపించిన చంద్రబాబు.. రంగా హత్యానంతరం కమ్మవాళ్లపై దాడులు జరిగితే ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. గేదెలు కాసేవారు కూడా పవన్ కళ్యాణ్‌లా మాట్లాడరని.. ఆయనొక ఉన్మాదిలా తయారయ్యారని నిప్పులు చెరిగారు. వలంటీర్లపై అనేక అవాకులు, చెవాకులు పేలి ఇప్పుడు అదే నోటితో వలంటీర్లను కొనసాగిస్తామని చెబుతున్నారని.. తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఇస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. వలంటీర్లు ఒక మనవడిలా, అన్నలా, బిడ్డలా ఉంటారే కానీ.. చంద్రబాబు కుమారుడు లోకేశ్‌లా ఓ పక్క పళ్లెం ..మరో పక్క గొళ్లెం మెయింటైన్ చేయరన్నారు. దేవతల్లాంటి వలంటీర్ ఆడపడుచుల్ని పవన్ దూషించాడని మండిపడ్డారు. రేపు తన ఇంట్లో వాళ్లని, సొంత అన్న చిరంజీవి ఇంట్లో వాళ్లను కూడా తిట్టొచ్చన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పోసాని కృష్ణమురళి బుధవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

సుజనా చౌదరి పరమ లోఫర్..

ఒక కమ్మ వాడు దొంగ, అవినీతిపరుడు అయితే అతడిని ప్రశ్నించకూడదా? కమ్మవాడైన సుజనా చౌదరి రూ.5,700 కోట్లు తిన్న మోసగాడు అని మరో కమ్మవాడు రాధాకృష్ణ గ్రాండ్‌గా రాశాడు. సుజనా చౌదరి పరమ లోఫర్, దొంగ, కబ్జాదారు. సుజనా అక్రమాల గురించి విజయవాడలో ప్రతి ఇంటికి కరపత్రాలు పంచుతా. నంబర్‌వన్ కిలాడి.. చంద్రబాబు లక్ష కోట్లు ఎలా సంపాదించాడు? ఇలాంటి అవినీతిపరుల గురించి రామోజీ రాయడు.. ఎందుకంటే రూ.వెయ్యి కోట్లు రాంగ్‌రూట్లో ఆయనకు అందాయి.

పురందేశ్వరి లక్ష్యం చంద్రబాబును సీఎంను చేయడమే..

సావర్కర్‌కు, సునీల్ గవాస్కర్‌కు తేడా తెలియని వ్యక్తి.. పురందేశ్వరి. విశాఖలో ఎంపీగా నిలబడితే ఆమెకు కనీసం డిపాజిట్లు కూడా రాలేదు. తన మరిది చంద్రబాబును సీఎం కుర్చీలో కూర్చోబెట్టడమే ఆమె లక్ష్యం. కమ్మ అయితే ఏంటి.. రెడ్డి అయితే ఏంటి.. మనకు కావాల్సిన మంచి చేస్తున్నారా లేదా అనేది గుర్తించండి. ఉన్న వాళ్లలో మనకు ఉన్న బెస్ట్ సీఎం జగన్. ఆయనేం నా కులం కాదు.. నా బంధువు కాదు. ఆయన క్యారెక్టర్ చూసి 14 ఏళ్లుగా ఆయన వెంట తిరుగుతున్నా.

చంద్రబాబు, నిమ్మగడ్డల నిర్వాకానికి 35 మంది బలి..

చంద్రబాబు, నిమ్మగడ్డల నిర్వాకానికి 35 మంది వృద్ధులు చనిపోయారు. లబ్ధిదారుల్లో కమ్మ వారు లేరా? టీడీపీ, జనసేన పార్టీల వారు లేరా? పథకాలు తీసుకుంటే కమ్మోళ్లు కూడా జగన్‌కు ఓటేస్తారని మీ భయమా? అందుకే మళ్లీ యూటర్న్ తీసుకొని చంద్రబాబు వలంటీర్లకు పదివేలు ఇస్తానంటున్నారు. 2014లో 600కు పైగా హామీలు ఇచ్చి వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. ఆకాశం నుంచి చుక్కల్ని తెచ్చిపెడతాను అని కూడా అంటారు. దయచేసి బాబు హామీలు నమ్మొద్దు. రోజూ ఈనాడులో లక్ష్మీపార్వతి దుష్టశక్తి అని రాతలు రాయించి ఆమె జీవితం నాశనం చేశాడు. కిలాడి రాధాకృష్ణ.. డెబ్బై ఏళ్ల ఎన్టీఆర్ ఇల్లాలికి.. 30 ఏళ్ల కుర్రాడితో అంటగట్టాడు. టీవీ5 వాడు నేరుగా లక్ష్మీపార్వతిని అసభ్యంగా దూషించాడు. ఆడది కనిపిస్తే ముద్దు పెట్టాలి..లేదంటే కడుపు చేయాలని బాలకృష్ణ అంటాడు. వీళ్లందరికీ మహిళలంటే చాలా చులకన. ఇలాంటివారు ఒక్కరైనా వైఎస్సార్‌సీపీలో ఉన్నారా?


జగన్ పాలనలో కాపులకు పెద్దపీట

కాపుల ఆత్మీయ సమావేశంలో బొత్స ఝాన్సీ



మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ, చిత్రంలో కేకే రాజు

మర్రిపాలెం (విశాఖ ఉత్తర): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన పాలనలో కాపులకు పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి కొనియాడారు. కాపుసేన సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి పార్టీ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ తన పుట్టినిల్లు విశాఖకు సేవ చేసుకునే అవకాశాన్ని సీఎం వైఎస్ జగన్ కల్పించారన్నారు. విశాఖ ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. కె.కె. రాజు మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల్లో నలుగురు కాపులకు సీఎం జగన్ అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. కాపుల అభ్యున్నతికి తోడ్పడుతున్న ఆ సామాజికవర్గ ప్రతినిధులను బొత్స ఝాన్సీ, కె.కె.రాజు సన్మానించారు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాపు సామాజికవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీకి తమ మద్దతు తెలిపారు. కాగా టీడీపీ 43వ వార్డు ప్రచార కార్యదర్శి బత్తుల సంజీవనాయుడు వైఎస్సార్‌సీపీలో చేరారు.



నీకు ఏమీ తెలియదని తెలుసుకోవడంలోనే నిజమైన వివేకం దాగి వుంది.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 11 ఏప్రిల్ 2024

అమెరికా–చైనా చర్చలపర్వం

ఎడతెగని చర్చలు జరుగుతున్నాయంటే, అయినా కనుచూపుమేరలో పరిష్కారం కానరాలేదంటే... కనబడని కారణాలేవో అడ్డుపడుతున్నాయని అర్థం. సమస్య తీవ్రంగా ఉన్నదని తాత్పర్యం. ఈనెల ప్రారంభంనుంచి అమెరికా–చైనాలమధ్య భిన్న అంశాలపై చర్చోపచర్చలు సాగుతూనే వున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లు నేరుగా ఫోన్‌లో సంభాషించుకున్నారు. నాలుగు నెలలక్రితం తొలిసారి మాట్లాడుకున్న ఈ నేతలిద్దరూ మళ్లీ మాట్లాడుకోవాల్సిన పనిబడటం గమనించదగిందే. వారం తిరగకుండానే అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ ఎలెన్ చైనా సందర్శనకొచ్చి ప్రధాని లీ కియాంగ్‌తోపాటు చైనా ఉన్నత స్థాయి అధికారులను కలిసి మాట్లాడారు. అంతకుమునుపే ఇరు దేశాల ఉన్నతాధికారులు నాలుగు రోజులపాటు చర్చించుకున్నారు. త్వరలోనే అమెరికా విదేశాంగమంత్రి ఆంథోనీ బ్లింకెన్ చైనా వెళ్లబోతున్నారు. ఇలా సంభాషణల పరంపర కొనసాగుతున్నది గానీ పరిష్కారం కానరావటం లేదు. వీటికి సమాంతరంగా చైనాను కట్టడి చేసే ఇండో–పసిఫిక్ వ్యూహంలో భాగంగా 2021లో రూపుదిద్దుకున్న సైనిక సహకార సంస్థ 'ఆకస్' కార్యకలాపాలు చురుకందుకున్నాయి. ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్ రక్షణమంత్రులు ఇటీవల భేటీ అయ్యారు. ఇందులో మనదేశాన్ని కూడా చేర్చు కోవాలని అమెరికా తహతహలాడుతున్నా ఎలాంటి సైనిక ఒడంబడికల్లోనూ భాగం కారాదన్న విధానానికే ఇంతవరకూ మన దేశం కట్టుబడివుంది. మొదట్లో పెద్దగా ఆసక్తి చూపని జపాన్ మాత్రం చేరే అవకాశం ఉందంటున్నారు. అలాగని మన దేశం మౌనంగా ఏమీ లేదు. దక్షిణ చైనా సముద్రంలో చైనానుంచి తరచు బెదిరింపులు ఎదుర్కొంటున్న ఆగ్నేయాసియా దేశాలకు మద్దతుగా నిలుస్తామని చాటుతూనేవుంది. ఇటీవల చైనా గస్తీ నౌకలు చేసిన దాడుల్లో ఫిలిప్పీన్స్ వాణిజ్య నౌకలు రెండు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవలే ఆ దేశాన్ని సందర్శించి అండగా వుంటామని ప్రకటించారు. దక్షిణ చైనా సముద్రంలో 90 శాతం తన సొంతమని చైనా చెప్పుకుంటోంది. నిరంతర గస్తీ కాస్తోంది. సమస్యేమంటే ప్రపంచ సముద్ర ఉత్పత్తుల వాణిజ్యంలో 60 శాతం దక్షిణ చైనా సముద్రం వైపే సాగుతోంది.

అంతర్జాతీయంగా చైనాను కట్టడి చేయటమే అత్యవసరమని భావిస్తున్న అమెరికాకు రష్యా దూకుడు ఊహించని పరిణామం. రెండేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధం ప్రారంభించాక దృష్టి అటువైపు మళ్లింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలందించటం ద్వారా రష్యాను దారికి తేవొచ్చని భావించిన అమెరికాకు నిరాశే ఎదురైంది. రష్యాపై విధించిన ఆర్థిక ఆంక్షలు సైతం ఆశించినంత ఫలితాన్నివ్వలేదు. రష్యాకు ఇరాన్ నుంచి డ్రోన్‌లు అందుతున్నాయి. ఎడాపెడా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవటం ద్వారా రష్యాకు చైనా అండగా నిలుస్తోంది. ఉత్తర కొరియా సైతం చైనా ద్వారా రష్యాకు సహాయసహకారాలందిస్తోందని అమెరికా భావిస్తోంది. ఇటు ఇజ్రాయెల్ దుందుడుకుతనంతో గాజా మండుతోంది. ఇజ్రాయెల్‌ను ఎలాగైనా దారికి తేవాలన్న బైడెన్ ఎత్తుగడలు ఫలించటం లేదు. కనుకనే దౌత్యరంగంలో వున్నంత దూకుడు రక్షణరంగంలో కనబడటం లేదన్నది బైడెన్‌పై వున్న ప్రధాన విమర్శ. ఈ ఏడాది చివర అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నందున ఈ విమర్శలు బైడెన్‌ను కలవరపెడుతున్నాయి. పర్యవసానంగా చైనాతో చర్చోప చర్చలు సాగుతున్నాయి. వాణిజ్యపరంగా అమెరికాకు మరో ప్రత్యేక సమస్య కూడా వుంది. అంతర్జాతీయ మార్కెట్‌లోకి అపరిమితంగా వచ్చిపడుతున్న చైనా ఎలక్ట్రిక్ కార్లు, సౌరశక్తి ప్యానెళ్లు, ఇతర ఉపకరణాలు అమెరికాకు తలనొప్పి తెస్తున్నాయి. వాటివల్ల అమెరికా ఉత్పత్తులు అమ్ముడుకావటం కష్టమవుతోంది. అమెరికా పరిశ్రమలు సంక్షోభంలో పడుతున్నాయి. ఈ నెల మొదట్లో జో బైడెన్, షి జిన్‌పింగ్ మధ్య ప్రధానంగా తైవాన్, దక్షిణ చైనా సముద్రం అంశాలపై చర్చలు నడిస్తే... చైనా తమ వాణిజ్య దూకుడుకు కళ్లెం వేయటంపై జానెట్ ఎలెన్ ప్రధాని లీ కియాంగ్‌తో చర్చించారు. దీన్ని ఆపకపోతే మరో మూడేళ్లలో అవసరానికి మించి ఏటా 50 లక్షల నుంచి కోటి ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌కొస్తాయన్నది అమెరికా అంచనా. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ తదితర అంశాల్లో తమ ఎదుగుదలను నిరోధించేలా అమెరికా వ్యవహరిస్తున్నదని చైనా ఆరోపణ. కనుకనే ఇరుదేశాల ఉన్నతాధికారులమధ్యా వరసగా నాలుగురోజులపాటు చర్చలు సాగినా... నేరుగా ఎలెన్, లీ కియాంగ్‌లు సంభాషించుకున్నా పరిష్కారం దొరకలేదు.

చిత్రమేమంటే అమెరికా, చైనాల మధ్య అనేక అంశాల్లో తీవ్ర విభేదాలున్నా వాణిజ్యపరంగా ఆ రెండు దేశాలూ పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పని స్థితి. అందుకే ఇండో–పసిఫిక్ అంశంలో దూకుడుగా వున్నట్టు కనిపిస్తున్నా వాణిజ్య సమస్యలపై ఏదోవిధంగా చైనాను దారికి తెచ్చుకోవాలని అమెరికా తాపత్రయపడుతోంది. ట్రంప్ హయాంలో చైనాపై విధించిన ఆంక్షల్లో చాలా భాగం బైడెన్ కొనసాగించారు. వీటికి మరిన్ని జోడిస్తానన్న బైడెన్ హెచ్చరికలు ఆచరణలోకి రాకపోయినా అవసరాన్నిబట్టి అప్పుడప్పుడు సడలింపు వైఖరితో ఉన్నామన్న సంకేతాలు రెండు దేశాలూ ఇస్తున్నాయి. ఎలాంటి సమస్యలకైనా ఓర్పుగా సాగించే సంభాషణలు పరిష్కారాన్ని చూపుతాయి. ఘర్షణల నివారణ ఎప్పుడూ మంచిదే. ఎందుకంటే ఘర్షణలవల్ల అంతిమంగా విధ్వంసం తప్ప మరేమీ మిగలదు. అయితే ఏ చర్చలైనా నిర్మాణాత్మకంగా వుండాలి. చిత్తశుద్ధితో సాగాలి. లేనట్టయితే నిష్ఫలమవుతాయి.

టీ కప్పులో తుపాను వివాదం

విశ్లేషణ



కేపీ నాయర్

తమిళనాడులో లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా కచ్చతీవు వివాదం వార్తల్లో ఉంటుంది. పరిమిత రాజకీయ జీవితకాలం ఉన్న ఈ అంశాన్ని భారత్–శ్రీలంక ద్వైపాక్షిక సమస్యగా పొడిగించాలని కోరుకునేవారు గమనించాల్సింది, నాయకుల మధ్య వ్యక్తిగత సమీకరణాలు విధాన మార్గదర్శకాలుగా పనిచేశాయి. దానివల్ల వివాదాలు సామరస్యంగా పరిష్కారమయ్యాయి. కాబట్టి గత నిర్ణయాల పట్ల అర్థంలేని వివాదాలు ప్రయోజనం చేకూర్చవు. ఇంకా ముఖ్యంగా, 'వియన్నా కన్వెన్షన్ ప్రకారం భారతదేశం ఏకపక్షంగా (కచ్చతీవు) ఒప్పందాన్ని రద్దు చేయలేదు. దేశం ఎదుగుతున్న శక్తిగా తనను తాను ప్రకటించుకుంటున్నప్పుడు ఒడంబడిక రద్దు అనేది అంతర్జాతీయ రాజకీయాల్లో తన ప్రతిష్ఠను కోల్పోయేలా చేస్తుంది.'

ఒక వారం క్రితం భారత ఎన్నికల వేదికపై కచ్చతీవు వివాదం విరుచుకుపడినప్పుడు, 1994 జనవరిలో విదేశాంగ కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన జేఎన్ దీక్షిత్‌తో మూడు దశాబ్దాల క్రితం గడిపిన సాయంత్రాల వైపు నా మనస్సు మళ్లింది. కొలంబోలో ఉన్న సమయంలో 'వైస్రాయ్' నామకరణం పొందిన దీక్షిత్ 1985 నుండి 1989 వరకు భారత హైకమిషనర్‌గా, ఒక రకంగా మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఆయన సహచరులు చాలామంది, విదేశీ వ్యవహారాల రహస్యాలను తాము చనిపోయేంతవరకు దాచిపెడుతున్న సమయంలో, దౌత్యంపై జాతీయ మీడియాలో రాజకీయ కాలమ్‌ను ప్రారంభించిన మొదటి భారతీయ విదేశాంగ కార్యదర్శి జేఎన్ దీక్షిత్.

నేను దీక్షిత్‌తో గురుగావ్‌లో గడిపాను. శ్రీలంకలో తాను పని చేసిన సంవత్సరాల గురించి ఆయన ఒక పుస్తకం రాయాలనుకున్నారు. ఆయన పదవీకాలం భారత్, శ్రీలంక సంబంధాలలో అక్షరాలా అత్యంత విస్ఫోటనా కాలం. ఇది జనావాసాలు లేని కచ్చతీవు ద్వీపంపై ప్రస్తుత టీకప్పులో తుపాను లాంటిది కాదు.

అవి ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలలో వేగవంతమైన హెచ్చుతగ్గులతో కూడి, శ్రీలంకలో ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ ఎదుర్కొంటున్న దురదృష్టకరమైన సంవత్సరాలు. విదేశీ సంబంధాలలో ఇటువంటి అస్థిరత చివరికి రెండేళ్ల వ్యవధిలోనే భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, అప్పటి శ్రీలంక అధ్యక్షుడు రణసింఘే ప్రేమదాస విషాద హత్యలకు దారితీసింది. దీక్షిత్‌కు జనాల కోసం రాయడం గురించి సందేహాలున్నాయి. రచయితగా మారే క్రమంలో నాలాంటి చాలామంది జర్నలిస్టులను ఆయన రప్పించుకున్నారు. 'అసైన్‌మెంట్ కొలంబో' శీర్షికతో శ్రీలంకపై రాస్తున్నానంటూ దీక్షిత్ వెల్లడించిన పుస్తకం పూర్తి కావడానికి నాలుగేళ్లు పట్టింది. అధికారిక రహస్యాల చట్టంలోని నిబంధనలలో చిక్కుకోకుండా ఉండేందుకు ఆయన దానిని జ్ఞాపకాల నుండి మాత్రమే రాయాలనుకున్నారు. ఈలోగా, అంతగా వివాదాస్పదం కాని మరో మూడు పుస్తకాలను ప్రచురించారు.

ఒక సాయంత్రం, శ్రీలంక సందర్శనకు విచ్చేసిన ఉన్నత స్థాయి భారతీయ ప్రతినిధి బృందానికి తాను ఏర్పాటు చేసిన రిసెప్షన్ గురించి ఆయన నాకు చెప్పారు. హైకమిషనర్ ప్రత్యేక అతిథిగా ప్రపంచంలోనే మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి సిరిమావో బండారునాయకే ఆ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఆ సమావేశానికి హాజరైన వారి మానసిక స్థితి ఉల్లాసంగా ఉంది. కొంచెం మత్తులో ఉన్న భారతీయ సందర్శకులలో ఒకరు, సిరిమావో బండారునాయకే అధికారంలో ఉన్నప్పుడు ద్వీపంలో అంతర్యుద్ధం చెలరేగి ఉండినట్లయితే, ఎల్టీటీఈ అగ్రనేత వేలుపిళ్లై ప్రభాకరన్ విషయంలో ఆమె ఏమి చేసి ఉండేవారంటూ చికాకు కలిగించే ప్రశ్నను అడిగారు. ఒక్క క్షణం కూడా సంకోచించకుండా, బండారునాయకే ఇలా తిప్పికొట్టారు: 'నేను న్యూఢిల్లీలో ఉన్న మా సోదరికి ఫోన్‌చేసి, ఈ ప్రభాకరన్ అనే వ్యక్తినీ, లంక తమిళ సమస్యకు అతని రకమైన పరిష్కారాన్నీ నేను క్రమబద్ధీకరించేటప్పుడు ఈ అంశంపై దృష్టిసారించకుండా వేరే వైపు చూడమని అడిగి ఉంటాను.' ఆ 'సోదరి' మరెవరో కాదు, ఇందిరా గాంధీ.



భారత ప్రధాని మోదీతో శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే (ఫైల్ ఫొటో)

అనూహ్యంగా, శ్రీలంక జాతి కలహాల సమయంలో కొలంబోలో భారతదేశ మొదటి కార్యదర్శిగా ఉన్న నిరుపమారావు ఆ సమయంలో తన ప్రాణాలకు ముప్పు కలిగే స్థితిలో ఉన్నారు. ఏప్రిల్ 1న కచ్చతీవు వివాదం చెలరేగిన కొన్ని గంటల్లోనే తన ఎక్స్ (గతంలో ట్విట్టర్) అకౌంటులో నిరుపమ వ్యాఖ్యానిస్తూ, తనను 1983లో ఉన్నట్లుండి శ్రీలంక నుండి స్వదేశం పంపించి వేశారని రాశారు. '1974 ఒప్పందం ముగింపులో ఇందిరా గాంధీ, సిరిమావో బండారునాయకే మధ్య వ్యక్తిగత సమీకరణం నిర్ణయాత్మక పాత్ర పోషించింది' అని రాశారు. కచ్చతీవు చర్చల విషయంలో తనను రక్షించాల్సిందిగా ఇందిరకు బండారునాయకే వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశారనీ, లేకుంటే ఆమెకు రాజకీయంగా విపత్తు తప్పేది కాదనీ నిరుపమ చెప్పారు. దశాబ్దాల తర్వాత పూర్తిగా భిన్నమైన నేపథ్యంలో దీక్షిత్ దీన్నే చెప్పారు. తరువాత నిరుపమారావు 2004 నుండి 2006 వరకు కొలంబోలో హైకమిషనర్‌గా పనిచేశారు.

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ పార్థ ఘోష్ ఇలా రాశారు: 'బండారునాయకే దుఃస్థితిని ఇందిరా గాంధీ స్పష్టంగా గ్రహించారు. భారత ప్రతినిధి బృందం ప్రతిస్పందించకముందే పరిస్థితిని తారుమారు చేశారు. ఇందిర ప్రదర్శించిన ఈ ఔదార్యపు సంకేతాన్ని బండారునాయకే 1990 చివరిలో ఎంతో కృతజ్ఞతతో గుర్తు చేసుకున్నారు.' ఘోష్ ఆ సంవత్సరాన్ని 2000 అని పేర్కొని ఉండాలి, అంటే బండారునాయకే ప్రధానమంత్రిగా తన చివరి పదవీకాలం పూర్తయ్యే వరకు అన్నమాట. ఒక దశాబ్దం పాటు శ్రీలంక ఏకైక మహిళా అధ్యక్షురాలుగా ఉన్న ఆమె కుమార్తె చంద్రికా కుమారతుంగ కూడా భారత్ 1974లో ప్రదర్శించిన ఈ స్నేహపూర్వకమైన సంకేతాన్ని మరచిపోలేదు.

కొలంబోలో తనకంటే ముందే పనిచేసిన దీక్షిత్, నిరుపమా రావు కాలం నుండి కచ్చతీవు విషయంలో పెద్దగా మార్పు రాలేదనే వాస్తవాన్ని అమృత్‌సర్ నుండి బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తరణ్‌జిత్ సింగ్ సంధూ కూడా ధృవీకరించగలరు. సంధూ 2000 నుండి 2004 వరకు శ్రీలంకలో భారత రాయబార కార్యాలయంలో కౌన్సెలర్‌గానూ, హైకమిషనర్‌గానూ పనిచేశారు.

2017లో సంధు భారత హైకమిషన్‌లో బాధ్యతలు స్వీకరించినప్పుడు, శ్రీలంక బీజింగ్ అందాలకు పడిపోయింది. భారత ప్రభావ పరిధిలో ఉండటం మానేసింది. అధ్యక్షుడిగా మహింద రాజపక్స చైనా అనుకూల విధానాలను కలిగి ఉన్నప్పటికీ, తరణ్‌జీత్ సింగ్ సంధూ, ప్రతిపక్ష నాయకుడిగా రాజపక్సను ఒకసారి కాదు రెండుసార్లు భారత్‌ను సందర్శించేలా చేసే ఆహ్వానం కోసం పట్టుబట్టారు. ఆ రెండు సార్లలో మొదటి సందర్శన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, మహింద రాజపక్స మధ్య ఏర్పడిన బంధం... శ్రీలంక కీలకమైన రాజకీయవేత్తను భారత మద్దతుదారుగా మార్చింది. రెండేళ్ల తర్వాత, మహింద ప్రధాని అయినప్పుడు, భారత్ లెక్కించినట్లుగానే, ఆయన తొలి బాహ్య సదస్సు మోదీతోనే వర్చువల్‌గా జరిగింది. మహింద సోదరుడు గొటబయ రాజపక్స అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తన మొదటి పర్యటన కోసం భారత్‌నే ఎంచుకున్నారు.

ఏప్రిల్ 19న తమిళనాడులో ఓటింగ్ జరిగేదాకా పరిమిత రాజకీయ జీవితకాలమే ఉన్నప్పటికీ, కచ్చతీవు వివాదాన్ని ద్వైపాక్షిక సమస్యగా పొడిగించాలని కోరుకునే వారందరూ నేర్చుకోవలసిన ఒక పాఠం ఉంది. రాజపక్స కుటుంబం రాజకీయ అరణ్యంలో ఉన్నప్పటికీ భారత్–శ్రీలంక సంబంధాలు ఇప్పుడు అద్భుతంగా ఉన్నాయి. ప్రస్తుత శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే కంటే మెరుగైన మిత్రుడు భారత్‌కు దొరకరు. ప్రస్తుత ప్రధాని దినేశ్ గుణవర్దన విషయంలోనూ ఇది నిజం. యూఎస్‌లో తన క్లాస్‌మేట్ అయిన జయప్రకాశ్ నారాయణ్ ప్రభావంతో భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు దినేశ్ తండ్రి ఫిలిప్ గుణవర్దనను బ్రిటిష్‌వాళ్లు బొంబాయిలో బంధించారని కొద్దిమంది భారతీయులకే తెలుసు.

విదేశాంగ కార్యదర్శిగానూ పనిచేసిన నిరుపమారావు ప్రకారం, 'వియన్నా కన్వెన్షన్ ప్రకారం భారతదేశం ఏకపక్షంగా (కచ్చతీవు) ఒప్పందాన్ని రద్దు చేయలేదు. దేశం ఎదుగుతున్న శక్తిగా తనను తాను ప్రకటించుకుంటున్నప్పుడు ఒడంబడిక రద్దు అనేది అంతర్జాతీయ రాజకీయాల్లో తన ప్రతిష్ఠను కోల్పోయేలా చేస్తుంది.'

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శుభాకాంక్షలు



అందరికీ అస్సలామ్ అలైకుమ్. మా కుటుంబం నుంచి మీ కుటుంబానికి ఈద్ ముబారక్! సంపద, శాంతి, ఆశీర్వాదాలు మీ ఇంట్లో సమృద్ధిగా ఉండాలి. నిన్నంతా అమ్మతో వంటలు చేస్తూనే గడిపాను. తజిక్ సంబూసా, ఓర్జుక్, చాగల్‌దాక్, ఇంకా కుకీలు చేశాం.

– నిగోరా ఫజ్లుద్దీన్, తజికిస్తాన్ ఫిలింమేకర్


వారికే సరి



పాశ్చాత్య సంస్కృతి, అబ్రహామిక్ ఆలోచనా మార్గం ప్రభావాలతో పెరిగిన విదేశీ సిక్కు పిల్లలకు సనాతన జీవన విధానంతో పూర్తిగా సంబంధం తెగిపోయింది. కాబట్టే, ఖలిస్తాన్ భావజాలం వారికి సరిగ్గా సరిపోతోంది. నా అంచనాలో, విదేశాల్లోని సిక్కులు ఈ ఖలిస్తాన్ వాదాన్ని చాలా చాలా కాలం మోస్తూనే ఉంటారు.

– అర్శదీప్ సింగ్, జాతీయవాది

శిక్ష పడాల్సిందే!



సిరియాలోని ఇరానియన్ దౌత్య కార్యాలయం మీద జియోనిస్టు ప్రభుత్వం (ఇజ్రాయెల్) ఎప్పుడైతే దాడి చేసిందో, అది ఇరాన్ నేల మీద దాడి చేసినట్టే. ద్వేషపూరిత ప్రభుత్వం తప్పుడు ఎత్తు వేసింది. దానికి శిక్ష పడాలి, శిక్ష పడుతుంది.

– అలీ ఖొమేనీ, ఇరాన్ సుప్రీం లీడర్

రుణపడ్డాం!



జొరాస్ట్రియన్ పెర్షియన్లు (పార్సీలు) గ్రేటర్ ఇరాన్ నుంచి 8, 10 శతాబ్దాల మధ్య భారత ఉపఖండానికి వలస వస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు, స్థానిక హిందూ రాజు జైదీ రాణా ఆశ్రయం ఇవ్వడంతో ప్రస్తుత గుజరాత్‌లో స్థిరపడ్డారు. మా పూర్తి విధేయత, ప్రేమ, జీవితాలను ఇండియాకు రుణపడి ఉన్నాం.

– అర్నాజ్ హాథీరామ్, యాక్టివిస్ట్

తేలిన గెలుపు




ఈ పోస్టు పెట్టినందుకు నన్ను చంపొద్దు... కానీ టీవీ ఛానళ్లు అదేపనిగా 'ఇండియా నిర్ణయిస్తుంది' అని హెడ్‌లైన్లు పెడుతున్నాయి. నేను గమనిస్తున్నంతవరకూ ఇండియా ఇప్పటికే నిర్ణయించేసుకుంది.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ఇన్ బాక్స్

బడుగుల ఆశాజ్యోతి

గాంధీజీని 'మహాత్మ' అని భారతీయులు గౌరవించడానికి వందేళ్ళ ముందే... బడుగు బలహీన వర్గాలచే 'మహాత్ముడి'గా జన నీరాజనాలు అందుకున్న సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు జ్యోతిరావ్ గోవింద్ రావు పూలే. వారి తండ్రి గోవిందరావు మొదట్లో కూరగాయలు అమ్మేవారు. కాలక్రమేణా పీష్వా పరిపాలనా కాలంలో పూల వ్యాపారం చేయడంవల్ల వారి ఇంటి పేరు పూలేగా మార్పు చెందింది.



జ్యోతిబా పూలే

సంవత్సరం వయస్సులోపే తల్లిని కోల్పోయారు. అనేక ఇబ్బందులతో విద్యాభ్యాసం పూర్తి చేశారు. థామస్ పైన్ రచించిన 'మానవ హక్కులు' పుస్తకం ఆయన ఆలోచనలను ప్రభావితం చేసింది. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించి ముందు తన భార్య సావిత్రి బాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అంతేగాక అన్నికులాలవారు చదువుకునేలా పాఠశాలలను స్థాపించి, విద్యాభివృద్ధికి కృషి చేశారు. దేశంలోనే మొదటిసారిగా 'బాలహత్య ప్రతిబంధక్ గృహ' కేంద్రాన్ని స్థాపించి, వితంతు గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. 1848లో జరిగిన తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో పూలే కులవివక్షకు గురయ్యారు. ఆ క్షణం నుండి కుల వివక్షపై పోరాటం మొదలు పెట్టి సత్యాన్ని నిగ్గుతేల్చారు. కుల విధానంలో ఆయన బ్రాహ్మణులను విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు.


స్త్రీ–పురుష లింగ వివక్ష, కుల బానిసత్వాలపై అలుపెరుగని పోరాటం చేశారు. సామాజిక రుగ్మతల్ని నిర్మూలించడానికి 'గులాంగిరి', 'పూణే సత్య సోధక సమాజ నివేదిక', 'తృతీయ రత్న', 'ఛత్రపతి శివాజీ' వంటి రచనలు చేశారు. వితంతు మహిళలు, అనాథ శిశువుల కోసం 'సేవాసదనం' స్థాపించారు. భారతదేశంలో కులం గురించిన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలి దార్శనికులు పూలే. రైతుల, కార్మికుల సమస్యలు బాధలు వివరించేందుకు 'దీనబంధు' వారపత్రికను స్థాపించారు.

సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా॥ బీఆర్ అంబేడ్కర్ ప్రకటించారు. సమసమాజ స్థాపనకై అనునిత్యం శ్రమించిన జ్యోతిబా పూలే 1890 నవంబర్ 28న కన్నుమూశారు. బహుజనుల స్వాతంత్ర్యానికై సమరం సలిపిన ఆ మహనీయుడి జన్మదినాన వారిని స్మరించుకుందాం.

– డా॥ కమలేకర్ నాగేశ్వర్ రావు; అచ్చంపేట, నాగర్ కర్నూల్ జిల్లా
(నేడు జ్యోతిబా పూలే జయంతి)

అట్టడుగు వర్గాలకు చేరిన కొత్త నమూనా

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

శరదృతువు వేకువ వేళల్లో చెట్లకు పట్టి ఉండే మంచు మాదిరిగా పైకి కనిపించకుండా, ఒక 'ఫీల్ గుడ్' వాతావరణం ఈ రోజున మన రాష్ట్రమంతా ప్రజల్లో వ్యాపించి ఉంది. నాలుగు కారణాల వల్ల ఈ మానసిక స్థితి (ఫీల్) మన సమాజం అంచులలోని (మార్జినలైజ్డ్) ప్రజల వరకు చేరుతూ, క్రమంగా ఒక భావనగా వారిలోకి లోతుగా ఇప్పటికే అది ఇంకింది. ఇందుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి అని చూసినప్పుడు, మొదటిది– ప్రతి యాభై కుటుంబాలకు అయాచితంగా దొరికిన 'గైడ్' మాదిరిగా 'కనెక్ట్' అయిన 'వాలెంటీర్లు'. రెండవది – అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పథకంలో అందిన ఆర్థిక సహాయం. మూడవది – 'స్మార్ట్ ఫోన్' వినియోగం అన్ని ఆర్థిక వర్గాలకు చేరడం. చివరిది 'సంక్షేమ రాజ్యం' భావన స్థిరపడడానికిగాను ప్రజల సమీపానికి పరిపాలన చేరడానికి పాత 13 జిల్లాలు 26 కావడం.

మరి కొందరు దీన్ని – 'విధ్వంసం' అంటున్నారు కదా అంటే, అదీ నిజమే. కాలం చెల్లిన పాతవాటిని పక్కకు నెట్టి, వాటి స్థానంలోకి వచ్చే 'కొత్త' ఏదైనా అలా అనిపించడం సహజమే. అయితే, కాలంలో వచ్చే మార్పులో భాగంగా వేగం కోసం 'ఐ.టి.' ద్వారా 'స్మార్ట్ గవర్నెన్స్' సాంకేతికతను పరిపాలనకు అన్వయించే మార్పు ప్రక్రియ గురించి, రేపటి తరం ఏమని అనుకుంటున్నది? అనేది ఇక్కడ ప్రధానం. భవిష్యత్తు యువతదే కనుక వర్తమానం సమీక్షకు వాళ్ళే నిజమైన న్యాయ నిర్ణేతలు.

అయితే, నువ్వు ఏ కాలానికి అర్హమైన నాయకుడివి? అనేది ఇక్కడ అతి విలువైన అంశం. ఈ ప్రభుత్వం వేటి కేంద్రితంగా ఉన్నదో చూడండి– ఒకటి 'ప్రజలు'. రెండు 'ప్రాంతము.' చరిత్రలో ఈ రెండింటినీ లక్ష్యంగా చేసుకుని పరిపాలించిన రాజులు విఫలం కాలేదు. ఈ రెండింటి కోసం నీకున్న ఐదేళ్ళ కాలపరిమితిలో నువ్వు ఏమి చేశావు? అనేది ప్రజల ముందుకు వెళ్లి వాళ్లకు చెబితే చాలు. నీ నిజాయతీని ప్రజలు గమనించి మిగిలింది కూడా నువ్వే పూర్తి చెయ్యి, అని మళ్ళీ నీకే కుర్చీ అప్పగిస్తారు. మన రాష్ట్రంలోని ఆలోచనాపరులకు మన ప్రతిపక్ష నాయకుడి విషయంలో ఇక్కడే అనుమానం కలుగుతున్నది.

గతంలో 'జన్మభూమి' నుంచి 'విజన్–2020' వరకు ఎన్నో కొత్త కొత్త కార్యక్రమాలు కోసం మేథో కసరత్తు చేసిన అనుభవం పెట్టుకుని, ఇప్పుడు ఒక ప్రత్యామ్నాయ 'పబ్లిక్ పాలసీ'ని ప్రతిపక్షం తరపున లేదా వారి కూటమి తరపున గానీ ప్రకటించలేక పోవడం ఏమిటి? రాజకీయ విమర్శ కోసం సి.ఎం.ను– 'సైకో' అని, ప్రభుత్వ పరిపాలన 'విధ్వంసం' అని అన్నప్పుడు, ఆ మాటలకు సవివరమైన వివరణ ఎందుకు ఇవ్వరు? మీరు అంటున్న 'విధ్వంసం' నిజమై, అదే అనుభవం రాష్ట్ర ప్రజలకు కూడా ఉండి ఉంటే, అదేదో వివరం చెబితే ప్రజలు కూడా వాళ్ళూ మీతో 'కనెక్ట్' అవుతారు కదా? మీరు చేస్తున్న ఇటువంటి ఆరోపణలు అస్పష్టంగా ఎందుకు ఉంటున్నాయి?



ప్రభుత్వంపై చేస్తున్న విమర్శ విషయంలో ప్రతిపక్షం నిస్సహాయత చూశాక, 'కూటమి'ని పక్కనపెట్టి – 'కొత్త రాష్ట్రానికి కొత్త నమూనా పాలన అందిస్తున్న 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ' ప్రభుత్వం వల్ల ప్రయోజనాలు ఏమిటి? అనే వైపు మధ్యతరగతి ఆలోచనాపరుల దృష్టి మారింది. 'సాఫ్ట్‌వేర్' రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 'కరోనా' కాలంలో కంపెనీలు 'వర్క్ ఫ్రం హోమ్' అవకాశం ఇచ్చినప్పుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి రాకను ప్రోత్సహిస్తూ–'వర్క్ ఫ్రం హోమ్ టౌన్' నినాదంతో 'బి టైప్' పట్టణాల్లో 'టవర్ల' సామర్థ్యం పెంచి, స్థానిక ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో వీరి కోసం 'వైఫై' సేవలు ఏర్పాటు చేసింది. మన రాష్ట్రానికొస్తే ఏమిటి పరిస్థితి? అనేదానికి వీరికి ఇదొక – 'డ్రెస్ రిహార్సల్స్' అయింది.

అంతేకాదు, ప్రభుత్వ ప్రాధాన్యతలుగా మారిన విద్య, వైద్యం, శాంతి భద్రతలు; 'లీజర్' కోసం రూపు మారుతున్న 'పబ్లిక్ పార్కులు', రెస్టారెంట్లు, అందుబాటులోకి వస్తున్న 'క్యాబ్ సర్వీసులు'... ఇవన్నీ ఇక ముందు యువత మన రాష్ట్రంలో విస్తరిస్తున్న కంపెనీల్లో ఉపాధి వెతుక్కునే అంశాలు. ఇందులో వీరి అమ్మానాన్నల 'పిల్లలు దగ్గరలో ఉద్యోగం చేసుకుంటూ అందుబాటులో ఉంటే బాగుండు' అన్న ఆశను స్పర్శించే అంశం కలిసి ఉందనేది విడిగా చెప్పనక్కరలేదు. ఈ అంశంపై వ్యాసం రాయడం మొదలు పెట్టినప్పుడు 'వాలంటీర్ల' వివాదం అప్పటికి ఇంకా మొదలు కాలేదు. దీన్ని ముగించేటప్పటికి రాష్ట్రంలో మారిన సామాజిక సన్నివేశం, పైన చెప్పిన 'ఫీల్ గుడ్' భావనను వాస్తవం చేసింది. కొత్త రాష్ట్రానికి కొత్త నమూనా పాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వల్ల ఒనకూరే ప్రయోజనాలు ఏమిటి? అనే వైపు మధ్యతరగతి ఆలోచనాపరుల దృష్టి ఇప్పటికే మారింది. ఇక ముందు మన అనుభవంలోకి రానున్న రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా రచనలో ఏమున్నదీ ఆ పార్టీ ఎన్నికల 'మ్యానిఫెస్టో'లో వెల్లడి కావలసి ఉంది.

వ్యాసకర్త అభివృద్ధి అంశాల వ్యాఖ్యాత

మానవ హితమే ఆశయం

సమాజంలో అందరూ ఒకేలా ఉండరు. ఒకే చేతికున్న ఐదు వేళ్ళూ సమానంగా లేనట్లే, మానవ జాతికి చెందిన మనుషులంతా ఒకేలా ఉండరు. కొందరు సంపన్నులు, కొందరు నిరుపేదలు, కొందరు దాతృస్వభావులు, కొందరు పిసినారులు, కొందరు బుద్ధిమంతులు, కొందరు బుద్ధిహీనులు ఉంటారు. ఇదేవిధంగా కొందరు సమఉజ్జీలు కూడా ఉంటారు. అందరినీ దేవుడు పరీక్షిస్తున్నాడు. ఎవరికి ఏ స్థితి ప్రాప్తమైనా, వారు అదే స్థితిలో పరీక్షించ బడుతున్నారు. ఇదేవిధంగా దైవం వారికి బాధ్యతలు కూడా పంచాడు. విధులనూ నిర్ణయించాడు. అందులో భాగంగానే సదఖ, ఫిత్రా, ఖైరాత్, జకాత్ లాంటి వివిధ రూపాల్లో సమాజంలోని పేదసాదల చేయూతకు ఏర్పాట్లు చేశాడు.



సమాజంలో అందరూ నిండు సంతోషంతో జీవితం గడపాలంటే, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలి. దానికో క్రమబద్ధమైన నియమం, నిబంధనావళి ఉండాలి. అందుకే దైవం సంవత్సరానికొకసారి ఒక నెలరోజుల పాటు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశాడు. రమజాన్ నెల రోజులూ మనిషి పగలంతా ఉపవాసం పాటిస్తాడు. దీనివల్ల ఆకలిదప్పుల బాధ ఎలా ఉంటుందో తెలుస్తుంది. ఫలితంగా ఒక్కపూట అన్నానికి సైతం నోచుకోని అసంఖ్యాక నిరుపేదల పట్ల మనసులో సానుభూతి భావాలు వికసిస్తాయి. ఏదో ఒకరూపంలో అలాంటి వారిని ఆదుకోవాలన్న బలమైన ఆలోచన మనసులో జనిస్తుంది. రమజాన్ నెలలో స్వీయ సంస్కరణతోపాటు, సమాజ సంస్కరణ, మానవ హితం కోసం కొన్ని నియమాలు నిర్దేశించబడ్డాయి. రోజా, తరావీహ్, ఫిత్రా, జకాత్ తదితర నియమాలు అందులో భాగమే. రమజాన్ నెల చివరి రోజుల్లో, పండుగ నమాజుకు ముందు కుటుంబ సభ్యులందరి తరపున ఒక నిర్ణీత కొలతలో ధాన్యంగాని, రొక్కంగాని చెల్లించడాన్ని 'ఫిత్రా' అని అంటారు. సంవత్సరానికొకసారి తమ నిల్వ ఆదాయంలో నుండి నూటికి రెండున్నర శాతం చొప్పున తీసి పేదసాదల కోసం ఖర్చు చేయడాన్ని 'జకాత్' అంటారు. సమాజంలో అందరూ సుఖసంతోషాలతో జీవితం గడపాలన్నది ఈ ఫిత్రా, జకాత్, సదఖ, ఖైరాత్ తదితర దానాల అసలు ఉద్దేశ్యం. నెలరోజులపాటు పొందిన శిక్షణ పండుగ తరువాతి జీవితంలోనూ కొనసాగాలి. అందుకని దేవుడు మనకు కల్పించిన అవకాశాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటూ, సమాజంలోని సాటి మానవ సమూహం పట్ల, ముఖ్యంగా పేదసాదలు, బడుగు బలహీన వర్గాల పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అదే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినం మనకిస్తున్న సందేశం.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్
(నేడు ఈదుల్ ఫిత్ర్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.తదియ సా.6.31 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** భరణి ఉ.6.05 వరకు, తదుపరి కృత్తిక తె.5.16 వరకు (తెల్లవారితే శుక్రవారం), **వర్జ్యం:** సా.5.40 నుండి 7.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.52 నుండి 3.42 వరకు, **అమృత ఘడియలు:** రా.2.55 నుండి 4.28 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.10.

ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రజాదరణ

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రికార్డు స్థాయిలో వైద్య సేవలు



- టీడీపీ హయాంలో యూపీహెచ్‌సీలపై నిర్లక్ష్యం
- అప్పట్లో చిన్న అనారోగ్యమైనా ప్రైవేట్ ఆస్పత్రులకే జనం
- ఇప్పుడు సకల పరీక్షలు, మందులు, ఇద్దరేసి వైద్యులతో బలోపేతం
- భారీగా పెరిగిన ఔట్ పేషెంట్ సేవలు
- 542 యూపీహెచ్‌సీల్లో 11 నెలల్లో 61.47 లక్షల మందికి ఔట్ పేషెంట్ సేవలు
- ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతంతో స్పష్టంగా కనిపిస్తున్న మార్పు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రజాదరణ పెరిగింది. పట్టణాల్లోనూ ఇంటి పక్కనే సర్కారు వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రాథమిక స్థాయి నుంచి ఆస్పత్రులను సీఎం వైఎస్ జగన్ సర్కారు బలోపేతం చేయడంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీ)నూ సకల పరీక్షలు, వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. నాడు–నేడు పేరుతో యూపీహెచ్‌సీల్లో సౌకర్యాలు, వైద్య పరీక్షలు, అవసరమైన మందులతో పాటు ఇద్దరేసి వైద్యులు, నర్సుల్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సుమారు రూ.700 కోట్లతో వీటిని ఆధునికీకరించారు. ఫలితంగా ఇప్పుడు యూపీహెచ్‌సీలకు వైద్య సేవల కోసం వెళ్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది.

చంద్రబాబు హయాంలో పడకేసిన వైద్యం

చంద్రబాబు హయాంలో యూపీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలతోపాటు అన్ని సేవలనూ ప్రైవేట్ పరం చేయడమే కాకుండా వైద్యులు, నర్సులను భర్తీ చేయలేదు. టీడీపీ పాలనలో యూపీహెచ్‌సీలపై నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు యూపీహెచ్‌సీల వైపు చూసేవారు కాదు. చిన్నపాటి అనారోగ్యమైనా జనమంతా ప్రైవేట్ ఆస్పత్రులకే వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. అప్పట్లో నెలకు కేవలం వేల సంఖ్యలోనే ఔట్ పేషెంట్ల సేవలందేవి. ఇందుకు ప్రధాన కారణం వైద్య పరికరాలు, వైద్యులు, మందులు అందుబాటులో ఉండేది కాదు. దీంతో ప్రజలంతా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేదని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పుడు అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు, వైద్యులు అందుబాటులో ఉండటంతో యూపీహెచ్‌సీలకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, అప్పటికి ఇప్పటికీ ఇదే మార్పు అని వైద్యులతోపాటు పేషెంట్లు సైతం చెబుతున్నారు.

ఇంతలోనే.. ఎంతో మార్పు

సీఎం వైఎస్ జగన్ వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి.. సంపూర్ణ సౌకర్యాలు సమకూర్చడంతోపాటు వైద్యులు, వైద్య సిబ్బందిని భారీగా నియమించారు. ఫలితంగా పట్టణ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల గడప తొక్కడం మానేసి.. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. ఫలితంగా యూపీహెచ్‌సీలకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గర్భిణి పరీక్షల నుంచి చిన్నపాటి సుస్తీ చేసినా వైద్య సేవలకు, పరీక్షలకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రజలు వెళ్తున్నారు. మొత్తం 65 రకాల పరీక్షలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులోకి వచ్చాయి. దీంతో యూపీహెచ్‌సీలలో ఔట్ పేషెంట్ల సంఖ్య భారీగా పెరిగింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు 542 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రికార్డు స్థాయిలో 61.47 లక్షల మందికి ఔట్ పేషెంట్ సేవలను అందించారు. అంటే రోజుకు సగటున ఒక్కో యూపీహెచ్‌సీలో 40 మందికి పైగా ఔట్ పేషెంట్ సేవలు అందించారు. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఎస్) ద్వారా ఔట్ పేషెంట్ల డేటాను నమోదు చేశారు. మరోవైపు 2022 ఫిబ్రవరి నుంచి 542 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత నెల 21వ తేదీ వరకు 92,82,536 ల్యాబ్ పరీక్షలు సైతం నిర్వహించారు.

గత 11 నెలల్లో 542 యూపీహెచ్‌సీలలో నెలవారీగా ఔట్ పేషెంట్ల నమోదు ఇలా..

నెల	ఔట్ పేషెంట్ల సంఖ్య
2023 ఏప్రిల్	5,21,095
2023 మే	5,39,441
2023 జూన్	5,45,466
2023 జూలై	5,76,775
2023 ఆగస్ట్	5,64,155
2023 సెప్టెంబర్	5,64,157
2023 అక్టోబర్	5,91,057
2023 నవంబర్	5,78,329
2023 డిసెంబర్	5,20,588
2024 జనవరి	5,63,007
2024 ఫిబ్రవరి	5,83,060
మొత్తం	61,47,130

ఖరీదైన పరీక్షలు ఉచితం



గత ప్రభుత్వంలో గర్భిణి పరీక్షల్ని ప్రైవేట్ ల్యాబ్‌లో చేయించుకోవాల్సి వచ్చేది. ఇందుకు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చయ్యేవి. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు రావడంతో ఖరీదైన వైద్య పరీక్షల్ని సైతం ఉచితంగా పొందగలుగుతున్నాం. ఆర్థిక స్థోమత లేకపోతే కేజీహెచ్‌కి వెళ్లే వాళ్లం. ఇప్పుడు సమీపంలోని ఇసుక తోటలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు రావడంతో ఆరోగ్యానికి భరోసా లభించింది.

– పి.సుజాత, గర్భిణి, మద్దిల పాలెం, విశాఖపట్నం

నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయి



పట్టణాల్లో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి పేదలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్యం అందిస్తోంది. ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా పెద్దాస్పత్రికి పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఇంటి పక్కనే వైద్యం అందుతోంది. టీడీపీ హయాంలో ప్రభుత్వ వైద్యం అందేది కాదు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా దూర ప్రాంతాలకు వెళాల్సి వచ్చేది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. సీఎం వైఎస్ జగన్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సౌకర్యాలు కల్పించడంతో పేదలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందుతున్నాయి. పరీక్షలన్నీ ఇక్కడే చేస్తున్నారు. ముందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు.

– సూరాడ ఈశ్వరమ్మ, 12వ డివిజన్, సంజయ్ నగర్, కాకినాడ

క్లుప్తంగా...

13 నుంచి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ క్రీడా పోటీలు

విజయవాడస్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళల క్రీడా పోటీలను ఈ నెల 13వ తేదీనుంచి 15వ తేదీ వరకు ఏలూరులోని ఏఎస్ఆర్ఏఎం మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, త్రోబాల్, చెస్ క్రీడాంశాల్లో జరిగే ఈ పోటీలకు వర్సిటీ పరిధిలోని 25 మెడికల్, డెంటల్ కళాశాలల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి ఈ పోటీలను ప్రారంభిస్తారని, ప్రారంభోత్సవ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, ఏఎస్ఆర్ఏఎం కాలేజీ చైర్మన్ గోకరాజు గంగరాజు, డైరెక్టర్ జి.రతీదేవి పాల్గొంటారన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం


గ్లోబ్ ఆకారంలో ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ నమూనా

సాక్షి, విశాఖపట్నం: విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్.. ఇప్పుడు మరో కీలక ఆవిష్కరణకు కేంద్ర బిందువుగా మారింది. వైద్య పరిశోధనలు, పరిశోధనలకు సంబంధించిన శిక్షణలు అందించేందుకు మెడ్‌టెక్ జోన్‌లో ప్రత్యేక కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అత్యాధునిక మెడికల్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన పరిశోధనలు దేశ, విదేశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ నుంచే నిర్వహించేలా దీన్ని నిర్మిస్తున్నారు. మెడికల్ రీసెర్చ్ ట్రెనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. ప్రపంచానికి కనెక్ట్ అయ్యే విధంగా గ్లోబ్ ఆకారంలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు. మరో రెండు నెలల్లో ఈ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి.

నిత్యాన్నదానానికి రూ.10 లక్షలు విరాళం


ఈవోకు చెక్కు అందజేస్తున్న రత్నాకరరావు

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కేతినేని వెంకటరత్నం, శేషమ్మల జ్ఞాపకార్థం వారి మనవడు రత్నాకరరావు, శమంతకమణి దంపతులు రూ.10 లక్షలు విరాళమిచ్చారు. సంబంధిత చెక్‌ను ఆలయ ఈవో రమేష్‌నాయుడుకు బుధవారం అందజేశారు. దాతలకు ఆలయాధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

ఒంగోలులో వైఎస్సార్‌సీపీ ప్రచారాన్ని అడ్డుకున్న టీడీపీ


పోలీసుల ఎదుటే వైఎస్సార్‌సీపీ నేతలను కవ్విస్తున్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు నగరంలో వైఎస్సార్‌సీపీ ప్రచారాన్ని టీడీపీ నేతలు అడ్డుకుని రెచ్చగొట్టేలా ప్రవర్తించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒంగోలు 37వ డివిజన్ సమతా నగర్‌లో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు శ్రీకావ్య ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో ఒకటో లైన్‌లో హిమశ్రీ అపార్ట్‌మెంట్ లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఇంతలో ఆ అపార్ట్‌మెంట్‌లోనే అద్దెకు ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ చప్పిడి లక్ష్మీనారాయణ చౌదరి.. శ్రీకావ్యను అడ్డుకున్నారు. అంతేకాకుండా అపార్ట్‌మెంట్ గేటుకు తాళం వేశాడు. అప్పటికీ శ్రీకావ్య 'మీ ఇంటికి రావద్దు అంటే రాకుండా ఉంటాం.. అపార్ట్‌మెంట్‌లో మిగతా ఫ్లాట్లు ఉన్నాయి కదా వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేసుకుంటాం' అన్నా వినిపించుకోలేదు. ఇంతలోనే కానిస్టేబుల్ భార్య ప్రభావతి.. టీడీపీ నేత మేడికొండ మోహన్‌రావుకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ వాళ్లు వచ్చి కొడుతున్నారని చెప్పింది. దీంతో హడావుడిగా మోహన్ రావు తన అనుచరులతో అక్కడకు వచ్చి బూతులు తిడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశాడు. కొద్దిసేపటి తర్వాత టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నారు. ఆయన రావడంతో టీడీపీ మూకలు మరింతగా రెచ్చిపోయాయి. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తోపులాటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు, తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డితో పాటు నగరంలోని పోలీస్ బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రిమ్స్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డి పరామర్శించారు.

పల్లికొండేశ్వర స్వామి సేవలో 'సుప్రీం' న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్


తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో జస్టిస్ సంజయ్ కరోల్

నాగలాపురం (తిరుపతి జిల్లా)/చంద్రగిరి (తిరుపతి జిల్లా): సుప్రీంకోర్టు న్యాయమూర్తి సంజయ్ కరోల్ బుధవారం నాగలాపురం మండలంలోని సురుటపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ పల్లి కొండేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ ప్రదోష మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి వెంట తిరుపతి జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు, నగరి జూనియర్ సివిల్ జడ్జి వర్మ, ఆలయ పాలక మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి ఉన్నారు. అనంతరం సుప్రీం కోర్టు న్యాయమూర్తి మండల కేంద్రంలోని శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు, ఆలయ అధికారులు ఆయనను సత్కరించారు.


పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో జస్టిస్ సంజయ్ కరోల్‌కు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు

అమ్మవారి సేవలో: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ బుధవారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధుసూదన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. న్యాయమూర్తి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనాన్ని, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉగాది మహోత్సవాలకు పూర్ణాహుతి


పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న ఈవో పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల్లో చివరి రోజు బుధవారం యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృదం కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతిలో భాగంగా శాస్త్రోక్తంగా నారికేళాలు, సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగాన్ని పూర్తి చేశారు. అనంతరం వసంతోత్సవం జరిపించారు. చండీశ్వరస్వామికి ఆలయంలోని మల్లికా గుండంలో అవభృదం, త్రిశూల కార్యక్రమాలు జరిపించారు. చండీశ్వరస్వామికి మల్లికాగుండంలో త్రిశూల స్నానాన్ని నిర్వహించారు. ఉగాది మహోత్సవాల్లో నిర్వహిస్తోన్న అలంకారాల్లో భాగంగా చివరి రోజు శ్రీభ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని భ్రమరాంబాదేవి నిజాలంకార రూపంలో దర్శనమిచ్చారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ చేపట్టారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక అలంకరణ పూజాధికాలను నిర్వహించి హరతులిచ్చి ఆలయ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. దీంతో శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ముగిశాయి.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

నూజివీడు/మండవల్లి/నరసాపురం రూరల్/కంకిపాడు / జమ్మలమడుగు రూరల్ (మైలవరం): రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు భారీగా కొనసాగుతున్నాయి. ఏలూరు జిల్లా నూజివీడు మండలం జంగంగూడెంలో బుధవారం టీడీపీకి చెందిన 45 కుటుంబాలవారు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

- ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం మండవల్లిలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సమక్షంలో 15మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.
- పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం చామకూరిపాలెం గ్రామంలో జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ప్రసాదరాజు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.
- కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కుందేరు గ్రామానికి చెందిన టీడీపీ నేత మరీదు హరిబాబుతో పాటు 30 కుటుంబాలవారు మంత్రి జోగి రమేష్ సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు.
- మాజీ మంత్రి దేవగుడి ఆదినారాయణరెడ్డి ప్రధాన అనుచరుడు, జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మాజీ ఎంపీపీ నారాపురెడ్డి మాధవి భర్త నారాపురెడ్డి మోహన్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులు సుమారు వంద మంది తమ కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ జిల్లా మైలవరం మండలంలోని చిన్న కొమ్మెర్ల గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.


ఏలూరు జిల్లా జంగంగూడెంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు


ఏలూరు జిల్లా మండవల్లిలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు


నరసాపురంలో ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ శ్రేణులు


వైఎస్సార్ జిల్లాలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మోహన్‌రెడ్డి, అనుచరులు

నేటి అర్ధరాత్రి నుంచి 'మత్స్య' వేట నిషేధం అమలు

నిషేధకాలంలో ఏటా మత్స్యకార భృతి అందించిన ప్రభుత్వం
ఏటా సగటున 1.16 లక్షల మందికి ఐదేళ్లలో రూ.538 కోట్ల భృతి
డీజిల్ ఆయిల్ సబ్సిడీ రూపంలో ఐదేళ్లలో రూ.148 కోట్ల లబ్ధి

సాక్షి, అమరావతి: రెండు నెలల విరామం కోసం బోట్లు తీరానికి చేరుకోనున్నాయి. చేపల పునరుత్పత్తి కోసం 61 రోజుల పాటు అమలు చేయనున్న వేట నిషేధం ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు మత్స్యశాఖ కమిషనర్ ఏ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే బోట్లతో సహా అందులో ఉండే మత్స్యసంపదను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆయా బోట్ల యజమానులు ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ (4)కింద శిక్షార్హులని తెలిపారు. జరిమానా విధించడమే కాకుండా డీజిల్ ఆయిల్ రాయితీతో పాటు అన్ని రకాల సౌకర్యాలను నిలిపేస్తామని పేర్కొన్నారు. నిబంధనలు అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్టుగార్డు, కోస్టల్ సెక్యూరిటీ, నేవీ, రెవెన్యూ అధికారులతో కూడిన బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తారని తెలిపారు.

ఐదేళ్లలో రూ.538 కోట్ల మత్స్యకార భృతి

రాష్ట్రంలో తడ మొదలుకుని ఇచ్ఛాపురం వరకు 974 కిలో మీటర్ల మేర విస్తరించిన సముద్ర తీరంలో 555 మత్స్యకార గ్రామాల్లో 8.50 లక్షల మంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వారిలో 1.60 లక్షల కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. డీజిల్ సబ్సిడీని రూ.6.03 నుంచి రూ.9కు పెంచడంతో ఏటా వేటకు వెళ్లే బోట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. మొత్తం బోట్ల సంఖ్య 2019–20లో 14,229 బోట్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య ఏకంగా 29,964కు చేరింది. వీటిలో 1,610 మెకనైజ్డ్, 22,011 మోటరైజ్డ్, 6,343 సాంప్రదాయ బోట్లున్నాయి. వీటిపై వేట సాగించే మత్స్యకార కుటుంబాలకు వేట విరామ సమయంలో రూ.4 వేల చొప్పున ఇచ్చే వేట నిషేధ భృతిని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.10 వేలకు పెంచింది. పైగా ఈ మొత్తాన్ని నిషేధ కాలం ముగియకుండానే ప్రతీ ఏటా మే నెలలోనే వారి ఖాతాలకు నేరుగా జమ చేస్తూ గంగపుత్రులకు అండగా నిలిచింది. టీడీపీ ఐదేళ్లలో 3 లక్షల మందికి రూ.104.62 కోట్ల భృతిని అందిస్తే, గడిచిన ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం 5.38లక్షల మందికి రూ.538.01 కోట్ల భృతిని అందించింది. అలాగే డీజిల్ సబ్సిడీ కింద టీడీపీ ఐదేళ్లలో రూ.59.42 కోట్లు అందించగా, ఈ ప్రభుత్వ హయాంలో రూ.148 కోట్లు అందించింది.

ఐదేళ్లూ మత్స్యకార భృతినందుకున్నా..

నాకు తెప్పనావ ఉంది. 20 ఏళ్లుగా ఈ నావే జీవనాధారం. గతంలో వేట విరామ సమయంలో జీవనాధారం లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. కానీ ప్రస్తుతం భృతిని రూ.10వేలకు పెంచడమే కాదు నిషేధ సమయంలోనే అందిస్తున్నారు. ఐదేళ్లుగా మత్స్యకార భృతిని అందుకున్నా.

– కోడా లక్ష్మణ్, బోటు యజమాని, దొండవాక, అనకాపల్లి జిల్లా

మత్స్యకారులంతా జగన్ వెంటే..

స్వాతంత్ర్యానంతరం మరే ప్రభుత్వం చేయలేని రీతిలో మత్స్యకారుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిలా పాటుపడిన మరో నాయకుడు లేరనే చెప్పాలి. వేట నిషేధ భృతిని రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచడమే కాదు..ఏటా క్రమం తప్పకుండా నిషేధ సమయంలోనే అర్హులైన ప్రతీ మత్స్యకారుని అందించి అండగా నిలిచారు. మత్స్యకారులతో పాటు ఆక్వారైతులు జీవితాంతం సీఎంకు రుణపడి ఉంటారు.

– లంకె వెంకటేశ్వరావు, మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కృష్ణా జిల్లా

ఉద్యోగాల పేరుతో మోసం

నేరస్తుడిని పట్టుకున్న సీఐడీ

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఉద్యోగాల పేరుతో పలువురిని మోసం చేసిన సైబర్ నేరస్తుడిని సీఐడీ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం విశాఖలో సీఐడీ డీఎస్పీ కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నం జిల్లా జుత్తాడకు చెందిన గిన్ని గోపి బీటెక్ చదివాడు. హైదరాబాద్ లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసి.. ఉద్యోగం మానేశాడు. ఆ తర్వాత ఉద్యోగాల పేరుతో మోసాలు మొదలుపెట్టాడు. లింక్డ్ ఇన్ వెబ్‌సైట్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను సేకరించేవాడు. వారికి కాల్స్ చేసి.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి, డబ్బులను తన ఖాతాలో జమ చేయించుకునేవాడు. ఇలా ఏపీ, ఇతర రాష్ట్రాలతో కలిపి రూ.8 లక్షలకు పైగా వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీకి ఎదురుందా!

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఎదురీతే

కాలూచేయీ కూడదీసుకునే యత్నం

కదనోత్సాహంతో కమలనాథులు

భౌగోళికంగా భారత్‌కు గుండెకాయ వంటిది మధ్యప్రదేశ్. ఈ హిందీ బెల్టు రాష్ట్రంలో ఎన్నికల పోరు ఎప్పుడూ జాతీయ పార్టీల మధ్యే. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో దుమ్మురేపిన బీజేపీ ఉరిమే ఉత్సాహంతో లోక్‌సభ సంగ్రామంలో దూకగా కాంగ్రెస్ కూడా విపక్ష ఇండియా కూటమి దన్నుతో సత్తా చాటేందుకు పావులు కదుపుతోంది...


శివరాజ్‌సింగ్


జ్యోతిరాదిత్య


నకుల్‌నాథ్


దిగ్విజయ్



మధ్యప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యే అధికార మార్పిడి జరుగుతూ వస్తోంది. కాకపోతే దాదాపు పాతికేళ్లుగా రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యమే సాగుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 సీట్లతో అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించి బీఎస్పీ, స్వతంత్రుల సాయంతో గద్దెనెక్కినా అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. అసంతృప్త కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా 2020లో తిరుగుబాటు చేయడంతో కమల్‌నాథ్ సర్కారు కుప్పకూలింది. శివరాజ్ సింగ్ చౌహాన్ సారథ్యంలో మళ్లీ బీజేపీ సర్కారే కొలువుదీరింది. మధ్యప్రదేశ్‌లో 29 లోక్‌సభ సీట్లున్నాయి. 10 సీట్లను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 28 సీట్లు కొల్లగొట్టగా కాంగ్రెస్ ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. గత డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ జోరే కొనసాగింది. 230 అసెంబ్లీ సీట్లలో ఏకంగా 163 స్థానాలను ఒడిసిపట్టింది.

బీజేపీ ఓబీసీ కార్డు, కాంగ్రెస్ మైనారిటీ జపం

మధ్యప్రదేశ్ ఎన్నికల సమీకరణాల్లో కులాలదీ కీలక పాత్రే. అగ్రవర్ణ ఓటు బ్యాంకును పటిష్ట పరుచుకుంటూనే ఇతర సామాజిక వర్గాలను కూడా తమవైపు తిప్పుకోవడంపై బీజేపీ దృష్టి సారించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కుల గణన హామీని విస్తృతంగా ప్రచారం చేసినా ఓబీసీ ఓట్లను సాధించడంలో విఫలమైంది. 2018తో పోలిస్తే బీజేపీ మరింత మంది ఓబీసీలను, ఆదివాసీలను తమవైపు తిప్పుకోగలిగింది. అనూహ్యంగా యాదవ సామాజికవర్గానికి చెందిన మోహన్ యాదవ్‌ను సీఎం చేయడం ఓబీసీల ఓట్లు సాధించి పెడుతుందని ఆశిస్తోంది. ఇతర హిందీ బెల్ట్ రాష్ట్రాల్లోనూ కీలకమై యాదవ ఓటు బ్యాంకు తనవైపు మళ్లుతుందని భావిస్తోంది. రాష్ట్రంలో 7 శాతం ఓటు బ్యాంకున్న ముస్లింలతో పాటు ఎస్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గుతున్నారు.

> 'సరికొత్త భారత నిర్మాణమే నా మిషన్. చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ఇందుకు ప్రజల దీవెనలు కావాలి. నేను మహాకాలుడి భక్తున్ని. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదు'
>
> – మంగళవారం మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో ఎన్నికల ర్యాలీలో మోదీ

స్టేట్ స్కాన్

కాషాయ దళంలో జోష్

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు జోష్‌లో ఉన్న బీజేపీ ఈసారి మొత్తం 29 స్థానాలనూ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. అయోధ్య రామమందిర నిర్మాణం, మోదీ, అభివృద్ధి, హిందుత్వ నినాదం ఈసారి కమలనాథులు ప్రచార అస్త్రాలుగా ఉన్నాయి. సీఎంగా దాదాపు పాతికేళ్ల రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన శివరాజ్ సింగ్ ఈసారి విదిశ నుంచి లోక్‌సభ బరిలోకి దిగుతుండటం విశేషం! కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య గుణ నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ సింగిల్‌గా పోటీ చేస్తోంది. నాలుగు విడతల్లో పోలింగ్ జరుగుతుండగా ఇప్పటికే అభ్యర్థులందరినీ ప్రకటించింది. ప్రధాని మోదీ మధ్యప్రదేశ్‌లో సుడిగాలి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. తాజాగా మంగళవారం బాలాఘాట్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో విపక్షాలపై పదునైన వాగ్బాణాలు సంధించారు. తాను అభివృద్ధి చేస్తుంటే దూషిస్తున్నారని, దేశ భద్రతకు గ్యారంటీ ఇస్తుంటే బురద జల్లుతున్నారని, అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తున్నప్పుడూ అనరాని మాటలన్నారని విరుచుకుపడ్డారు. బీజేపీ నేతలు కూడా కాంగ్రెస్‌పై పదునైన విమర్శలతో వేడి పుట్టిస్తున్నారు.

కాంగ్రెస్ కోలుకునేనా...!

అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం చతికిలపడుతోంది. సింధియా వంటి కీలక యువ నేతను చేజార్చుకోవడం ఈసారి హస్తం పార్టీకి మరింత ప్రతికూలంగా మారింది. ఇండియా కూటమి దన్నుతో బీజేపీని ఢీకొట్టి పూర్వ వైభవాన్ని అందుకునేందుకు ప్రయత్నిస్తోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా మలచుకుంటోంది. కులగణన హామీ ద్వారా ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకులపై కన్నేసింది. రాహుల్ ప్రకటించిన యువతకు 30 లక్షల ప్రభుత్వోద్యోగాల హామీపైనా ఆశలు పెట్టుకుంది. 6 న్యాయాలు, 25 గ్యారంటీల మ్యానిఫెస్టోతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. సమాజ్‌వాదీ పార్టీకి ఖజురహో స్థానం కేటాయించి మిగతా 28 చోట్ల పోటీ చేస్తోంది.

బీజేపీకే ఓటేస్తున్న సర్వేలు

సాధారణంగా మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సరళి జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా ఉంటుంది. ఆ లెక్కన మొత్తం 29 సీట్లనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని పలు సర్వేలు అంచనా వేశాయి. మరికొన్ని 27 సీట్లిచ్చాయి. కాంగ్రెస్ గట్టిగా పుంజుకోని పక్షంలో 2 సీట్లకు మించకపోవచ్చన్నది మెజారిటీ ఒపీనియన్ పోల్స్ అంచనా.

– సాక్షి, నేషనల్ డెస్క్





పశ్చిమబెంగాల్‌లోని ఉత్తరపారాలో ఎన్నికల ప్రచారంలో ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దు చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి కళ్యాణ్ బెనర్జీ

బరిలో కుబేరులు

తొలి దశ అభ్యర్థుల్లో 450 మంది కోటీశ్వరులు

రూ.717 కోట్లతో తొలి స్థానంలో కాంగ్రెస్ నేత నకుల్‌నాథ్



లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతున్న వారిలో కోట్లకు పడగలెత్తిన వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. ప్రధాన పార్టీల టికెట్లు దక్కించుకునేందుకు ధనబలం కూడా ప్రాతిపదికగా మారుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో తొలి విడతలో బరిలో ఉన్న 1,625 మంది అభ్యర్థుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు కోటీశ్వరులేనని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (ఏడీఆర్) వెల్లడించింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో 102 లోక్‌సభ స్థానాల్లో ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ జరగనుంది.

బీజేపీ నుంచే ఎక్కువ...



తొలి విడతలో మొత్తం 1,625 మంది అభ్యర్థుల్లో 450 మందికి రూ.కోటి, అంతకంటే ఎక్కువ ఆస్తులున్నాయి. జాబితాలో బీజేపీ నుంచి అత్యధికంగా 69 మంది ఉన్నారు. తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (49 మంది), అన్నాడీఎంకే (35), డీఎంకే (21), బీఎస్పీ (18), టీఎంసీ (4), ఆర్జేడీ (4 మంది) ఉన్నాయి. అభ్యర్థుల సగటు ఆస్తులపరంగా అన్నాడీఎంకే టాప్‌లో ఉంది. ఈ పార్టీ అభ్యర్థులు ఒక్కొక్కరికి సగటున రూ.35.61 కోట్ల ఆస్తులున్నాయి. తొలి దశ అభ్యర్థుల్లో అత్యంత సంపన్నుడిగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్ నిలిచారు. అఫిడవిట్లో వెల్లడించిన ఆయన ఆస్తుల విలువ రూ.717 కోట్లు. ఛింద్వారా సిటింగ్ ఎంపీ అయిన ఆయన ఈసారి కూడా అక్కడినుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. రెండో స్థానంలో తమిళనాడులోని ఈరోడ్ అభ్యర్థి అశోక్ కుమార్ ఉన్నారు. ఈ అన్నాడీఎంకే నేత తనకు రూ.662 కోట్ల ఆస్తులున్నట్టు పేర్కొన్నారు. 10 మంది స్వతంత్ర అభ్యర్థులు తమకు ఎలాంటి ఆస్తులూ లేవని ప్రకటించడం విశేషం!

93 మంది నేరచరితులు

తొలి విడతలో బరిలో ఉన్న అభ్యర్థుల్లో నేరచరిత్ర కలిగిన వారి సంఖ్య కూడా ఎక్కువే. జాబితాలో బీజేపీ నుంచి 28 మంది, కాంగ్రెస్ నుంచి 19 మంది ఉన్నారు. తర్వాతి స్థానాల్లో డీఎంకే (13), అన్నాడీఎంకే (13), బీఎస్పీ (11), ఆర్జేడీ (4), ఎస్పీ (3), టీఎంసీ (2) ఉన్నాయి. వీరిలో బీజేపీ నుంచి 14 మందిపై తీవ్ర నేరపూరిత కేసులున్నాయి. ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో కాంగ్రెస్ (8), బీఎస్పీ (8), డీఎంకే (6), అన్నాడీఎంకే (6), ఆర్జేడీ (2), ఎస్పీ (2), టీఎంసీ (1) ఉన్నాయి.

తొలి విడత ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల్లో టాప్-10 సంపన్నులు

అభ్యర్థి	లోక్‌సభ స్థానం	పార్టీ	ఆస్తుల విలువ (రూ.కోట్లలో)
నకుల్‌నాథ్	ఛింద్వారా	కాంగ్రెస్	716.94
అశోక్‌కుమార్	ఈరోడ్	అన్నాడీఎంకే	662
దేవనాథన్ యాదవ్	శివగంగ	బీజేపీ	304.92
మలా రాజ్యలక్ష్మిషా	తెహ్రీ గఢ్వాల్	బీజేపీ	206.87
మజీద్ అలీ	సహరాన్‌పూర్	బీఎస్పీ	159.59
ఏసీ షణ్ముగం	వెల్లూర్	బీజేపీ	152.77
వి.జయప్రకాశ్	కృష్ణగిరి	అన్నాడీఎంకే	135.78
విన్సెంట్ హెచ్ పాలా	షిల్లాంగ్	కాంగ్రెస్	125.81
జ్యోతి మిర్ధా	నాగ్‌పూర్	బీజేపీ	102.61
కార్తి చిదంబరం	శివగంగ	కాంగ్రెస్	96.27

అత్యంత తక్కువ ఆస్తులున్న అభ్యర్థులు

అభ్యర్థి	లోక్‌సభ స్థానం	పార్టీ	ఆస్తుల విలువ (రూ.లలో)
కె.పొన్‌రాజ్	తూత్తుకుడి	స్వతంత్ర	320
కార్తీక్ జెండ్‌లాల్జిటోక్	రాంటెక్	స్వతంత్ర	500
సూర్యముత్తు	చెన్నై నార్త్	స్వతంత్ర	500
జి.దామోదరన్	అరణి	స్వతంత్ర	1,000
జె.సెబాస్టియన్	చెన్నై నార్త్	ఎస్‌యూసీఐ(సి)	1,500
సతీష్ కుమార్	పుదుచ్చేరి	స్వతంత్ర	2,000
సురేష్ కే	దిండిగల్	స్వతంత్ర	2,000
పళనిస్వామి కే	దిండిగల్	స్వతంత్ర	2,000
పి.గోవిందరాసు	తిరుచ్చిరాపల్లి	స్వతంత్ర	2,000
కృష్ణన్ ఎస్	తూత్తుకుడి	స్వతంత్ర	3,500

– సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీ మంత్రి రాజీనామా

ఆమ్ ఆద్మీ పార్టీకి సైతం గుడ్‌బై



న్యూఢిల్లీ: సారథి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో నాయకత్వ సమస్యతో సతమతమవుతున్న ఆమ్ ఆద్మీ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ సంక్షేమ శాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ బుధవారం రాజీనామా చేశారు. దళిత ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, మంత్రులకు ఆప్ ఏమాత్రం గౌరవం ఇవ్వదని ఆరోపించారు. ''ఆప్‌లో దళిత నేతలు మోసపోయారు. ఇలాంటి పరిస్థితులున్న ఆప్‌లో కొనసాగలేను. అందుకే పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నా'' అని ప్రకటించారు. ''ఆప్‌ను అనవసరంగా లక్ష్యంగా చేసుకున్నారని నిన్నటిదాకా భావించా. కానీ కేజ్రీవాల్ అరెస్టును ఢిల్లీ హైకోర్టు సమర్థించడం చూస్తుంటే పార్టీలో తప్పులు జరిగినట్లు అనిపిస్తోంది. అవినీతితో అంటకాగిన పార్టీలో ఉండలేను'' అని ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. దర్యాప్తు సంస్థల ఒత్తిడి, తప్పుడు కేసులు, అరెస్ట్ భయంతోనే రాజ్‌కుమార్ పార్టీని వీడారని వ్యాఖ్యానించింది. ఇది తమ ఎమ్మెల్యేలు, ఎంపీలకు అగ్నిపరీక్ష అని ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు.

క్షమించే ఉదారగుణం మాకు లేదు

రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణ క్షమాపణ అఫిడవిట్లపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: తమ సంస్థ ఉత్పత్తుల వాణిజ్య ప్రకటనల విషయంలో మరోసారి ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడబోమంటూ యోగా గురు రామ్‌దేవ్, పతంజలి ఆయుర్వేద మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ తాజాగా సమర్పించిన బేషరతు క్షమాపణల అఫిడవిట్లపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తన అసంతృప్తిని వ్యక్తంచేసింది. మీ క్షమాపణలను అంగీకరించే ఉదారగుణం మాకు లేదని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంలో నాలుగైదేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీ ఉద్దేశపూర్వకంగా కళ్లు మూసుకుందని కోర్టు ఆగ్రహంవ్యక్తంచేసింది. తమ క్లయింట్లు ఇద్దరూ బేషరతుగా క్షమాపణలు చెబుతున్నారని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెబుతుండగా.. ' ఆ సారీలను మేం అంగీకరించట్లేము. కోర్టు ఆదేశాలను పాటిస్తామంటూ మీ క్లయింట్లు ఇచ్చిన పాత అఫిడవిట్లకు మీ క్లయింట్లే ఏమాత్రం విలువ ఇవ్వనప్పుడు తాజా అఫిడవిట్లకు మేం మాత్రం ఎందుకు విలువ ఇవ్వాలి?. మేం కూడా అలాగే చేయొచ్చుకదా? అని జస్టిస్ హిమా కోహ్లీ ప్రశ్నించారు. విదేశీప్రయాణం పేరు చెప్పి రామ్‌దేవ్, బాలకృష్ణ ఉద్దేశపూర్వకంగా కోర్టులో వ్యక్తిగత హాజరు నుంచి తప్పించుకున్నారని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉత్తరాఖండ్ రాష్ట్ర లైసెన్సింగ్ అథారిటీనీ కోర్టు తలంటింది. జిల్లా ఆయుర్వేదిక్, యునానీ అధికారిని ఎందుకు సస్పెండ్ చేయకూడదని అథారిటీ జాయింట్ డైరెక్టర్‌ను ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 16వ తేదీకి వాయిదావేసింది.

అవినీతికి మారుపేరు డీఎంకే



- భాష, కులం, మతం, విశ్వాసం పేరిట ప్రజల్లో విభజనను సృష్టిస్తోంది
- ప్రధాని మోదీ ఆగ్రహం
- తమిళనాడులోని వెల్లూరు, మెట్టుపాళ్యంలో ప్రచారం

వెల్లూరు: తమిళనాడులో అధికార డీఎంకేపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. డీఎంకే అవినీతికి మారుపేరుగా మారిపోయిందని, రాష్ట్రాభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్వేష, విభజన రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. బుధవారం తమిళనాడులోని వెల్లూరు, మెట్టుపాళ్యంలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో డీఎంకే ముమ్మాటికీ కుటుంబ పార్టీలేనని అన్నారు. అవినీతిపై మొదటి పేటెంట్ హక్కు డీఎంకేకు ఉందని ఎద్దేవా చేశారు. ఒక కుటుంబం రాష్ట్రాన్ని విచ్చలవిడిగా లూటీ చేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ కుటుంబంపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ కంపెనీ అయిన డీఎంకే పాతకాలపు ఆలోచనా ధోరణితో రాష్ట్రంలో యువత ఎదుగుదలను అడ్డుకుంటోందని విమర్శించారు. భాష, కులం, మతం, విశ్వాసం పేరిట ప్రజల్లో విభజనను సృష్టిస్తోందని డీఎంకేపై మండిపడ్డారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో దేశం ముందడుగు వేస్తుండగా, పెట్టుబడులను అడ్డుకొనేవారితో డీఎంకే అంటకాగుతోందని ఆరోపించారు.

కచ్చతీవు అప్పగింత వల్ల లాభపడిందెవరు?

తమిళనాడులో డీఎంకే తరహాలోనే దేశంలో కాంగ్రెస్ పార్టీ వివక్ష, విభజన అనే ప్రమాదకరమైన ఆట ఆడుతోందని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. విపక్ష 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్యపక్షాలకు బుజ్జగింపు రాజకీయాలు తప్ప అభివృద్ధి అంటే ఏమిటో తెలియని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అవినీతిపరులను కాపాడాలని కాంగ్రెస్, డీఎంకే ఆరాటపడుతున్నాయని విమర్శించారు. వారసత్వ పార్టీలకు సొంత కుటుంబ సభ్యులు, వారసులు తప్ప ఇతరుల సంక్షేమం పట్టదని అన్నారు. గిరిజన బిడ్డ ద్రౌపది ముర్మును తాము రాష్ట్రపతి ఎన్నికల్లో బరిలో దింపితే వారసత్వ పార్టీలు వ్యతిరేకించాయని గుర్తుచేశారు. మన దేశంలో అంతర్భాగమైన కచ్చతీవును 1974లో అన్యాయంగా శ్రీలంకకు అప్పగించారని ప్రధాన మంత్రి ధ్వజమెత్తారు. అప్పట్లో కేంద్రంలో కాంగ్రెస్, తమిళనాడులో డీఎంకే అధికారంలో ఉన్నాయని వివరించారు. కచ్చతీవు అప్పగింతపై ఏ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారో చెప్పాలన్నారు.

అంబేడ్కర్ ఆత్మ ఆశీస్సులు ఉన్నాయి..

నాగపూర్: ఆర్టికల్ 370 రద్దుతో తనకు అంబేడ్కర్ ఆత్మ ఆశీస్సులు లభిస్తున్నాయని మోదీ చెప్పారు. ప్రతిపక్షాల ఆరోపణలు, దూషణలతో తనకు మేలు జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిచే సీట్లు మరిన్ని పెరుగుతాయని అన్నారు. ఆయన బుధవారం మహారాష్ట్రలో నాగపూర్ జిల్లాలోని కన్హాన్ పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. మోదీ మూడోసారి గెలిస్తే దేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్యం ఉండబోవంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు.

ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ నేత

కుమారుల మృతి

టెల్ అవీవ్: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హమాస్ ముఖ్యనేత ఇస్మాయిల్ హనియేహ్ కుమారులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఖతర్ వంటి దేశాలు సంధి ప్రయత్నాలు చేస్తున్న వేళ హమాస్ కీలక నేత కుమారులు మరణించడంతో సయోధ్యపై మరోమారు నీలినీడలు కమ్ముకున్నాయి. '' జెరూసలేం, అల్-అఖ్సా మసీదుకు విముక్తి కల్పించే పోరాటంలో నా కుమారులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు' అని అల్‌జజీరాకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఇస్మాయిల్ వెల్లడించారు. ఇస్మాయిల్ ప్రస్తుతం ఖతార్‌లో ప్రవాసజీవితం గడుపుతున్నారు. కుమారులు మాత్రం గాజాలోని శరణార్థి శిబిరంలో ఉంటున్నారు. షాటీ శరణార్థి శిబిరంపై జరిపిన దాడిలోనే ఆయన కుమారులు హజీమ్, అమీర్, మొహమ్మద్‌లు మరణించారని అల్-అఖ్సా టీవీ ప్రకటించింది. ముగ్గురూ తమ కుటుంబసభ్యులతో కలిసి ఒకే వాహనంలో వెళ్తుండగా ఇజ్రాయెల్ డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురితోపాటు హజీమ్ కుమారులు, కుమార్తె, అమీర్ కుమార్తె సైతం ప్రాణాలు కోల్పోయారు.

సుప్రీంకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బుధవారం సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. సోమవారం లోపు విచారించడం కుదరదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగే అవకాశముంది.

జేమ్స్‌బాండ్ సీక్వెల్సా?

పదేపదే ఒకే తరహా పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలంటూ పదేపదే పిటిషన్లు దాఖలవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఆప్ మాజీ ఎమ్మెల్యే సందీప్ కుమార్ వేసిన ఈ తరహా పిటిషన్‌పై ఆగ్రహం వెలిబుచ్చింది. ''దీనిపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని గతంలోనే స్పష్టం చేసినా పదేపదే అవే పిటిషన్లు వేస్తున్నారు. ఇవేమీ జేమ్స్‌బాండ్ సినిమా సీక్వెల్స్ కావు. వ్యవస్థను వెక్కిరించేలా పిటిషన్లు వేస్తే ఊరుకోం. మీకు రూ.50,000 జరిమానా వేస్తాం'' అని సందీప్‌ను హెచ్చరించింది. ఆయన తరఫున లాయర్ వాదించబోయినా, ''రాజకీయ ప్రసంగాలు ఇవ్వాలనుకుంటే వీధి చివరికెళ్లి ఇచ్చి రండి. మీ క్లయింట్ నేత కాబట్టి రాజకీయాలు చేస్తారు. మేం రాజకీయాల్లో మునగదల్చుకోలేదు'' అని స్పష్టం చేసింది.

ప్రచారంలో ముద్దు రగడ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో సోమవారం అనూహ్య ఘటన జరిగింది. ఉత్తర మాల్దా బీజేపీ అభ్యర్థి ఖగేన్ ముర్ము హఠాత్తుగా ఓ మహిళ చెక్కిలిపై ముద్దు పెట్టడంతో అంతా అవాక్కయ్యారు. ఈ వ్యవహారం వైరల్ కావడంతో పరాయి మహిళలకు ముద్దులు పెట్టడం బెంగాలీ సంస్కృతి కాదంటూ టీఎంసీ నేతలు విమర్శలకు దిగారు. ఖగేశ్ మాత్రం తన చర్యను సమర్థించుకున్నారు. ''ఆమె నా బిడ్డ లాంటిది. తండ్రి తన బిడ్డను ముద్దాడితే తప్పేంటి?'' అని ప్రశ్నించారు. తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఖగేన్ ముద్దు పెట్టిన మహిళ కూడా ఆయన చర్యలో తప్పేమీ లేదనడం విశేషం! ముద్దు సంఘటన జరిగినప్పుడు తన తండ్రి, తల్లి అక్కడే ఉన్నారని వెల్లడించింది. సొంత బిడ్డ లాంటి మహిళను ఒక వ్యక్తి ముద్దాడడంలో తప్పేమీ లేదని పేర్కొంది. ముద్దు పెట్టిన ఫొటోను వైరల్ చేసిన వారిది నీచ మనస్తత్వం అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

కిరణ్‌ఖేర్‌కు మొండిచేయి

9 మందితో బీజేపీ పదో జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: చండీగఢ్ నుంచి వరుసగా రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన బాలీవుడ్ నటి కిరణ్‌ఖేర్‌కు బీజేపీ ఈసారి టికెట్ నిరాకరించింది. అక్కడ ఛత్తీస్‌గఢ్ మాజీ గవర్నర్, జనసంఘ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన దివంగత బలరామ్‌జీ దాస్ టాండన్ కుమారుడు సంజయ్ టాండన్‌ను బరిలో నిలిపింది. 9 మంది అభ్యర్థులతో బీజేపీ బీజేపీ బుధవారం పదో జాబితా విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లో ఏడుగురు, చండీగఢ్, పశ్చిమ బెంగాల్ నుంచి చెరొకరు చొప్పున పేర్లను ప్రకటించింది. అలహాబాద్ సిట్టింగ్ ఎంపీ రీటా బహుగుణ జోషీ స్థానంలో నీరజ్ త్రిపాఠికి అవకాశమిచ్చింది. మెయిన్‌పురిలో సమాజ్‌వాదీ అభ్యర్థి, అఖిలేశ్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్‌పై రాష్ట్ర మంత్రి జైవీర్‌సింగ్ ఠాకూర్‌ను పోటీలో దింపింది. బలియాలో నాలుగుసార్లు ఎంపీగా గెల్చిన వీరేంద్రసింగ్‌ను పక్కనబెట్టి మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడు నీరజ్ శేఖర్‌కు టికెటిచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో అసన్‌సోల్ నుంచి కేంద్ర మాజీ మంత్రి ఎస్ఎస్ అహ్లువాలియాకు టికెటిచ్చింది. గాజీపూర్‌లో ఇటీవల మరణించిన గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ కుమారుడు అఫ్జల్ అన్సారీపై పరాస్‌నాథ్ రాయ్‌ను బరిలోకి దింపింది. కౌశాంబి నుంచి వినోద్ సోంకార్, మఛ్లీషహర్ నుంచి బీపీ సరోజ్ పోటీచేయనున్నారు.

సందేశ్‌ఖాలీ అకృత్యాలపై సీబీఐ విచారణ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో గిరిజన మహిళలపై జరిగిన అకృత్యాలు, లైంగిక దాడులు, భూకబ్జాలపై సీబీఐ విచారణ జరపాలని కలకత్తా హైకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణను తాము పర్యవేక్షిస్తామని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్.శివజ్ఞానం నేతృత్వంలోని కలకత్తా హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మే 2వ తేదీలోగా విచారణ జరిపి, సమగ్ర నివేదిక అందజేయాలని సీబీఐకి సూచించింది. దర్యాప్తు విషయంలో సీబీఐకి సహరించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సందేశ్‌ఖాలీలో వ్యవసాయ భూమిని చెరువులుగా మార్చి చేపల పెంపకం చేపట్టారన్న ఆరోపణలపైనా దర్యాప్తు జరిపి, నివేదిక ఇవ్వాలంది.

కొడుక్కు తుపాకీ అందుబాటులో ఉంచారని...

తల్లిదండ్రులకు 15 ఏళ్ల జైలు

వాషింగ్టన్: కొడుకు చేసిన నేరానికి తల్లిదండ్రులకు శిక్ష విధించిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. స్కూల్‌లో తుపాకీతో కాల్పులు జరిపిన నలుగురు పిల్లలను బలి తీసుకోవడంతో పాటు ఏడుగురిని గాయపర్చిన బాలుడి తల్లిదండ్రులకు కోర్టు 15 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఇంట్లో బాలుడికి తుపాకీ అందుబాటులో ఉండేలా పెట్టడమే వారి నేరమని నిర్ధారించింది. 2021 నవంబర్ 30న మిషిగన్ రాష్ట్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో ఎథాన్ క్రంబ్లీ అనే పిల్లాడు తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. అతని మానసిక ఆరోగ్యం సరిగా లేదని తేలింది. అలాంటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సింది పోయి తుపాకీ అందుబాటులో ఉంచడం తల్లిదండ్రులు జేమ్స్, జెన్నిఫర్ తప్పేనని కోర్టు తేల్చింది.

ఓటేస్తే హెయిర్‌కట్ ఫ్రీ

ముంబై: ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వారికి తన సెలూన్లో ఉచితంగా హెయిర్‌కట్ చేస్తానని మహారాష్ట్రలోని అకోలాకు చెందిన అనంత కౌల్కర్ అనే వ్యక్తి ప్రకటించాడు! అకోలాలో ఏప్రిల్ 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఓటేసి తన సెలూన్‌కు వచ్చి వేలికి సిరా గుర్తు చూపించిన వారికి హెయిర్‌కట్ ఉచితమంటూ దుకాణం బయట బోర్డు పెట్టాడు. పోలింగ్ శాతం పెంచేందుకు తనకు తోచినంతలో వినూత్నంగా ప్రయత్నిస్తున్న కౌల్కర్‌ను స్థానికులు తెగ మెచ్చుకుంటున్నారు. ఏప్రిల్ 26వ తేదీన మహారాష్ట్రలోని 8 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

హోర్డింగులు, పోస్టర్లపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు ముద్రించాల్సిందే

రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. హోర్డింగులు సహా ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే ఇతర సామగ్రిపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు స్పష్టంగా కనిపించేలా ముద్రించాలని ఆదేశించింది. ఎన్నికల ప్రచారంలో జవాబుదారీతనం, పారదర్శకత కోసమే ఈ నిబంధన విధించినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన హోర్డింగులపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లు లేవంటూ ఆమ్ ఆద్మీ పార్టీ సహా పలువురు ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హోర్డింగుల సహా కరపత్రాలు, పోస్టర్లపై ప్రింటర్, పబ్లిషర్ పేర్లను తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.



పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం జగన్



సీఎం జగన్ పిలుపు మేరకు సెల్‌ఫోన్‌లో టార్చ్‌లైట్లు ఆన్ చేసి మేమంతా సిద్ధం అంటూ నినదిస్తున్న ప్రజలు

ఇదీ మా ప్రోగ్రెస్ రిపోర్ట్

2.31 లక్షల ఉద్యోగాలు, ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం • పిడుగురాళ్ల సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఊసరవెల్లి ఎన్నిసార్లు రంగు మారుస్తుందో నాకు తెలియదు గానీ, చంద్రబాబు మాత్రం ఊసరవెల్లిని దాటిపోయాడు. నీ మోసాలు అందరికీ తెలిసినవే. మొట్ట మొదటిగా ఈ వలంటీర్లను పీకేస్తావు. మళ్లీ నీ జన్మభూమి కమిటీ సభ్యులందర్నీ వలంటీర్లుగా తెచ్చుకుంటావు. వాళ్లు దోచుకునే దాని కోసం రూ.10 వేలు అదనంగా వాళ్లకు ఇస్తావు. ఇదీ నువ్వు చేయబోయే మోసపూరిత రాజకీయం అనేది చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. చంద్రబాబు బతుకంతా అబద్ధాలే పునాదులు, మోసాలే. వెన్నుపోట్లే చరిత్ర. సినిమాల్లో విలన్ క్యారెక్టర్ చూస్తే అది చంద్రబాబు క్యారెక్టర్ కిందనే గుర్తుకొస్తుంది.

సిద్ధం.. సిద్ధం.. అంటూ మీ నినాదాలు మన జైత్ర యాత్రకు శంఖారావంలా వినిపిస్తుంటే.. అధికారంలో ఉన్నప్పుడు ఏ పేదకు ఏ మంచి చేయని పెత్తందార్ల గుండెల్లో యుద్ధం.. యుద్ధం అని ప్రతిధ్వనిస్తోంది. వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. పేద వాడి భవిష్యత్తును, ఇంటింటి అభివృద్ధిని వెలుగు నుంచి చీకటికి తీసుకుపోదామని ఆ జిత్తుల మారి మోసాల పార్టీలు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను మనమంతా ఒక్కటై తిప్పికొడదాం. జగన్‌కు ఓటు వేస్తే ఇప్పుడు జరుగుతున్న మంచి కొనసాగుతుంది. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ఆగిపోతాయి. ప్రజలందరూ మోసపోతారన్నది చరిత్ర చెబుతున్న సత్యం. చంద్రబాబు గుణగణాలు ఎలా ఉంటాయంటే.. ఎన్నికలకు ముందు గంగ. అధికారం దక్కిన తర్వాత లక లకా.. అంటూ పేదల రక్తం తాగే చంద్రముఖి.

మే 13వ తేదీన జరగబోయే ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. గత 58 నెలలుగా మీ పిల్లల చదువులు, వారి భవిష్యత్, అక్కచెల్లెమ్మల సాధికారత, అవ్వాతాతల సంక్షేమం, రైతులకు అందుతున్న భరోసా, పేద సామాజిక వర్గాలకు అందిన న్యాయం.. ఇవన్నీ కూడా కొనసాగి మరో రెండు అడుగులు ముందుకు వేయాలా.. లేక మోసపోయి అంధకారంలోకి వెళ్లాలా అన్నది నిర్ణయించే ఎన్నికలని కూడా గుర్తుంచుకోవాలి. దీనిపై మీ కుటుంబ సభ్యులందరితో కలిసి కూర్చొని చర్చించాలి. మనం వేసే ఓటుతో మన తలరాతలు మారతాయని ప్రతి ఒక్కరూ జ్ఞాపకం ఉంచుకోవాలి. ఇవి జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న ఎన్నికలు కావు. పేదలకు, చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు. ఈ ఎన్నికల్లో మీ బిడ్డ జగన్‌ది పేదల పక్షం.

- సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఉద్యోగాలివ్వడంలో.. రైతులు, మహిళల అభ్యున్నతికి కృషి చేయడంలో, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడంలో చంద్రబాబు ఇస్తున్నది బోగస్ రిపోర్టు అయితే, వైఎస్ జగన్ ఇస్తున్నది కళ్లెదుటే కనిపిస్తున్న ప్రోగ్రెస్ రిపోర్టు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మనందరి ప్రభుత్వ హయాంలో 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా స్వయం ఉపాధి రంగాన్ని ప్రోత్సహించామని చెప్పారు. మొట్ట మొదటిసారిగా ఎంఎస్‌ఎంఈలకు చేయూతనిచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. వాహన మిత్ర, నేతన్న నేస్తం, జగనన్న తోడు, జగనన్న చేదోడు, మత్స్యకార భరోసా, చేయూత, ఆసరా, సున్నా వడ్డీ.. ఇలా అన్ని విధాలా ప్రోత్సహించబట్టే స్వయం ఉపాధి రంగం ఈరోజు తన కాళ్ల మీద తాను నిలబడగలుగుతోందన్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక చక్రం పరుగులు పెడుతోందని చెప్పడానికి గర్వపడుతున్నానని చెప్పారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా బుధవారం ఆయన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో జరిగిన సభలో మాట్లాడారు. ఈ జన సంద్రాన్ని చూస్తుంటే నెల రోజుల్లోనే పట్టపగలు కోటప్పకొండ తిరునాళ్లు కనిపిస్తోందని అన్నారు. ఐదేళ్ల మన ప్రభుత్వంలో ఇంటింటికీ వచ్చిన అభివృద్ధిని, సంక్షేమాన్ని, లంచాలు, వివక్ష లేని పాలనను.. ఆ దుష్ట కూటమి, ఎల్లో మీడియా కబంధ హస్తాల నుంచి కాపాడుకునేందుకు పలనాటి సీమ పౌరుషంతో జన సముద్రంగా మారిన దృశ్యం కనిపిస్తోందని చెప్పారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

ఏది నిజం, ఏది అబద్ధం.. మీరే తేల్చండి

▲ బాబుగారి గురించి ఈరోజు ఈ సిద్ధం సభకు వచ్చిన లక్షల మందితో నేను కొన్ని నిజానిజాలు తేల్చదల్చుకున్నా. ఈ రోజు ఇక్కడ మీరు, నేను జాయింట్ గా ఓ ఫ్యాక్ట్ చెక్ (నిజ నిర్ధారణ) చేద్దాం. ఈ చంద్రబాబు గురించి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5.. ఈ చెత్త మీడియా చేస్తున్న ప్రచారంలో ఏది నిజం, ఏది అబద్ధం అనేది మీ ముందు పెడుతున్నా.

▲ చంద్రబాబు, ఈ ఎల్లో మీడియా కూడబలుక్కుని ఒక నిర్ణయానికి వస్తారు. తర్వాత వీరంతా కలిసి ఒక గాడిదను తీసుకొస్తారు. దాన్ని గుర్రం, గుర్రం అంటూ పదే పదే ఊదరగొడతారు. ఇలా 30 ఏళ్లుగా చేస్తూ వస్తున్నారు. 2014లో జాబు రావాలి అంటే బాబు రావాలి అని సభల్లో, టీవీ చానళ్లలో, ఊరూరా ఊదరగొట్టారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పాలించిన చంద్రబాబు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? మీ వాళ్లకు, మీ ఇంటి చుట్టు పక్కల వాళ్లకు ఎవరికై నా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందా?

▲ మీ బిడ్డ జగన్ వచ్చాక ప్రతి గ్రామంలో ఒక సచివాలయం తీసుకొచ్చారు. ఆ సచివాలయాల్లో ఏకంగా 1.35 లక్షల మంది మన పిల్లలు ఈరోజు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో నేను నా.. నా.. నా.. నా.. అని పిలుచుకునే నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకంగా 80 శాతం మంది ఉన్నారు.

▲ ఈరోజు ఒక్క వైద్య ఆరోగ్య రంగంలో మాత్రమే ఈ 58 నెలల కాలంలో 54 వేల పోస్టులు భర్తీ చేశాం. గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళితే గతంలో మాదిరి డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లేరన్న పరిస్థితి లేదు. మొత్తంగా 58 నెలల్లో 2.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మీ బిడ్డ పాలన రాక ముందు రాష్ట్రంలో 4 లక్షల ఉద్యోగాలుంటే.. ఈ 58 నెలల కాలంలోనే మీ బిడ్డ మరో 2.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాడు. ఈ పెద్దమనిషి చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్య కేవలం 32 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. ఈ లెక్కన జాబు రావాలి అంటే ఫ్యాను రావాలా? లేక తుప్పు పట్టిన సైకిల్ రావాలా?



నిర్మాణంలో 4 సీ పోర్టులు, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 నోడ్స్

▲ మరోవైపు రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా కొత్తగా మరో నాలుగు సీ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 ఇండస్ట్రియల్ నోడ్స్ కూడా వేగంగా పరుగులెత్తుతున్నాయి. 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కూడా నిర్మాణంలో ఉన్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం దేశంలోనే వరుసగా ప్రతి సంవత్సరం నంబర్ వన్‌గా నిలుస్తోంది.

▲ రైతు అంటే బాబుకు ప్రేమట. నమ్ముతారా? (నమ్మం.. నమ్మం.. అని నినాదాలు) గతంలో ఏమీ చేయని బాబు.. ఇప్పుడు రైతుకు ఎక్కువ మేలు చేస్తాడట. ఇదీ వాళ్ల ఎల్లో మీడియా, చంద్రబాబు కొత్తగా చెబుతున్న మాటలు. వ్యవసాయం దండగ అన్న ఏకైక ముఖ్యమంత్రి ప్రపంచ చరిత్రలో ఎవరైనా ఉన్నారా అంటే అది ఈ చంద్రబాబే. రైతులకు కరెంటు ఉచితంగా ఇస్తే ఆ తీగలపై బట్టలు ఆరేసుకోవాలి అన్నాడు. రైతులను విచారించేందుకు ప్రత్యేక పోలీస్ స్టేషన్లు నెలకొల్పిన వ్యక్తి. ప్రత్యేక కోర్టులు నెలకొల్పిన వ్యక్తి.

బాబువన్నీ విఫల హామీలే

▲ 2014లో రూ.87,612 కోట్లు రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడు. చేశాడా? రైతులకు పగటిపూటే 12 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తానన్నాడు. ఇచ్చాడా? బ్యాంకుల్లో పెట్టిన బంగారం విడిపిస్తానన్నాడు. విడిపించాడా? రైతులకు సున్నా వడ్డీ కూడా ఎగరగొట్టేశాడు. ఇన్‌పుట్ సబ్సిడీ సైతం 2017 నుంచి ఎగ్గొట్టేశాడు. కరెంటు విషయంలోనూ బకాయిలే. ధాన్యం సేకరణలోనూ బకాయిలే, రైతుల నుంచి కొనుగోలు చేసిన విత్తనాలకు సైతం డబ్బులివ్వకుండా బకాయిలే.

▲ మీ బిడ్డ జగన్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 ప్రతి రైతన్న చేతిలో పెడుతున్నాడు. ఈ ఐదేళ్లలో ప్రతి రైతన్నకూ రూ.67,500 ఇచ్చాం. మేనిఫెస్టోలో రూ.50 వేలు ఇస్తామని చెప్పి, అంతకంటే మిన్నగా రూ.67,500 ఇచ్చామా? లేదా? అని అడుగుతున్నా. పగటిపూటే నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చాం. ఇందు కోసం రూ.1,700 కోట్లు ఫీడర్లపై ఖర్చు చేశాం.

▲ రైతన్నను చేయి పట్టుకుని నడిపించే రైతు భరోసా కేంద్రాన్ని (ఆర్బీకే) తీసుకొచ్చి దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచాం. ఇ-క్రాప్ ద్వారా, ఉచిత పంటల బీమా ద్వారా ప్రతి రైతన్నకూ, ప్రతి ఎకరాకూ, ప్రతి పంటకూ ఇన్సూరెన్స్ అందుతోంది. సీజన్ ముగిసేలోపు పంట నష్టపరిహారం, విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు తోడుగా ఉన్నాం. రూ.64 వేల కోట్లు ధాన్యం సేకరణకు ఇచ్చాం. మద్దతు ధర దక్కేలా చూస్తున్నాం. గన్నీబ్యాగ్స్, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుల కింద రైతన్నకు ఎకరాకు కనీసం రూ.8 వేల నుంచి రూ.10 వేలు అదనంగా వచ్చేలా చూశాం.

▲ సున్నా వడ్డీకే పంట రుణాలు చంద్రబాబు ఎత్తేస్తే.. మీ బిడ్డ జగన్, బాబు బకాయిలను సైతం కట్టి, మళ్లీ సున్నా వడ్డీకే పంట రుణాలు ఇప్పిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా ఏకంగా 35 లక్షల ఎకరాల మీద శాశ్వత భూ హక్కులు కల్పించాం. ఈ పరిస్థితిలో రైతు కోసం ఈ రాష్ట్రానికి ఎవరు అవసరం? రుణ మాఫీ అని మోసం చేసిన చంద్రబాబా? లేక వ్యవసాయానికి అండగా నిలబడిన మీ బిడ్డనా? వాళ్లు ఇచ్చేది బోగస్ రిపోర్ట్. మీ జగన్ ఇస్తున్నది ప్రోగ్రెస్ రిపోర్ట్.

ప్రతి గ్రామంలో విప్లవం

▲ ఈ రోజు ప్రతి గ్రామంలో విప్లవం కనిపిస్తోంది. వలంటీర్ల వ్యవస్థ, 15 వేలకు పైగా గ్రామ, వార్డు సచివాలయాలు, నాడు-నేడుతో బాగుపడ్డ స్కూళ్లు, హాస్పిటళ్లు కనిపిస్తున్నాయి. 15 వేలకుపైగా విలేజ్, వార్డు క్లినిక్‌లు.. 11 వేలకుపైగా రైతు భరోసా కేంద్రాలు కనిపిస్తున్నాయి. లంచాలు, వివక్ష లేకుండా 130 సార్లు మీ బిడ్డ బటన్ నొక్కి, అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి రూ.2.70 లక్షల కోట్లు నేరుగా మీ బిడ్డ పంపించాడు. అమ్మ ఒడి పథకాన్ని మీరెప్పుడైనా చూశారా? పూర్తి ఫీజులు కడుతూ విద్యాదీవెన, వసతి దీవెనకు ఇంతగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వాన్ని ఏనాడైనా చూశారా?

▲ ఆసరా, సున్నా వడ్డీ ద్వారా పొదుపు అక్కచెల్లెమ్మలను ఆదుకున్నాం. చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతో అండగా నిలిచాం. క్వాలిటీ చదువులే లక్ష్యంగా పేద పిల్లల తలరాతలు మార్చేలా మేనమామగా శ్రద్ధ పెట్టాను. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్, 6వ తరగతి నుంచే ఆ ప్రతి క్లాస్ రూములో డిజిటల్ బోధన, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, టోఫెల్, ఐబీ దాకా ప్రయాణం కనిపిస్తోంది. ఆ బడుల్లో నాడు-నేడు, గోరుముద్ద, విద్యా కానుక గతంలో ఎప్పుడైనా చూశారా? విశ్వవిద్యాలయాలతో ఒప్పందం ద్వారా డిగ్రీలోనే సర్టిఫైడ్ ఆన్‌లైన్ వర్టికల్స్, ప్రఖ్యాత యూనివర్సిటీ సర్టిఫికెట్స్ డిగ్రీలకు అనుసంధానం చేశాం. మ్యాండేటరీ ఇంటర్న్ షిప్ తీసుకొచ్చాం.

▲ లీడర్ అంటే ఇలా ఉండాలి అని గర్వంగా కాలర్ ఎగరేసేలా ప్రజల ప్రేమానురాగాలు పొందుతున్నాం. అదే చంద్రబాబు నాయుడు పేరు చెబితే గుర్తుకొచ్చే ఒక్క మంచైనా ఉందా?

ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా?



▲ ఇన్ని అబద్ధాలు, ఇన్ని మోసాలతో రాష్ట్ర పేదల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? (సిద్ధమేనని జనం నినాదాలు) మీరు సిద్ధంగా ఉంటే మోసగాళ్ల సోషల్ మీడియా, ఎల్లో మీడియా అసత్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు మీ జేబులోంచి సెల్ ఫోన్ బయటకు తీసి, అందులోని టార్చ్ లైట్ వెలిగించండి. (అందరూ సెల్‌లో టార్చ్ వెలిగించి పైకెత్తి చూపారు). 175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు.

▲ మన పార్లమెంట్, దాని పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులందరికీ మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు అందించాలని కోరుతున్నాను. మనది ఫ్యాన్ గుర్తు అని మరచిపోవద్దు. పేదల భవిష్యత్తు కోసం ఫ్యాను ఎప్పుడూ మన ఇంట్లోనే ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్ లోనే ఉండాలి. మన బతుకులు బాగుపడాలి అంటే ఫ్యాను మీద రెండు ఓట్లు కచ్చితంగా వేయాలి.

ఇంతకన్నా ఇంకేం సర్టిఫికెట్ కావాలి?

▲ ఎప్పుడూ మోసాలు చేసే చంద్రబాబు.. నిన్ననే అనుకుంటా.. కొత్తగా ఒక మాట మాట్లాడాడు. వలంటీర్లకు రూ.10 వేలిస్తాడట. పోనీ ఇట్లన్నా జగన్ పాలన బ్రహ్మాండంగా ఉందని ఒప్పుకున్నాడు. సంతోషం. జగన్ పాలన చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. దాన్నన్నా ఒప్పుకున్నాడు. మొన్నటి దాకా మన వలంటీర్ల వ్యవస్థ పట్ల భయంకరమైన ద్వేషం వెళ్లగక్కారు. మూటలు మోసే వాళ్లు అన్నాడు. వారి కథ తేలుస్తా అన్నాడు. వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నాడు. మగవాళ్లు ఇంట్లో లేనప్పుడు తలుపులు కొడతారని కూడా అన్నాడు. ఇక ఆయన దత్తపుత్రుడు ఇంకో నాలుగు అడుగులు ముందుకేసి.. వలంటీర్లు ట్రాఫికింగ్ చేయిస్తున్నారని అన్నాడు. అందువల్లే అమ్మాయిలు మిస్ అయిపోతున్నారు.. మాయమైపోతున్నారని కూడా అన్నాడు. వలంటీర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ సైన్యం అన్నాడు. వాలంటీర్లు జగన్‌కు అధికార పెగసస్ అని కూడా ట్వీట్ చేశాడు ఈ దత్తపుత్రుడు. ఇలా అన్న వాళ్లు వలంటీర్ వ్యవస్థను గుర్తించినందుకు సంతోషం. మన ప్రభుత్వానికి ఇంతకన్నా ఏం సర్టిఫికెట్ కావాలి?

▲ అయ్యా చంద్రబాబూ.. నీ హయాంలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. వాళ్లు, మీరు ఇద్దరూ కలిసి మరుగుదొడ్లకూ, రేషన్‌కు, పెన్షన్‌కూ లంచాలు తీసుకున్నారు. రాష్ట్రాన్ని దోచేశారు. చంద్రబాబు మనస్తత్వం రాష్ట్రాన్ని దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం. చనిపోయిన తర్వాత కూడా ప్రతి పేదవాడి గుండెల్లో బతికే ఉండాలన్నది జగన్ మనస్తత్వం. ఇదీ.. నీకు నాకు మధ్య ఉన్న తేడా.

▲ ఇదే చంద్రబాబు మొన్నటికి మొన్న నిమ్మగడ్డ రమేష్ అనే తన మనిషితో ఎలక్షన్ కమిషన్ కు కంప్లయింట్ చేయించి, అవ్వాతాతలకు ఇంటి వద్దే అందాల్సిన పెన్షన్‌ను ఆపించారు. ఆ అవ్వాతాతలు ఇబ్బందులు పడేట్టుగా చేసి, చివరికి అనేక మంది అవ్వాతాతలు మరణానికి కూడా కారణమయ్యారు. ఒక్కసారిగా గాలి ఎదురు తిరిగే సరికే చంద్రబాబులో ఉన్న మోసం మళ్లీ చంద్రముఖిలా పైకి లేచింది.

ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళితే..

▲ 2014లో చంద్రబాబు ఇదే కూటమిగా ఏర్పడి ఇంటింటికీ పంపించిన పాంప్లెట్ ఇది. (చేత్తో చూపిస్తూ..) గుర్తుందా ఈ పాంప్లెట్? ఇందులో మోడీగారి ఫొటో ఉంది. దత్తపుత్రుడి ఫొటో, చంద్రబాబు నాయుడు ఫొటో ఉంది. కింద చంద్రబాబు నాయుడు సంతకం కూడా ఉంది. ప్రతి టెలివిజన్ చానల్‌లో వాళ్ల ఈనాడులో, ఆంధ్రజ్యోతిలో, టీవీ-5లో ఊదరగొడుతూ దీని గురించి అడ్వటైజ్ మెంట్లు కూడా ఇచ్చారు.

▲ రైతులకు రుణ మాఫీపై మొదటి సంతకం చేస్తా అన్నాడు. రూ.87,612 కోట్లు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేశాడా? మీ ఇంట్లో.. మీ పక్కిళ్లలో 2014-2019 మధ్య ఆడ బిడ్డలు పుట్టారు కదా.. వాళ్లలో ఒక్కరికై నా రూ.25 వేలు ఇచ్చారా? ఇంటింటికీ ఉద్యోగం.. లేదా నెలనెలా రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు.. అంటే 60 నెలలకు నెలకు రూ.2000 చొప్పున లెక్కిస్తే.. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చారా? అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు..



చేశాడా?

▲ మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మన పిడుగురాళ్లలో కనిపించిందా? పోనీ మన గురుజాలలో అయినా కనిపిస్తోందా?ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు. అవ్వాతాతలకు పెన్షన్ రూ.4 వేలు ఇస్తాడట. ఈ ముగ్గురూ కలిసి ఇంటింటికీ కేజీ బంగారం అంటున్నారు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తామంటున్నారు. నమ్ముతారా?

'సిద్ధం.. సిద్ధం అనే మీ నినాదాలు మన జైత్రయాత్రకి శంఖారావంలా వినిపిస్తుంటే.. పెత్తందారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ యుద్ధం.. యుద్ధం అని ప్రతిధ్వనిస్తోంది'

'ఎక్స్'లో సీఎం జగన్

'మీ బిడ్డ జగన్ 58 నెలల పాలనలో 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాడు. చంద్రబాబు 2014 - 19లో నియామకం చేసిన ప్రభుత్వ ఉద్యోగాలు 32 వేలు మాత్రమే. మరి ఇప్పుడు అడుగుతున్నా.. జాబు కావాలంటే రావాల్సింది ఎవరు? జాబు రావాలంటే ఫ్యాను రావాలా? లేక తుప్పు పట్టిన సైకిల్ రావాలా? ఆలోచన చేయండి.

నేనున్నాననీ.. మీకేం కాదనీ..

సమస్యలు విన్నవించిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ భరోసా

ఫిట్స్‌తో స్పృహ తప్పిన మహిళ

శావల్యాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఓ మహిళ ప్రాణాపాయం నుంచి బయట పడింది. పల్నాడు జిల్లా గంటావారిపాలెం గ్రామ సమీపాన జాతీయ రహదారిపై బుధవారం 'మేమంతా సిద్ధం'బస్సు యాత్ర సాగుతుండగా ఓ మహిళ ఫిట్స్‌తో స్పృహ తప్పి పడిపోయింది. బొల్లాపల్లి మండలం సరికొండాయపాలెం గ్రామానికి చెందిన మల్లవరపు మౌనిక ఫిట్స్‌తో గత కొన్ని సంవత్సరాలుగా బాధ పడుతోంది. ఈ క్రమంలో తనకున్న వ్యాధి గురించి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించిన అనంతరం అభిమానులు, కార్యకర్తల తోపులాటలో ఆమె ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోయింది. విషయాన్ని గమనించిన సీఎం సత్వరమే వైద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో హుటాహుటిన 108 వాహనం ద్వారా వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది.



అత్యవసర వాహనం ద్వారా మహిళను తరలిస్తున్న సిబ్బంది

అరుదైన వ్యాధిగ్రస్తునికి ఆపన్నహస్తం



మా 16 ఏళ్ల కొడుకు హుస్సేన్ బాషా అరుదైన మల్టిపుల్ అటెన్యూయేషన్ అసిఫైయింగ్ ఫైబ్రొమా వ్యాధితో బాధపడుతున్నాడు. ముఖం ఎడమ సగభాగం కన్నుతో సహా ముందుకు వచ్చింది. ఏడాది క్రితం గుంటూరు జిల్లా వడ్లమూడిలోని ఓ ఆస్పత్రిలో హుస్సేన్‌కు రెండు సార్లు సర్జరీలు జరిగాయి. దీనికి అవసరమైన రూ.10 లక్షలు అప్పు చేసి తెచ్చి పెట్టాం. అంత అప్పు తీర్చే పరిస్థితి లేదు. మళ్లీ మా అబ్బాయికి వైద్యం చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఉన్న ఇంటిని అమ్మకానికి పెట్టాం. మా గోడును సీఎం వైఎస్ జగన్‌కు చెబుదామని వచ్చాం. మా సమస్య విని సీఎం చలించిపోయారు. తక్షణం వైద్యం అందించేందుకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆరోగ్య శ్రీ అధికారులను ఆదేశించారు. ఆయనకు జీవితాంతం రుణ పడి ఉంటాం.

– ఖాదర్ అలీ, మౌలాబీ, బాషా తల్లిదండ్రులు కొమ్మాలపాడు, సంతమాగులూరు మండలం

12 వ రోజు

స్టార్ క్యాంపెయినర్‌లతో
సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో 12వ రోజు నా స్టార్ క్యాంపెయినర్లతో.. అంటూ సీఎం జగన్ బుధవారం కొన్ని ఫొటోలను ట్వీట్ చేశారు. సీఎం జగన్ బస్సు యాత్రకు ఎదురొచ్చి మహిళలు గుమ్మడి కాయతో దిష్టి తీసి, జననేతపై తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. మండే ఎండలో ఓ వ్యక్తి సహాయంతో ఒక వికలాంగుడు సీఎం జగన్‌ను కలిశారు. సీఎం జగన్ అతడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని నేను ఉన్నాను అంటూ భరోసా ఇచ్చారు. ఓ చిన్నారిని సీఎం జగన్ ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నారు. ఓ బాలుడు తన తండ్రి భుజాలపైకి ఎక్కి సెల్ ఫోన్‌తో సీఎం జగన్ ఫొటో తీసి ఆనందం వ్యక్తం చేశాడు. ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. - సాక్షి, అమరావతి














మండుటెండలో
అభిమాన సంద్రం

'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వెంట పల్నాటి జన సైన్యం

> రొంపిచర్ల వద్ద 87 ఏళ్ల అవ్వ రాధమ్మ మిట్ట మధ్యాహ్నం రోడ్డుపై ఆశగా ఎదురు చూస్తోంది. వచ్చిపోయే వాళ్లను జగన్ ఎక్కడి వరకు వచ్చాడయ్యా? అని ఆరా తీస్తోంది. ఇంత ఎండలో ఎందుకొచ్చారని ప్రశ్నిస్తే 'జగన్ నాకు ఎంతో మంచి చేశాడు. ఇంటికే పింఛన్ పంపించాడు. నాలాంటోళ్లకి ఆ బిడ్డ కావాలి. అందుకు ఒక్కసారి చూసిపోదామని వచ్చాన'నని బదులిచ్చింది.


నకరికల్లు: రోడ్‌షోకు హాజరైన జనసందోహానికి సీఎం జగన్ అభివాదం

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి :

'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర బుధవారం 40 డిగ్రీల ఎండలోనూ జన జాతరను తలపించింది. వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానం వేసవి తాపాన్ని ఎదురించింది. గొంతెండే వేడిమిలోనూ 'నువ్వే కావాలి జగన్' అంటూ నినదించింది. ధర్మాన్ని గెలిపించే యుద్ధంలో పల్నాటి సైన్యమై ముందుకు కదిలింది. పౌరుషాల పురిటిగడ్డ సాక్షిగా విశ్వసనీయతే తమ వీరత్వమంటూ గర్జించింది. పల్లెపల్లె నుంచి పిడికిలి బిగించి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తామంతా సిద్ధమంటూ నినదించింది. 12వ రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడు జిల్లాలోని గంటావారిపాలెం రాత్రి బస శిబిరం నుంచి ఉదయం 10.15 గంటలకు ప్రారంభమైంది. అంతకుముందు సీఎం జగన్ సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీలో చేరారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఉదయం 6.30 గంటల నుంచే శిబిరం వద్ద మహిళలు, దివ్యాంగులు, అనారోగ్య బాధితులు తరలివచ్చారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ శిబిరం నుంచి రోడ్డుపైకి రాగానే జైజగన్ నినాదాలతో గళమెత్తారు. సాయం కోరి వచ్చిన బాధితులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్య పరిష్కారానికి సీఎం అధికారులను ఆదేశించారు. కామేపల్లికి సమీపంలో గ్రానైట్ కటింగ్ మహిళా కూలీలు రోడ్లపై వేచి చూడటాన్ని గమనించిన సీఎం జగన్.. కాన్వాయ్‌లో నుంచి కిందకి దిగి వచ్చి ప్రభుత్వ పని తీరుపై ముచ్చటించారు. వినుకొండ-కర్నూలు జాతీయ రహదారిపై ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగారు. ఆ తర్వాత పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం నుంచి బాపట్ల జిల్లా సంతమాగులూరు అడ్డరోడ్డు మీదుగా నరసరావుపేట నియోజకవర్గం అన్నవరప్పాడులోకి బస్సు యాత్ర ప్రవేశించింది.



జాతీయ రహదారిపై జన ప్రవాహం

నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై సంతమాగులూరు జంక్షన్‌లో పెద్ద జన ప్రవాహమే కనిపించింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు తమ ఆత్మీయ నాయకుడికి ఘన స్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చి పూలతో నీరాజనం పలికారు. వ్యవసాయ మహిళా కూలీలు తమపాలిట రైతు బాంధవుడిని చూసేందుకు పొలాల్లో నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. రొంపిచర్లలో యువత ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ జననేత రాకతో సంబరపడ్డారు. సంతగుడిపాడు, విప్పర్లలో బాణసంచా కాల్చడంతో తిరునాళ్లను తలపించింది. రొంపిచెర్ల, సంతగుడిపాడు రోడ్‌షో అంబరాన్ని తాకింది. అభిమానులు సీఎం జగన్‌కు కంబలి కప్పి గొర్రె పిల్లను బహూకరించారు. విప్పర్లలో మహిళలు హారతిపట్టి బస్సు యాత్రను దీవించారు. వలంటీర్లు పెద్ద ఎత్తును తరలివచ్చి ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేయడంలో తమకూ భాగస్వామ్యం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటికీ మీ వెంటే ఉంటామంటూ నినదించారు. రెండు నెలల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తామంటూ సీఎం జగన్ వారికి భరోసా ఇచ్చారు.

ఊరూరా అభిమానం

నెకరికల్లులో సీఎం జగన్‌పై అంతులేని అభిమానం బంతిపూల వర్షం కురిపించింది. సంక్షేమ ఫలాలను అందుకున్న మహిళలు భారీగా తరలివచ్చారు. దాదాపు మధ్యాహ్నం రెండు గంటలకు కూడా నెకరికల్లులోని నారెట్‌పల్లి-అద్దంకి జాతీయ రహదారి జనంతో కిక్కిరిసిపోయింది. జనసంద్రంగా మారిన మార్గంలో బస్సు యాత్ర అనుకున్న షెడ్యూల్ కంటే ఆలస్యంగా చల్లంగుండ్లకు చేరుకుంది. నెకరికల్లు, జంక్షన్, త్రిపురాపురం, నెమలిపురి మీదుగా సాగిన బస్సు యాత్ర 4 గంటల సమయంలో పెద్ద నెమలిపురం చేరుకుంది. దేవరంపాడు క్రాస్ వద్ద 4.20 గంటలకు సీఎం భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత కొండమోడు, పిడుగురాళ్ల, బైపాస్ మీదుగా రోడ్‌షో నిర్వహిస్తూ అయ్యప్పనగర్ బైపాస్ సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

పిడుగురాళ్లలో పిడికిలి బిగించి..

పిడుగురాళ్ల బైపాస్‌లో రోడ్‌షో, బహిరంగ సభ సిద్ధం.. సిద్ధం' నినాదాలతో మార్మోగింది. రోడ్లపై బారులు తీరిన ప్రజలు ఆద్యంతం సీఎం ప్రసంగాన్ని ఆలకించారు. ఏనోట విన్నా తమ ఇంటికి వచ్చిన సంక్షేమ పథకాల లిస్టు వినిపించింది. ఎన్నికల వేళ ప్రతిపక్షాల నుంచి అధికార పక్షంలోకి చేరికలు భవిష్యత్తు గెలుపునకు ముందస్తు సంకేతాలని, పిడుగురాళ్ల బహిరంగ సభలో రెంటచింతల వేడిని మించిన.. భీకరమైన గెలుపు పవనాలు వైఎస్సార్‌సీపీకి కనిపించాయంటూ పరిశీలకులు చెబుతున్నారు. తొలిసారిగా ఓటు వేస్తున్న యువత బహిరంగంగానే తమ ఓటు సీఎం జగన్‌కే అంటూ నినదించింది. 5.30 గంటలకు సీఎం జగన్ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. 6.50 గంటల వరకు పార్టీ శ్రేణులు, లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగించారు. బహిరంగ సభ అనంతరం 7 గంటలకు బయలు దేరిన సీఎం జగన్ కొండమోడు సర్కిల్ మీదుగా సత్తెనపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. రెడ్డిపాలెంలో రాత్రి 8.45 గంటలు అయినప్పటికీ పెద్ద సంఖ్యలో మహిళలు హారతులు, పూలతో ఘన స్వాగతం పలికారు. బస్సుపైకి ఎక్కి వారందరికీ సీఎం అభివాదం చేశారు. రాత్రి 9.08 గంటలకు ధూళిపాళ్లలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి చేరుకున్నారు.


మండుటెండలో కాళ్లకు చెప్పులు లేకుండా వచ్చిన వెంకాయమ్మతో ఆత్మీయంగా మాట్లాడుతున్న సీఎం జగన్

మళ్లీ నువ్వే రావాలయ్యా

సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు పంచాయతీ పరిధిలోని రామిరెడ్డిపాలేనికి చెందిన వెంకాయమ్మ అనే మహిళ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రగా వస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు ఉదయం 9గంటలకే పుట్టావారిపాలెం అడ్డరోడ్డుకు వచ్చింది. తీరా ఆయన వచ్చే సమయానికి చెప్పులు తెగిపోయాయి. అయినా ఆమె చలించలేదు. కాళ్లు మండుతున్నా లెక్క చేయకుండా జగన్‌ను చూసేందుకు బస్సు వద్దకు పరుగు పరుగున వచ్చి ఆయనను ఆత్మీయంగా పలకరించింది. భావోద్వేగానికి గురైంది. 'అయ్యా.. నువ్వే రావాలయ్యా..' అంటూ ఆకాంక్షించింది.





బస్సు యాత్రలో భాగంగా వెల్లలచెరువు, అన్నవరప్పాడు, రెడ్డిపాలెం గ్రామాల్లో మహిళలతో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న సీఎం జగన్


నకరికల్లు: సీఎం జగన్‌కు అభిమానుల అపూర్వ స్వాగతం


పిడుగురాళ్ల: అభిమాన నేతను చూసిన ఆనందంలో...


రొంపిచెర్ల: అదిగో.. జగన్ మామ..


అన్నవరప్పాడు: సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో బాలికల కేరింతలు...


అన్నవరప్పాడు: చిన్నారితో హైఫై


రొంపిచెర్ల: బస్సుయాత్రకు మేముసైతం..


అన్నవరప్పాడు: అభిమానులు బహూకరించిన గొర్రెపిల్లను ఎత్తుకుని...

క్లుప్తంగా...

కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు 20 వరకు దరఖాస్తులు

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25కు ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువు గురువారంతో ముగియనుంది. అయితే, ఎక్కువ మంది విద్యార్థినులకు అవకాశం కల్పించేందుకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గడువు పెంచినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి దాకా ఆరో తరగతికి 45,621 దరఖాస్తులు, ఇంటర్ మొదటి సంవత్సరానికి 29,621 దరఖాస్తులు అందాయన్నారు. 7–9 తరగతుల్లో మిగిలిన సీట్లకు 8,383 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎస్పీడీ వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షల కుటుంబ ఆదాయం ఉన్న విద్యార్థినులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు https://apkgbv.apcfss.in/లో దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి సమాచారం కోసం 18004258599 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు.

'మైదాన్' విడుదలపై మైసూరు కోర్టు స్టే

మైసూరు: అమిత్ శర్మ దర్శకత్వంలో ప్రముఖ హీరో అజయ్ దేవగణ్ నటించిన బాలీవుడ్ సినిమా 'మైదాన్' విడుదలపై మైసూరు ప్రధాన సెషన్స్, జిల్లా న్యాయస్థానం బుధవారం స్టే విధించింది. ఈ సినిమాను గురువారం దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేసింది. అయితే, ఈ సినిమా కథ తనదేనని అనిల్‌కుమార్ అనే రచయిత కోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం సినిమా విడుదలపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా కథ తనదేనని, 2018లో లింక్‌డిన్‌లో సినిమా స్టోరీని అప్‌లోడ్ చేశానని అనిల్‌కుమార్ చెప్పారు. అదేవిధంగా 2019, ఫిబ్రవరిలో స్క్రీన్ రైట్ అసోసియేషన్‌లో ఈ సినిమా పేరును రిజిస్టర్ కూడా చేయించినట్లు తెలిపారు.

సీఎం రమేష్ వాహనం సీజ్.. కేసు నమోదు



మునగపాక (అనకాపల్లి జిల్లా): అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తోన్న కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ వాహనాన్ని బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. అనుమతి తీసుకోకుండానే ఈ వాహనంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు రికార్డుల పరిశీలన అనంతరం ధ్రువీకరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో భాగంగా సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

రాజాబాబు బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఎండీ, సీఈవోగా పి.రాజాబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో రాజాబాబు ఎండీగా బాధ్యతలు స్వీకరించడంతో పాటు ఓవర్సీస్ మాన్ పవర్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఓంక్యాప్) ఎక్స్ అఫీషియో ఎండీగా బాధ్యతలు చేపట్టారు.





సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రాయచోటి టీడీపీ మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, పి.గన్నవరం జనసేన నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీ దేవి, చిత్రంలో ఎమ్మెల్యే రాపాక

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు

- రాయచోటి నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి
- పి.గన్నవరం జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీ దేవి
- విజయవాడ పశ్చిమ జనసేన ఇన్‌చార్జి పోతిన మహేశ్



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన విజయవాడ పశ్చిమ జనసేన ఇన్‌చార్జి పోతిన మహేశ్

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ, జనసేనకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా బుధవారం పల్నాడు జిల్లా గంటావారిపాలెం నైట్ స్టే పాయింట్ వద్ద ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ కె ప్రభాకరరెడ్డి, ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ షేక్ హుస్సేన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఓలుదాసు కృష్ణమూర్తి, దివ్యకుమార్‌రెడ్డి, తదితర నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, వేంపల్లి సతీష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి...

పి.గన్నవరం జనసేన నాయకురాలు మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పాముల రంగారావు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 2019లో జనసేన పార్టీ తరఫున పి.గన్నవరం నుంచి పాముల రాజేశ్వరీదేవి పోటీ చేశారు. వారితోపాటు పాముల ప్రకాష్, కాంద్రేగుల అనంతబాబు, జనసేన జిల్లా కార్యదర్శి పోతు కాశీ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొంతు జవహర్‌లాల్, మాజీ ఎంపీటీసీ జి.ప్రభువర్మ, వై.నాగరాజు, చిలకపాటిశ్రీను, పలువురు ఇతర నేతలు చేరిన వారిలో ఉన్నారు. అదే విధంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయనతోపాటు విజయవాడ పట్టణ ఉపాధ్యక్షుడు వెన్నా శివశంకర్, పశ్చిమ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షుడు షేక్ అమీర్ బాషా, పి శ్రీనివాసరావు, ఎస్.రాముగుప్తా, పిల్లా వంశీకృష్ణ, సోమి గోవిందరావు, ఎం.హనుమాన్, సయ్యద్ మొబీనా, జిల్లి రమేష్, తదితర నేతలు చేరిన వారిలో ఉన్నారు.

ఐఎంజీ భారత్ అక్రమ భూకేటాయింపుపై దర్యాప్తునకు సీబీఐ సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడెమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్(ఐఎంజీ భారత్)కు అక్రమంగా భూముల కేటాయింపుపై దర్యాప్తునకు సీబీఐ సిద్ధంగా ఉందని, అదే విషయాన్ని ఆ సంస్థ దాఖలు చేసిన కౌంటర్‌లోనూ పేర్కొందని సీనియర్ న్యాయవాది గంట్ర మోహన్‌రావు పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. దేశంలో 2003లో జరిగిన అతిపెద్ద భూకుంభకోణం ఇదని.. దీనిపై సీబీఐ విచారణ కోరుతూ పిటిషనర్లు వ్యాజ్యాలు దాఖలు చేసి దాదాపు 12 ఏళ్లు గడిచిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రూ.వేల కోట్ల విలువైన (నేటి విలువ ప్రకారం దాదాపు రూ.లక్ష కోట్లు) హైదరాబాద్ పరిధిలో రెండుచోట్ల 850 ఎకరాల ప్రభుత్వ భూములను కారుచౌకగా ఓ బోగస్ కంపెనీకి కేటాయించారని, ఆ కంపెనీకి వందల కోట్ల రాయితీలు ఇవ్వడమే కాకుండా హైదరాబాద్‌లోని స్టేడియాలు అప్పగించారని.. దీని వెనుక నాటి రాజకీయ పెద్దలు(చంద్రబాబు ప్రభుత్వం) ఉన్నారని, సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు హైకోర్టులో 2012లో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. నాటి నుంచి వీటిపై విచారణ సాగుతూ ఉంది. ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి ఈ వ్యాజ్యాలపై విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున గంట్ర వాదనలు వినిపిస్తూ.. 'సుప్రీంకోర్టులో ఐఎంజీబీపీఎల్ దాఖలు చేసిన అప్పీల్‌కు, ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాలకు ఎలాంటి సంబంధం లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసమంటూ, సుప్రీంకోర్టులో అప్పీల్ అంటూ ఈ ఏడాదిలోనూ పదిసార్లు ఈ వ్యాజ్యాలు వాయిదా పడ్డాయి. విచారణ చేపట్టాలి' అని కోరారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. ఈ నెల 29కి వాయిదా వేసింది.

పోలవరం పూర్తికి కేంద్రం సాయం అవసరం

అందుకే బీజేపీతో కూటమి కట్టాం

- గాడి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే శక్తి ఎన్డీఏకే ఉంది
- జగన్‌కు శవరాజకీయాలు కొత్తేమీ కాదు
- వలంటీర్లు రాజకీయాలు చేస్తే వదిలిపెట్టం
- ప్రజాగళం సభలో బాబు, పవన్ వ్యాఖ్యలు
- బాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనం



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కనే పవన్

సాక్షి, రాజమహేంద్రవరం/నిడదవోలు/సాక్షి, భీమవరం/తణుకు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవ్వాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని, అందుకే ఎన్డీఏతో జత కట్టామని చంద్రబాబు చెప్పారు. రాజధాని, పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసుకోవాలంటే ఎన్డీఏ సహకారం అవసరమన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే శక్తి ఎన్డీయేకే ఉందని చెప్పారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడారు. 2019 నుంచి రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని చెప్పారు. అప్పులు, తప్పులతో కొన ఊపిరితో ఉన్న రాష్ట్రానికి ఎన్డీఏ ఆక్సిజన్‌లా పనిచేస్తుందన్నారు. జగన్ సింగిల్‌గా వస్తున్నాం అంటున్నారు.. కానీ శవాలతో వస్తున్నారని అన్నారు. శవ రాజకీయాలు జగన్‌కు కొత్తేమీ కాదన్నారు. జగన్ గొడ్డలి వేటుకు బలి కాని వారెవరున్నారని ప్రశ్నించారు. పింఛన్ల విషయంలో శవ రాజకీయాలు చేశారని ఆరోపించారు. వలంటీర్లు రాజకీయాలు చేస్తే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ప్రజా సేవ చేసే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామన్నారు.

పోలవరం గురించి అడిగితే మాట్లాడరు : పవన్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బూతులు తిట్టే వారికే పదవులిచ్చారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. పోలవరం, ఇతర ప్రాజెక్టులు ఎందుకు నిర్మించలేదంటే మంత్రులు సమాధానం చెప్పరని అన్నారు. ఒక మంత్రి మాత్రం తనను, చంద్రబాబును విమర్శిస్తారని, 'అబ్బనీ తియ్యని దెబ్బ' అంటూ స్టెప్పులేస్తారని చమత్కరించారు. అధికారం లేకపోతే తనకేమీ కాదని, నష్టపోయేది రాష్ట్ర ప్రజలేనని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. అక్రమ మద్యం వ్యాపారంలో వైఎస్సార్‌సీపీ నేతలు కీలకంగా ఉన్నారని ఆరోపించారు.

ఒకరికొకరు పొగడ్తలతో సరి

ఈ సభలో చంద్రబాబు, పవన్ ఒకరినొకరు పొగుడుకోవడంతో వచ్చిన కాస్త మంది కార్యకర్తలు కూడా విసుగెత్తిపోయారు.చంద్రబాబుప్రసంగిస్తుండగానే తిరిగి వెళ్లిపోయారు. నిడదవోలులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావుకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తణుకు సభకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు గైర్హాజరయ్యారు. నిరసన తెలిపేందుకు విడివాడ అనుచరులు మాత్రమే వచ్చారు. అప్పట్లో మోటార్ సైకిల్ ర్యాలీలతో హడావుడి చేసిన యువత ప్రస్తుతం కనిపించలేదు.

నా పాలనలో 'బాదుడే.. బాదుడు': బాబు

తన ఐదేళ్ల పాలనలో ఏ హామీ అమలు చేయని చంద్రబాబు.. తాను చేసినదేమిటో చెప్పుకోవాలని అనుకున్నారు.. వెంటనే ఆయన నోటి నుంచి 'బాదుడే.. బాదుడు' అన్న మాటలు వచ్చాయి. తణుకులో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. '2014 నుంచి 2019 వరకు (చంద్రబాబు సీఎంగా ఉన్న కాలం) ఈ రాష్ట్రంలో ఏం జరిగిందో ఒక్కసారి గుర్తు చేసుకోవాలి.. బాదుడే.. బాదుడు..' అని చెప్పుకొన్నారు.

ఎలాగూ చేయం కదా.. ఇచ్చేద్దాం హామీలు

అధికారమే పరమావధిగా హామీలివ్వడం... అందలం ఎక్కాక వాటిని చాప చుట్టేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు అలవాటే. ఎన్నికలొస్తే చాలు ప్రజలపై ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చేస్తుంది. ఆ మత్తులో లెక్కలేనన్ని వాగ్దానాలు చేసేస్తారు. ఇంకా నమ్మరేమోనని ప్రతి సమావేశానికో కొత్త విషయం గుర్తుకొస్తుంది. అప్పటికప్పుడు ప్రకటించేసి జనాన్ని ఆకట్టుకోవడానికి విఫలయత్నం చేసేస్తుంటారు. తాజా ఎన్నికల్లోనూ రోజుకో కొత్త హామీతో జనం ముందుకొస్తున్నా... గత అనుభవాల దృష్ట్యా ఎవ్వరూ వాటిని నమ్మడంలేదు.

సాక్షి, అమరావతి: ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ కూటమి నేతల్లో వణుకు మొదలవుతోంది. ఒక వైపు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగే విషయాలను చెబుతూ... ఇప్పటివరకూ తాను అమలు చేసిన పథకాలను తెలియజేస్తూ ఓ ప్రణాళికా బద్ధంగా ప్రచారంలో ముందుకెళుతుంటే... చంద్రబాబు ప్రజలను బురిడీ కొట్టించడానికి రోజుకో కొత్త హామీతో ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో ఇంగితాన్ని సైతం విస్మరిస్తున్నారు. ప్రజలకు సేవలందించే వలంటీర్ల విషయంలోనూ పూటకో మాటతో నవ్వుల పాలయ్యారు. తాను తప్పు చేశానని తెలుసుకుని దాన్ని సరిదిద్దుకుంటున్నాననే భ్రమలో లెక్కలేనన్ని తాయిలాలు ప్రకటించి వారి ముందు కూడా పిల్లిమొగ్గలేస్తున్నారు.

తుస్సుమన్న సూపర్ సిక్స్!

ఈ సారి ఎలాగైనా జనాన్ని తనవైపు తిప్పుకుని అధికారం కొట్టేయాలనే దురుద్దేశంతో చంద్రబాబు ఆరు నెలల క్రితమే ప్రయత్నాలు మొదలుపెట్టారు. వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించిన నోటితోనే ఎన్నికలు సమీపించేసరికి వాటి తరహాలోనే కొత్త పథకాలు అమలు చేస్తానని ముందస్తు మేనిఫెస్టో ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న అమ్మఒడి పథకాన్నే తాను ఇంకా మెరుగు పరిచి అమలు చేస్తానని నిస్సిగ్గుతో మేనిఫెస్టోలో పెట్టుకుని ప్రచారం చేశారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వాగ్దానాన్ని కాపీ కొట్టి ఇక్కడా అలాగే చేస్తానని చెప్పారు. ఇలా కాపీ హామీలన్నింటికీ సూపర్ సిక్స్ అన్న ట్యాగ్ తగిలించి 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ తెగ ఊదరగొట్టారు. వాటిపైనా ప్రజల్లో స్పందన కనిపించకపోయేసరికి జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌తో కలిసి ఉమ్మడి మేనిఫెస్టో అంటూ కొన్నాళ్లు హడావుడి చేసి ఇంకొన్ని హామీలను జతచేసి ప్రచారం చేశారు. వాటినీ ఎవరూ పట్టించుకోకపోవడంతో తాజాగా రోజుకో కొత్త హామీని ప్రకటించేస్తున్నారు.

ప్రజా మేనిఫెస్టో పేరుతో కొత్త నాటకం

ప్రజలను ఎలాగైనా నమ్మించేందుకు వేయని ఎత్తుగడ లేదు. త్వరలో ప్రజా మేనిఫెస్టో విడుదల చేస్తామని దానికి ప్రజలే సలహాలు, సూచనలు ఇవ్వాలని ఓ టోల్‌ఫ్రీ నంబర్‌ను విడుదల చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున ఈ మేనిఫెస్టో ప్రకటిస్తామని చంద్రబాబు చెబుతున్నారు. ఇందుకోసం ఒక కమిటీని కూడా నియమించారు. ఏం చెబితే ప్రజలు నమ్ముతారో అధ్యయనం చేయడమే ఈ కమిటీ పని. 2014 ఎన్నికల్లో ఇదే కూటమి తరఫున చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చి ప్రజలను మాయ చేశారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణ మాఫీ అని నమ్మించి అధికారంలోకి వచ్చాక నిండా ముంచేశారు. ఆయన పుణ్యమాని రైతులు రుణ విముక్తులు కాలేక అప్పులపాలవ్వగా... డ్వాక్రా మహిళలు డిఫాల్టర్లయ్యారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని, ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఉన్న ఉద్యోగాలను తొలగించారు. ఇలా ఏకంగా 600కు పైగా హామీలిచ్చి ఒక్కదాన్ని కూడా అమలు చేయకుండా మోసగించారు. వీటిగురించి విపక్షాలు ప్రశ్నిస్తున్నాయని ఏకంగా పార్టీ వెబ్‌సైట్ నుంచి ఆ మేనిఫెస్టోనే తొలగించారు. దానికి ప్రతిఫలమే 2019 ఎన్నికల్లో ఆయన్ను ప్రతిపక్షంలో కూర్చునేలా చేసింది. ఇప్పుడు మళ్లీ కొత్త హామీలతో ప్రజలను బుట్టలో వేసుకోవాలని చూస్తున్నారు. ఎలాగూ అమలు చేసేది లేదు కాబట్టి ఎడాపెడా హామీల వరద పారించేస్తున్నారు. కానీ వారెవ్వరూ బాబు హామీలను విశ్వసించడంలేదు.

ధైర్యం ఉంటే నన్ను విమర్శించు పవన్

- చిన్న సినిమా ఆర్టిస్టులతో తిట్టించడం దేనికి?
- ఘోరాతిఘోరంగా హైదరాబాద్‌లో పవన్‌కు అవమానం జరిగింది
- అలాంటి వ్యక్తి ఇంటికి టిఫిన్ చేయడానికి వెళ్లాడు
- ఈ కోపం, పౌరుషం, ఆవేశం అప్పుడేమయ్యాయి?
- వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం ధ్వజం



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు

కిర్లంపూడి: గతంలో పవన్ కళ్యాణ్‌కు ఎవరికీ జరగని రీతిలో హైదరాబాద్‌లో ఘోరాతిఘోరంగా అవమానం జరిగిందని వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇంటికి వెళ్లి పవన్ టిఫిన్ చేసి వచ్చాడన్నారు. సీఎంను తిట్టడానికి బహిరంగ సభల్లో ఊగిపోతున్న ఆయనకు ఈ కోపం, పౌరుషం, పట్టుదల, ఆవేశం అప్పుడు ఎక్కడికి పోయాయన్నారు. పవన్‌కు జరిగిన అవమానం సామాన్యుడికి జరిగినా వారు నిలదీస్తారని.. కానీ ఈ పెద్దమనిషి ఒక్క మాటకూడా అనలేదని గుర్తు చేశారు. చిన్న సినిమా ఆర్టిస్టులతో తనను పవన్ తిట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు ధైర్యం ఉంటే నేరుగా తనను విమర్శించాలని సవాల్ విసిరారు. మీడియా ముందుకొచ్చి తనను కొన్ని ప్రశ్నలు అడిగితే తాను కూడా పవన్‌ను కొన్ని ప్రశ్నలు అడుగుతానన్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి అగ్నికుల క్షత్రియులు, యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్ద ఎత్తున కాకినాడ జిల్లా కిర్లంపూడికి తరలివచ్చి ముద్రగడను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ పవన్ సినిమాలు తీసుకోవడానికి పిఠాపురంలో ఎమ్మెల్యే పదవి కావాలనడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ తనతోపాటు నారా లోకేశ్‌ను, నందమూరి బాలకృష్ణను కూడా తీసుకొచ్చి రాష్ట్రమంతా ప్రచారం చేయించగలరా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం ఇస్తామని, వైఎస్సార్‌సీపీ ఓటరుకి లక్ష రూపాయలు ఇస్తుందని మాట్లాడటం ప్రజలను అవమానించడమేనని ముద్రగడ మండిపడ్డారు.

అప్పుడప్పుడూ రాజకీయాలు చేసేవారిని పక్కనపెట్టాలి

అప్పుడప్పుడూ వచ్చి రాజకీయాలు చేసే నాయకులను పక్కన పెట్టి ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, పిఠాపురం అభ్యర్థి వంగా గీతను గెలిపించి జగన్‌ను మరోసారి సీఎం చేయాలని ముద్రగడ అభ్యర్థించారు.

మరో 30 ఏళ్లు వైఎస్ జగన్ సీఎంగా ఉంటారు..

'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి త్వరలో పిఠాపురంలో సీఎం వైఎస్ జగన్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదవారికి కడుపు నిండా భోజనం పెడుతున్న వైఎస్ జగన్ మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ముద్రగడ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం చూడలేక, అధికారం దక్కదనే ఉక్రోశంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు బహిరంగ సభల్లో ముఖ్యమంత్రిని నోటికొచ్చినట్టు బూతులు తిట్టడం సభ్యత అనిపించుకోదన్నారు. జగన్‌ను తిట్టడం, అధికార దాహంతో నోటికొచ్చిన అబద్ధాలు ఆడడం చంద్రబాబు స్థాయికి తగదన్నారు.

'కూటమి' ఓటమే మాల, మాదిగల లక్ష్యం

- మాల, మాదిగల ఉమ్మడి శత్రువు చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ



తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు కూటమిని ఓడించటమే మాల, మాదిగల లక్ష్యమని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ చెప్పారు. చంద్రబాబును మాల, మాదిగలు తమ ఉమ్మడి శత్రువుగా భావిస్తున్నారనీ, ఆయన ఏర్పాటు చేసుకున్న కూటమి ఓటమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తారని స్పష్టంచేశారు. ఆయన బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అంటూ అవమానించిన చంద్రబాబును ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు పేరిట కొందరు నాయకులు వేర్వేరుగా కలిసి మద్దతు తెలియజేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలు ఎక్కువగా ఉన్నారని ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు మద్దతు ఇచ్చారని, దీనిని వ్యతిరేకిస్తూ మాలలు 'చలో అసెంబ్లీ' నిర్వహిస్తే అరెస్టులు, లాఠీచార్జ్‌లు చేయించారని గుర్తుచేశారు. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలు తక్కువగా ఉన్నారని భావించి ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన కురుక్షేత్ర సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవటమే కాకుండా లాఠీచార్జ్ చేసి, మాదిగలపై అక్రమ కేసులు బనాయించారని వివరించారు. ఇలా చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతూ మాల, మాదిగల మధ్య విభేదాలను సృష్టించి, విద్వేషాలను రెచ్చగొడుతూ తన స్వార్థ రాజకీయాల కోసం బలిచేస్తున్నారని కృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. మాల, మాదిగల విషయంలో చంద్రబాబు రెండు నాల్కల సిద్ధాంతం పలు సందర్భాల్లో రుజువైందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో మాల, మాదిగలు సంతోషంగా ఉన్నారని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఆశించిన ఫలితాలు వారికి అందుతున్నాయని తెలిపారు.

మాలలంతా వైఎస్సార్‌సీపీ వెంటే..

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న మాలలంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని మాల మహానాడు (పీవీ రావు) జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు తెలిపారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2024లో మళ్లీ మాలలంతా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 1997లో చంద్రబాబు మాలలను గుర్రాలతో తొక్కించారని, అప్పటి మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీ రావును గుర్రాలతో తొక్కించి వారి అనుచరులు ఐదుగురిని పొట్టన పెట్టుకున్నారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అంటూ మాల, మాదిగల జీవితాలతో ఆడుకున్నది చంద్రబాబేనని ధ్వజమెత్తారు. ఆనాడే బాబును మాలల ద్రోహిగా మాలలంతా కలిసి నిర్ణయించినట్టు వెల్లడించారు. బాలయోగిని స్పీకర్‌ను చేసి అతను ఇంకా పెద్ద స్థాయికి ఎదుగుతారన్న దుగ్ధతో హెలికాప్టర్‌లో బాంబు పెట్టి చంపించిన ఘనత కూడా చంద్రబాబుదేనని ఆరోపించారు. 2014 నుంచి 19 వరకు ఎస్సీలకు చంద్రబాబు రూ.2700 కోట్లు ఖర్చు చేస్తే.. సీఎం వైఎస్ జగన్ 2019 నుంచి 2024 లోపు ఎస్సీలకి ఇంచుమించుగా రూ.70 వేల కోట్లను వారి బ్యాంకు ఖాతాలో డైరెక్ట్‌గా ఇన్ డైరెక్ట్‌గా జమ చేసినట్టు చెప్పారు. చంద్రబాబు 2014 నుంచి 19 వరకు మాల, మాదిగలకు చెరో మంత్రి పదవి ఇస్తే.. సీఎం జగన్ మాత్రం మాలలకు మూడు, మాదిగలకు రెండు మంత్రి పదవులిచ్చి గౌరవించినట్టు తెలిపారు. మాలమాదిగలను విడదీసి వర్గీకరణ చేసి, అనేక మంది చావుకు చంద్రబాబు కారకుడయ్యారని దుయ్యబట్టారు. ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా..? అంటూ వారిని అవహేళన చేసిన చంద్రబాబుకు మాలలు ఎప్పుడూ ఓటు వేయరని స్పష్టం చేశారు. మాలలను ఎప్పుడు టీడీపీ ఆఫీస్‌లోకి కూడా రానివ్వని చంద్రబాబుకు ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి వారు గుర్తొచ్చారని, చంద్రబాబును మాలలు నమ్మే రోజులు పోయాయన్నారు.

అక్రమ సంపాదనలో బాబు పెద్ద ముదురు

- దమ్ముంటే నాకు స్టీల్ ఫ్యాక్టరీలు ఉన్నాయని నిరూపించండి
- నేను, నా కుమారుడు రాజకీయాల నుంచి తప్పుకుంటాం: మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: సీఎం జగన్ స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయడంలో తాము ముదుర్లమని, అక్రమ సంపాదనలో మాత్రం చంద్రబాబే పెద్ద ముదురు అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. చంద్రబాబు పెద్ద ముదురు కాబట్టే 2 ఎకరాల ఆసామి రూ.2 లక్షల కోట్లకు అధిపతి అయ్యాడని ధ్వజమెత్తారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసి లక్షల కోట్లు ఆర్జించి ఆ డబ్బుతోనే ఇతర రాజకీయ పార్టీలకు ప్యాకేజీలు కుమ్మరిస్తూ ఓట్లు కొనాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. మంత్రి బుధవారం రాత్రి ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాగళం సభలో చంద్రబాబు, పవన్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబు రైతుల శ్రేయస్సు గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. సీఎం జగన్ ఏ పంట నష్టం ఆ సీజన్‌లోనే రైతులకు అందించారని, పంట కొన్న రోజుల వ్యవధిలోనే రైతుల బ్యాంకుల ఖాతాల్లోకి డబ్బులు జమచేశారని గుర్తుచేశారు. చంద్రబాబు చేసిన దోపిడీపై నమోదైన కేసుల్లో తెచ్చుకున్న స్టేలు ఉపసంహరించుకుని నీతివంతుడని తేల్చుకోగలరా అని సవాల్ చేశారు. తనకు రెండు స్టీల్ ఫ్యాక్టరీలు ఉన్నట్లు నిరూపిస్తే తాను, తన కుమారుడు కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటామని, నిరూపించలేకపోతే బాబు, ఆయన కొడుకు తప్పుకుంటారా అని సవాల్ చేశారు. టీడీఆర్ బాండ్లపై తణుకు నరేంద్ర సెంటర్‌లో చర్చకు చంద్రబాబు ఆయన దత్తపుత్రుడు వస్తారా అని నిలదీశారు.వలంటీర్లు మీ కౌన్సిలర్లు చెప్పిందే చేయాలని, చెప్పిన వారికే పింఛను, బియ్యం కార్డులివ్వాలని చెప్పడం ద్వారా లోకేశ్ మీ స్వార్థ బుద్ధిని తెలిపాడని అన్నారు. వలంటీర్లపై నోరు పారేసుకున్న చంద్రబాబు ఇప్పుడు రూ.10 వేలు ఇస్తానని చెప్పడం మరో వంచనకు తెరతీయడమేనని అన్నారు. కోవిడ్ సమయంలో పవన్, చంద్రబాబు తెలంగాణలో అద్దాల మేడల్లో దాక్కున్నారని చెప్పారు. తాము, తమ పార్టీ నాయకులు ప్రజల కోసం చావుకు తెగించి రోడ్లపైనే తిరిగామని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని చెప్పారు.

క్లుప్తంగా...

సాక్షులను 'ఏబీ' బెదిరిస్తున్నారు

- ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారు
- ఏబీ వెంకటేశ్వరరావు పిటిషన్‌పై క్యాట్‌లో ఏజీ శ్రీరామ్ వాదనలు
- తదుపరి విచారణ 16కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వెంట్ హోదాలో ఉన్న ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు.. ప్రభుత్వానికి, ఇతర ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా ఆరోపణలు చేయడంతోపాటు, ఆయనపై దాఖలైన కేసులో సాక్షులను బెదిరించే ప్రయత్నం చేశారని ఆంధ్రప్రదేశ్ అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈ మేరకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్, జీపీ పాండురంగారెడ్డి వాదించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇజ్రాయిల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ పరికరాలు తెచ్చినట్లు ఆరోపణలు రావడంతో ఏపీ ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది. అనంతరం సస్పెన్షన్ పూర్తయ్యాక ఏబీ విధుల్లో చేరారు. విధుల్లో చేరాక ఏబీ వెంకటేశ్వరరావు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని ట్యాపింగ్ కేసులో సాక్షులను బెదిరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ప్రభుత్వం మరోసారి ఆయన్ని సస్పెండ్ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఏబీ గతేడాది ఏప్రిల్‌లో క్యాట్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై క్యాట్ బెంచ్ బుధవారం విచారణ చేపట్టింది. ఏజీ వాదనలు విన్న బెంచ్.. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాడని దాడి

- దుర్భాషలాడి కొట్టిన టీడీపీ మద్దతుదారులు
- ప్రకాశం జిల్లాలో ఘటన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కే బిట్రగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన చేజెర్ల మాధవపై టీడీపీ సానుభూతిపరులు దాడి చేసి గాయపరచిన ఘటన ఆదివారం రాత్రి జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. మాధవ కథనం ప్రకారం.. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన మాధవ చీటీలు, వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. టీడీపీకి చెందిన మాధవ కొద్ది రోజుల కిందట కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇది నచ్చని టీడీపీ మద్దతుదారులు మాధవను ఆర్థికంగా ఇబ్బంది పెట్టసాగారు. చీటీ డబ్బులు ఇవ్వాల్సిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి మాధవ్ పార్టీ మారాడని, అతనికి డబ్బులు ఇవ్వొద్దంటూ అడ్డుకున్నారు. మాధవ వద్ద అప్పు తీసుకున్న వారిని కూడా డబ్బులు తిరిగి ఇవ్వొద్దంటూ ఒత్తిడి చేశారు. అదే సమయంలో మాధవ డబ్బులు ఇవ్వాల్సిన వారిని టీడీపీ మద్దతుదారులు రెచ్చగొట్టి డబ్బుల కోసం మాధవపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తన ఇంటి సమీపానికి వచ్చిన టీడీపీ సానుభూతిపరులను ఈ విషయాలపై మాధవ నిలదీశాడు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి సుమారు 20 మంది వరకు మాధవ ఇంటివద్దకు వచ్చి దుర్భాషలాడి దాడి చేసి కొట్టారు. దీనిపై జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు మాధవ చెప్పారు.

చంద్రబాబు వలంటీర్ల కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పాలి

జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు



మధురవాడ(విశాఖ): నాలుగున్నరేళ్లుగా వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులనీ, రేపిస్టులనీ, అమ్మాయిలను రెడ్‌లైట్ ఏరియాకు సరఫరా చేసే బ్రోకర్లనీ, గూండాలనీ, పెన్షన్ డబ్బులు కాజేసే దొంగలనీ నోటికొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు ముందు వలంటీర్ల కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. వారి పట్ల ఇంత దారుణమైన పదాలు ఉపయోగించి ఇప్పుడు వారికి రూ.10వేలు పారితోషికం ఇస్తానని బూటకపు హామీలు ఇస్తే నమ్మడానికి వలంటీర్లు సిద్ధంగా లేరన్నారు. వలంటీర్ల ద్వారా పెన్షన్ డబ్బులు పంపిణీ చేయకూడదని నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా బాబు అడ్డుకున్నాడని మండిపడ్డారు. వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని, అందితే జుట్టు అందకపోతే కాళ్లు పట్టుకునే నైజం చంద్రబాబుదని వాసు ధ్వజమెత్తారు.

ప్రధాన నగరాలు, పట్టణాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	40.4	26.2
గుంటూరు	40.0	25.0
తిరుపతి	40.0	23.0
రాజమహేంద్రవరం	40.0	23.0
కడప	39.2	24.6
విజయవాడ	39.0	25.0
ఏలూరు	38.0	25.0
చిత్తూరు	38.0	20.0
విశాఖపట్నం	37.2	22.0
నెల్లూరు	36.1	27.6

కాకి లెక్కలు కుదరవ్!

మార్గదర్శికి తేల్చి చెప్పిన 'సుప్రీం కోర్టు'

- డిపాజిటర్లకు పూర్తిగా చెల్లించేశామన్న రామోజీ
- తమ ఆడిటర్లు లెక్కలు తేల్చేశారంటూ వాదన
- మీ సొంత ఆడిటర్లు చెబితే చెల్లదు..
- అది ధ్రువీకరించాల్సింది రెండు రాష్ట్ర ప్రభుత్వాలేనన్న సుప్రీం
- బహిరంగ నోటీసు ఇవ్వనున్న ఇరు ప్రభుత్వాలు
- డిపాజిటర్ల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు సన్నద్ధం



సాక్షి, అమరావతి: 'నేరం నాదే..! దర్యాప్తు నాదే..! తీర్పూ నాదే..!' అంటూ మొండికేస్తున్న ఈనాడు రామోజీకి సుప్రీంకోర్టు గట్టి మొట్టికాయలు వేసింది. ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా సేకరించిన డిపాజిట్లను తిరిగి డిపాజిట్‌దారులకు చెల్లించేశామని, తమ ఆడిటర్లు ఈ లెక్కలు తేల్చేశారంటూ నమ్మబలుకుతున్న మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చింది. ఆ విషయాన్ని నిర్ధారించాల్సింది మార్గదర్శి ఆడిటర్లు కాదని, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ధ్రువీకరించాలని తేల్చి చెప్పింది. దీంతో రామోజీ గొంతులో పచ్చి వెలగకాయ పడింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు బహిరంగ ప్రకటన జారీ చేసి అభ్యంతరాలు స్వీకరణకు సన్నద్ధం కానుండటం రామోజీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.

చెల్లించేశాం.. లెక్క తేల్చేశాం: రామోజీ వితండవాదం

ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించిన కేసులో చెరుకూరి రామోజీరావు అడ్డగోలు వాదనలు సుప్రీంకోర్టులో ఫలించలేదు. 2023 జూన్ 30 నాటికి 1,247 మంది డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని, కేవలం రూ.5.31 కోట్లు మాత్రమే అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్నాయని ఆయన న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. ఈ విషయాన్ని మార్గదర్శి ఫైనాన్సియర్స్ **ఆడిటర్లు క్షుణ్ణంగా ఆడిట్ చేసి నివేదిక సమర్పించారని, అన్ని లెక్కలు సరిపోయాయని చెప్పుకొచ్చారు. అందువల్ల మార్గదర్శి ఫైనాన్సియర్స్ డిపాజిట్‌దారులు, చెల్లింపుల వివరాలను వెల్లడించ**ాల్సిన అవసరం లేదని వితండవాదం చేశారు. తద్వారా మార్గదర్శి ఫైనాన్సియర్స్‌లో అక్రమంగా డిపాజిట్ చేసినవారి పేర్లు, ఆ డిపాజిట్ మొత్తాల వివరాలు బయటకు రాకుండా చేసేందుకు రామోజీ ప్రయాస పడ్డారు. అక్రమ డిపాజిట్ల వెనుక భారీగా నల్లధనం దాగి ఉండటమే దీనికి కారణం.

అదేం కుదరదు... నిగ్గు తేలాల్సిందే..

రామోజీ తరఫు న్యాయవాదుల వాదనలను సుప్రీం కోర్టు కొట్టిపారేసింది. 'డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని మీరు చెబితే సరిపోదు. మీ దగ్గర పని చేసే ఆడిటర్ల నివేదికను పరిగణలోకి తీసుకోలేం' అని స్పష్టం చేసింది. డిపాజిట్‌దారులకు న్యాయం జరిగిందో లేదో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు నిర్ధారించాలని పేర్కొంది. 'రూ.5 వేలు డిపాజిట్ చేసిన వ్యక్తి తనకు న్యాయం జరగలేదని న్యాయస్థానాన్ని ఆశ్రయించలేరు.. అంతటి వ్యయ ప్రయాసలు భరించలేరు కదా..!' అని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను పార్టీగా చేరుస్తూ ఈ కేసును తెలంగాణ హైకోర్టు విచారించాలని తీర్పునిచ్చింది. డిపాజిట్లు తిరిగి చెల్లించారో లేదో పరిశీలించేందుకు ఓ జ్యుడిషియల్ అధికారిని నియమించాలని ఆదేశించింది. మొత్తం విచారణ ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని సుప్రీం కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది.

బహిరంగ ప్రకటన.. అభ్యంతరాల స్వీకరణ

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ కేసు కీలక మలుపు తిరిగింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీ సేకరించిన అక్రమ డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలపై ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లోనే డిపాజిట్‌దారులు అత్యధికంగా ఉన్నారు. వారి ప్రయోజనాలను పరిరక్షించాల్సిన బాధ్యత రెండు రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. తెలంగాణ హైకోర్టు నియమించే జ్యుడిషియల్ అధికారిని సంప్రదించి బహిరంగ ప్రకటన జారీ చేసేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేయనున్నాయి. అగ్రిగోల్డ్ కేసులో మాదిరిగానే ఈ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంది. బహిరంగ ప్రకటన జారీ చేసి డిపాజిట్‌దారులకు సమస్యలుంటే నివేదించాలని కోరనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తారు. డిపాజిట్లు తిరిగి చెల్లించకుంటే ఆ సెల్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వీటిని క్రోడీకరించి తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడతాయి. ఇక రామోజీ డిపాజిట్లు చెల్లించేశామని చెబుతున్న వారి వివరాలను కూడా వెల్లడించాల్సి ఉంటుంది. ఆ వివరాలను జ్యుడీషియల్ అధికారితోపాటు రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు అందచేయాలి. వాటిని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు బహిరంగ నోటీసు ద్వారా విడుదల చేస్తాయి. అందులోని డిపాజిట్‌దారుల పేర్లు, చెల్లింపుల వివరాలను పరిశీలిస్తాయి. వాటిపై వ్యక్తమయ్యే అభ్యంతరాలపై విచారణ చేపడతాయి. అనంతరం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నివేదికల ఆధారంగా జ్యుడీషియల్ అధికారి తదుపరి చర్యలు తీసుకుంటారు. దీనిపై తెలంగాణ హైకోర్టు విచారిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఆరు నెలల్లో పూర్తి కావాల్సి ఉంది. ఇరు ప్రభుత్వాలు బహిరంగ నోటీసు ఇవ్వడంతో పాటు జిల్లా స్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు దిశగా వేగంగా చర్యలు చేపట్టాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

ఓటరుకు, వలంటీర్‌కు జగన్ అంటే నమ్మకం

- చంద్రబాబు పేరు చెబితే దగా అని తెలుసు
- వలంటీర్లపై అమానుషంగా మాట్లాడి ఇప్పుడు రూ.10 వేలు ఇస్తానంటారా?
- రూ.లక్ష ఇస్తానన్నా బాబును నమ్మరు
- సుప్రీంకోర్టులో రామోజీకి ఎదురుదెబ్బ తగిలితే ఈనాడులో వార్త ఏదీ?
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

చిలకలపూడి (మచిలీపట్నం): ఓటరు, వలంటీర్‌కు సీఎం వైఎస్ జగన్ అంటే ఎంతో నమ్మకమని.. అదే సమయంలో చంద్రబాబు పేరు చెబితే దగా అనే విషయం కూడా తెలుసని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. చంద్రబాబుకు ప్రజల్లో లేని బలాన్ని, నమ్మకాన్ని చూపడానికి రామోజీరావు తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే అభూత కల్పనలతో, అబద్ధాలతో వార్తలు రాస్తున్నారని నిప్పులు చెరిగారు. చంద్రబాబుకు అతి పెద్ద జాకీగా ఈనాడు పత్రిక పనిచేస్తోందని మండిపడ్డారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో బుధవారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ద్వారా చట్టవిరుద్ధంగా, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల రూపాయలు వసూలు చేసిన రామోజీరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు అయ్యిందన్నారు. అక్రమ డిపాజిట్ల సొమ్ముతోనే రామోజీరావు పేపర్లు, టీవీలను నడుపుతున్నారని విమర్శించారు. వీటిద్వారా తనకు అనుకూలమైన వ్యక్తులను అందలం ఎక్కించి వ్యాపారాన్ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 2005 నుంచి మార్గదర్శి కేసు నడుస్తోందని గుర్తు చేశారు. రూ.2 వేల కోట్లు అక్రమ డిపాజిట్ల రూపంలో వసూలు చేసి.. ఆ డబ్బులు చెల్లించకుండా, వివరాలు చెప్పకుండా, డిపాజిట్‌దారులు ఎవరో తెలియజేయకుండా రామోజీరావు గోప్యంగా ఉంచుతున్నారని ఆరోపించారు. ఇంతకూ అసలు అది ఎవరి సొమ్మో ఆయనే తెలియజేయాలని డిమాండ్ చేశారు.

బాబుది పెత్తందారీ మనస్తత్వం..



సీఎం వైఎస్ జగన్ పేదలకు టికెట్లు ఇస్తే.. చంద్రబాబు డబ్బున్న పెత్తందారులకు మాత్రమే సీట్లు కట్టబెట్టారని పేర్ని నాని ధ్వజమెత్తారు. టిప్పర్ డ్రైవర్‌కు సీటు ఇచ్చారని చంద్రబాబు ఎగతాళి చేస్తూ మాట్లాడారని.. దీన్నిబట్టే ఆయన పెత్తందారీ మనస్తత్వం ఏమిటో ప్రజలు తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు కన్నా ఎక్కువ విద్యార్హతలు ఉన్న రామాంజనేయులుకు సీఎం వైఎస్ జగన్ టికెట్ ఇచ్చారన్నారు. డబ్బులు కుమ్మరించినవారికే వైఎస్సార్‌సీపీ సీట్లు ఇచ్చిందని రామోజీరావు రాస్తున్నారని.. వాస్తవానికి బీజేపీ, జనసేన, టీడీపీ 90 శాతం సంపన్నులకే టికెట్లు ఇచ్చాయన్నారు. దీన్నిబట్టే ఎవరు డబ్బులు కుమ్మరిస్తున్నారో తెలుస్తోందన్నారు. జెండా మోయని వారికి, ఆ పూటకాపూట పార్టీలో చేరినవారికి, కోట్లాది రూపాయలు ఉన్నవారికి టికెట్లు ఇచ్చింది ఆ పార్టీలు కాదా అని ప్రశ్నించారు.

మార్గదర్శి అక్రమాలపై ఈనాడులో రాయలేదే..

ఇటీవల మార్గదర్శికి చెందిన రూ.50 లక్షలను పోలీసులు పట్టుకుంటే.. వాటికి సంబంధించిన ఆధారాలు చూపి ఎందుకు డబ్బును వెనక్కి తీసుకోలేదని పేర్ని నాని ప్రశ్నించారు. తప్పుడు వార్తలు రాస్తున్న రామోజీరావు వలంటీర్లకు చంద్రబాబు నెలకు రూ.10 వేలు ఇస్తానన్నారని వార్త రాయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వలంటీర్లపై చంద్రబాబు, పవన్ అమానుషంగా మాట్లాడారని గుర్తు చేశారు. వలంటీర్లు దొంగతనంగా ఇళ్లలోకి దూరుతున్నారని, రెడ్‌లైట్ ఏరియాకు అమ్మాయిలను సరఫరా చేస్తున్నారని చంద్రబాబు, పవన్ వ్యాఖ్యానించారని.. ఇప్పుడు రూ.10 వేలు వారికి రివార్డు కింద ఇవ్వబోతున్నారా అని నిలదీశారు. సుప్రీంకోర్టులో మార్గదర్శికి వ్యతిరేకంగా తీర్పు వస్తే దాని గురించి ఈనాడు పత్రికలో వార్త ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. అవకతవకల గురించి ఎందుకు రాసుకోరని నిలదీశారు. వలంటీర్లపై ప్రేమ కురిపిస్తున్న చంద్రబాబును ప్రజలే నమ్మడం లేదని.. వలంటీర్లు ఎలా నమ్ముతారన్నారు. వలంటీర్లకు నెలకు రూ.లక్ష ఇస్తానన్నా చంద్రబాబును నమ్మే పరిస్థితిలో వారు లేరని స్పష్టం చేశారు.

ఆర్థిక ఉగ్రవాది ఉన్మాదం

- మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు, టీడీపీ డీలాతో రామోజీ బెంబేలు
- ఆర్థిక ఉగ్రవాది పత్రిక నడిపితే ఎలా ఉంటుందో నిరూపిస్తోన్న ఈనాడు



సాక్షి, అమరావతి: ఆర్థిక ఉగ్రవాది పత్రిక నడిపితే ఎలా ఉంటుందో 'ఈనాడు' చాటి చెబుతోంది. జర్నలిజాన్ని అడ్డుపెట్టుకుని ఆర్బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా డిపాజిట్లు సేకరించడమే అందుకు నిదర్శనం. సుప్రీంకోర్టు తీర్పుతో ఆ ఆర్థిక నేరం గుట్టంతా రట్టవుతుండటం.. తన శిష్యుడు చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని తేలడంతో రామోజీరావు భయంతో వణికి పోతున్నారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయం సాధించడం దిశగా దూసుకెళ్తోందని టైమ్స్‌నౌ–ఈటీజీ, జీ న్యూస్ తదితర ప్రతిష్టాత్మక జాతీయ మీడియా సంస్థల సర్వేలు తేల్చిచెప్పడం.. రాజకీయ విశ్లేషకులూ అదే మాట చెబుతుండటం రామోజీరావుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఓటర్లను ప్రలోభపెట్టి ఓట్లను కొల్లగొట్టేందుకు వేల కోట్లు కుమ్మరిస్తోందని.. అడిగేవారు, అడ్డుకునేవారు లేకపోవడంతో చెలరేగిపోతోందంటూ వైఎస్సార్‌సీపీపై విషం చిమ్ముతూ బుధవారం 'ఈనాడు'లో 'కుమ్మరించేస్తోంది' శీర్షికన రోతరాతలు అచ్చేశారు. ఇటీవల ఐదు జిల్లాల ఎస్పీలు, ఒక ఐజీ, మూడు జిల్లాల కలెక్టర్లను ఎన్నికల సంఘం (ఈసీ) బదిలీ చేస్తే.. 'ఈడ్చికొట్టిన ఈసీ' అంటూ శివాలెత్తిన రామోజీ.. మార్గదర్శి కుంభకోణంపై విచారించిన అధికారి కొల్లి రఘురామిరెడ్డిని ఎన్నికల పరిశీలకుడిగా ఈసీ అస్సాంకు పంపితే.. 'కొల్లికి షాక్' అంటూ కథనాన్ని అచ్చేసి సంబరపడ్డారు. ఈసీ కనుసన్నల్లో అధికారులు పని చేస్తుంటే.. అడిగేవారు, అడ్డుకునేవారు లేరంటూ ఇప్పుడు ఎన్నికల సంఘంపై అభాండాలు వేయడం చూస్తే రామోజీరావు మతిస్థిమితం కోల్పోయారేమో అనిపిస్తోంది. ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహిస్తుంటే.. ఏ రోజు లెక్కలు ఆ రోజే తేలుస్తుంటే.. ప్రతి మద్యం దుకాణానికి వైఎస్సార్‌సీపీ రూ.పది లక్షలు ముందస్తు చెల్లింపులు చేయడం ఎలా సాధ్యం అన్న ఇంగిత జ్ఞానం కూడా రామోజీరావుకు లేకుండా పోయింది. తన శిష్యుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఘోర పరాజయానికి ఇప్పటి నుంచే గురవింద రామోజీ సాకులు వెతుకుతూ రోత రాతలు అచ్చేశారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

రాజకీయాన్ని వ్యాపారం చేసింది బాబే

దేశంలో రాజకీయాలను ఫక్తు వ్యాపారంగా మార్చేసి, ఓటుకు నోటును అలవాటు చేసిన ఘనుడు 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబే. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. 1996 లోక్‌సభ ఎన్నికల నుంచి ఓటుకు నోటుకు తెరతీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోచేసిన సొమ్ముతోపాటు.. పార్టీని నమ్ముకున్న వారికి కాకుండా బ్యాంకులను కొల్లగొట్టిన ఆర్థిక నేరగాళ్లు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, వ్యాపారులు, ఎన్నారైలకు టికెట్లు ఇచ్చారు. కోట్ల కట్టలను వెదజల్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ప్రక్రియను ప్రారంభించారు. తెలంగాణ శాసనమండలి ఎన్నికల్లో ఓటుకు కోట్లు ఎరగా వేస్తూ ఆడియో, వీడియో టేపులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినా చంద్రబాబు తన తీరు మార్చుకోలేదు సరికదా మరింతగా చెలరేగిపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని దశాబ్దాలుగా నమ్ముకున్న వారిని కాదని రూ.900 కోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చిన విద్యా వ్యాపారి పొంగూరు నారాయణను నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి చంద్రబాబు బరిలోకి దించారు. రూ.వందల కోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చిన ఎన్నారైలు పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి, కాకర్ల సురేష్‌ను ఉదయగిరి నియోజకవర్గం నుంచి, వెలిగండ్ల రామును గుడివాడ నుంచి, యార్లగడ్డ వెంకట్రావును గన్నవరం నుంచి, రియల్టర్ కేశినేని చిన్నిని విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి.. కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబును కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి బరిలోకి దించారు. పార్టీ ఫండ్ రూపంలో.. అభ్యర్థుల నుంచి డిపాజిట్ల రూపంలో వసూలు చేసిన వేల కోట్ల రూపాయలను యథేచ్ఛగా వెదజల్లుతున్నారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు పెమ్మసాని, వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, బీజేపీ అభ్యర్థులు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్ వంటి వారు భారీ ఎత్తున నోట్ల కట్టలను వెదజల్లుతున్నారు. ఇతర పార్టీలకు చెందిన సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు వంటి వారిని కొనుగోలు చేస్తూ తమ వైపునకు తిప్పుకోవడానికి బాబు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న సభలకు నోట్ల కట్టలను వెదజల్లుతున్నా జనం మొహం చాటేస్తున్నారు. కోట్ల కట్టలతో చంద్రబాబు చేస్తున్న విన్యాసాలు రామోజీ కంటికి కన్పించలేదేమో!


సరి కొత్త ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం

జన బలమే గీటురాయిగా.. ప్రజాసేవే ప్రామాణికంగా.. నిబద్ధతే పరమావధిగా కింది స్థాయి కార్యకర్తలను అభ్యర్థులుగా ఎంపిక చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ప్రజాస్వామ్యానికి సరైన అర్థం చెప్పారు. శింగనమల నియోజకవర్గం నుంచి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును, మడకశిర నియోజకవర్గం నుంచి ఉపాధి కూలీ ఈర లక్కప్పను, నెల్లూరు సిటీలో విద్యా వ్యాపారి కోటీశ్వరుడు నారాయణపై సాధారణ కార్యకర్త ఖలీల్ అహ్మద్‌ను, మైలవరం నియోజకవర్గం నుంచి రైతుబిడ్డ సర్నాల తిరుపతిరావును, కోటీశ్వరులు బరిలోకి దిగే నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి న్యాయవాది గూడూరి ఉమాబాలను సీఎం వైఎస్ జగన్ బరిలోకి దించడం ద్వారా రాజకీయాల్లో సరి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో అర్హతే ప్రమాణికంగా.. ఎలాంటి వివక్షకు తావు లేకుండా.. లంచాలకు చోటులేకుండా సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి గుమ్మం వద్దే అందిస్తున్నారు. కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలను కొనసాగించి.. ఇచ్చిన మాటపై నిలబడి.. సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పారు. దీంతో సీఎం వైఎస్ జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజు రోజుకూ పెరుగుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు పోటెత్తిన జనసంద్రమే అందుకు నిదర్శనం. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు మండుటెండైనా.. అర్ధరాత్రి అయినా ఉప్పొంగుతున్న అభిమానసంద్రమే అందుకు తార్కాణం. ఓ వైపు వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభలు, నిర్వహిస్తున్న బస్సు యాత్రకు అభిమాన సంద్రం ఉప్పొంగుతుండటం.. మరో వైపు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేయడాన్ని చూస్తే రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభంజనమేనన్నది స్పష్టమవుతోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్ వంటి డజనుకుపైగా జాతీయ మీడియా సంస్థల సర్వేలూ అదే చెబుతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్న రామోజీరావు.. శిష్యుడు చంద్రబాబు ఘోర పరాజయానికి ఇప్పటి నుంచే సాకులు వెతుక్కుంటున్నారని స్పష్టమవుతోంది.

బాబుకు 'ఈడీ' వేడి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధారాలతో సహా వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెండు కేసుల మధ్య చాలా సారూప్యతలు న్నాయి. ఇప్పటికే స్కిల్ కుంభకోణంపై షెల్ కంపెనీలను విచారిస్తున్న ఈడీ ఇక చంద్రబాబును కూడా బోనెక్కించే అవకాశాలున్నాయి.



'ఆప్' చేతికి రూ.50 కోట్లు

ఢిల్లీలో మద్యం కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన నిధులను షెల్ కంపెనీల ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి మళ్లించినట్లు ఈడీ నిర్ధారించింది. 2022లో గోవా ఎన్నికల సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులకు హవాలా మార్గంలో రూ.50 కోట్లు చేరినట్లు ఆధారాలతో తేల్చింది. ఈ మేరకు గోవాలో ఆప్ వ్యవహారాలను పర్యవేక్షించిన ఓ అభ్యర్థి వాంగ్మూలం కూడా ఇవ్వడం గమనార్హం.

కేజ్రీవాలే బాధ్యత వహించాలి

మద్యం కుంభకోణంపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన ఈడీ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టులో ఈ కేసు విచారణ సందర్భంగా మంగళవారం కీలక పరిణామాలు జరిగాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 70 ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ, పార్టీ అధ్యక్షుడుగా ఉన్న కేజ్రీవాల్ దీనికి బాధ్యత వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 2(ఎఫ్) ప్రకారం రాజకీయ పార్టీ అంటే కొందరు వ్యక్తులతో కూడిన సంఘం. కంపెనీల చట్టం ప్రకారం ఓ కంపెనీ అంటే కొందరు వ్యక్తులతో కూడిన సముదాయం. రెండు వేర్వేరు చట్టాల ద్వారా నమోదైన రాజకీయ పార్టీ, కంపెనీల నిర్వచనం మాత్రం ఒకటే. కాబట్టి అక్రమ నిధులు పొందిన ఓ కంపెనీపై ఈడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లుగానే అక్రమంగా నిధులు పొందిన రాజకీయ పార్టీపై కూడా అదే విధంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయవచ్చు' అని న్యాయమూర్తి ప్రకటించారు. 'మద్యం కుంభకోణం ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ అక్రమంగా నిధులు పొందినట్టు ప్రాథమిక ఆధారాలున్నాయి. ఆ పార్టీకి జాతీయ సమన్వయకర్త (అధ్యక్షుడు)గా ఉన్న కేజ్రీవాలే అందుకు బాధ్యత వహించాలి. ఆయనపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయొచ్చు. ఆయన అరెస్ట్ సరైనదే' అని తీర్పులో పేర్కొన్నారు.

ఇక బాబుపై ఈడీ కొరడా!

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి సిట్ పూర్తి ఆధారాలను ఈడీకి అందించింది. షెల్ కంపెనీల ద్వారా హవాలా మార్గంలో నిధుల తరలింపుపై కేసు నమోదు చేసిన ఈడీ ఈ ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగిందని నిర్ధారించింది. సుమన్ బోస్ (సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ), వికాస్ ఖన్విల్కర్ (డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ), ముకుల్‌చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ కంపెనీ ప్రతినిధి), సురేశ్ గోయల్ (చార్టెడ్ అకౌంటెంట్)లను అరెస్టు చేసింది. డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌తో పాటు నలుగురిని అరెస్ట్ చేసింది. డిజైన్‌టెక్ కంపెనీకి చెందిన రూ.31.32 కోట్ల బ్యాంకు ఖాతాలు జప్తు చేసింది. కేసులో ఆ కంపెనీ ఆస్తులను జప్తు చేయడం సరైన చర్యేనని ఏపీ హైకోర్టు కూడా సమర్థించింది. తాజాగా ఢిల్లీ హైకోర్టు తీర్పు నేపథ్యంలో హవాలా మార్గంలో టీడీపీ ఖాతాల్లో చేరిన అక్రమ నిధులపై ఈడీ దృష్టి సారించాల్సి ఉంది. తాజా తీర్పు ప్రకారం రాజకీయ పార్టీ ఖాతాలో చేరే అక్రమ నిధులకు సంబంధిత పార్టీ అధ్యక్షుడే బాధ్యత వహించాలి. అంటే టీడీపీ అధ్యక్షుడుగా ఉన్న చంద్రబాబే నిందితుడన్నది సుస్పష్టం. ఈడీ అరెస్ట్ చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది. ఇదే విషయాన్ని పలువురు న్యాయ నిపుణులతోపాటు సిట్ కూడా ఈడీ దృష్టికి తీసుకెళ్లనుంది.

స్కిల్ స్కామ్‌లో టీడీపీ ఖాతాల్లోకి రూ.65.86 కోట్లు

బాధ్యత వహించాల్సింది చంద్రబాబే

చంద్రబాబు హయాంలో స్కిల్ స్కామ్‌లో కొల్లగొట్టిన నిధులు హవాలా మార్గంలో టీడీపీ ఖాతాల్లోకి చేరడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జర్మనీలోని సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ప్రాజెక్టు అంటూ నిధులు కొల్లగొట్టారు. నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేసిన రూ.371 కోట్లలో షెల్ కంపెనీల ద్వారా రూ.241 కోట్లు చంద్రబాబు బంగ్లాకు చేర్చిన అవినీతి నెట్‌వర్క్ గుట్టును సిట్ బయట పెట్టింది. అందులో రూ.65.86 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరినట్లు పక్కా ఆధారాలతో గుర్తించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నాలుగు బ్యాంకుల్లో టీడీపీ పేరిట ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ.65,86,47,510 మళ్లించారు. జూబ్లీహిల్స్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో టీడీపీకి మూడు ఖాతాలున్నాయి. వాటిల్లో వరుసగా రూ.4,81,60,587, రూ.25,31,31,352, 2,26,28,500 చొప్పున జమ చేశారు. జూబ్లీ హిల్స్‌లోని యూనియన్ బ్యాంక్ ఖాతాలో రూ.33,47,27,071 డిపాజిట్ చేశారు. 2016 నవంబరు నుంచి 2017 జనవరి మధ్యలో రూ.500, రూ.వేయి నోట్లను కట్టల రూపంలో తరలించి ఈ అక్రమ నిధులను జమ చేశారు. విస్తుపోయే విషయం ఏమిటంటే.. ఆ నిధులు తమకు ఏ ఆదాయ మార్గాల ద్వారా వచ్చాయన్నది టీడీపీ వెల్లడించకుండానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కేంద్ర ప్రభుత్వం 2016 నవంబరులో పెద్ద నోట్ల రద్దును ప్రకటించింది. ప్రజలు, సంస్థల దగ్గర ఉన్న పెద్ద నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు అనుమతించింది. ఆ సమయంలో టీడీపీ బ్యాంకు ఖాతాల్లో భారీగా నిధులను జమ చేశారు. భారీ డిపాజిట్లకు సంబంధించి ఆదాయ మార్గాలు వెల్లడించాల్సి ఉండగా టీడీపీ ఖాతాల్లోకి ఏకంగా రూ.65.86 కోట్లు జమ కావడం గమనార్హం. నోట్ల డిపాజిట్ సమయంలో 'పే–స్లిప్'లో ఆ నిధులు ఎలా వచ్చాయనే విషయాన్ని తప్పనిసరిగా పేర్కొనాలి.

ఎమ్మెల్వోలపై ఏడుపు

- గురివింద తలా తోకలేని రాతలు
- వలంటీర్ల ఫోన్లు స్వాధీనం చేసుకున్నాక వాట్సాప్ గ్రూపులు ఎలా సాధ్యం?

సాక్షి, అమరావతి: 'ఈనాడు' రోత రాతలు చూస్తుంటే ప్రభుత్వం ద్వారా ఎవరికి ప్రయోజనం చేకూరినా వారిపై ఎన్నికల సంఘం ఎడాపెడా కేసులు నమోదు చేయాల్సిందేననే ఆక్రోశం కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు కాంట్రాక్టర్ల వద్ద విధులు నిర్వహించే ఎమ్మెల్వోలపై ఏడుపుగొట్టు కథనాలను ప్రచురించింది. ఒకవైపు వలంటీర్లను ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని కాజేసే దొంగలుగా చిత్రీకరిస్తూ మరో వైపు తాయిలాలను ఎర వేయడంపై విస్మయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఈనాడు ఆరోపణ: ఎమ్మెల్వోలను వైఎస్సార్‌సీపీ స్లీపర్ సెల్స్‌లా ప్రజలపైకి వదిలారు.

వాస్తవం: వలంటీర్లు ప్రజల నుంచి ఎలాంటి వ్యక్తిగత సమాచారం సేకరించరు. ప్రభుత్వ పథకాల అమలు ప్రక్రియలో సేకరించే వివరాలను యాప్‌లో నమోదు చేయగానే నేరుగా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉండే డేటా సెంటర్‌లో నిక్షిప్తమవుతుంది. వలంటీర్ల వద్ద ఉండే మొబైల్ యాప్‌లోని సమాచారాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్వోలకు లాగిన్ అవకాశం ఉండదు.

ఈనాడు ఆరోపణ: ఎమ్మెల్వోలు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని అధికార పార్టీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు.

వాస్తవం: వలంటీర్ల నుంచి ఫోన్లు, నంబర్లను స్వాధీనం చేసుకున్నాక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయడం ఎలా సాధ్యమో ఈనాడుకే తెలియాలి.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

వృద్ధాప్యంలో స్వతంత్రంగా జీవిస్తున్నాం



నేను దివ్యాంగుడిని. నా భార్య వృద్ధురాలు. మేము ఏ పనీ చేయలేక ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడులో ఉంటూ మా పిల్లలపై ఆధారపడాల్సి వచ్చేది. గత ప్రభుత్వం మాకు ఎలాంటి ఆసరా కల్పించలేదు. జగన్ బాబు ముఖ్యమంత్రి అయ్యాక మాకు కొండంత అండగా నిలిచారు. నాకు నెలకు రూ.3 వేలు వంతున దివ్యాంగ పింఛన్ వస్తుంది. నా భార్య సమాధానానికి నెలకు వృద్ధాప్య పింఛన్ వచ్చింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున అందింది. వైఎస్సార్ ఆసరా కింద మొత్తమ్మీద రూ.80 వేలు అందింది. నా మనవడికి అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందుతున్నాయి. నా కుమారుడికి జగనన్న కాలనీలో ఇంటి స్థలం కూడా ఇచ్చారు. ప్రభుత్వం అందించిన సాయంతో మేము ఇప్పుడు ఎవరి మీద ఆధారపడకుండా హాయిగా జీవిస్తున్నాం. దానికి కారణమైన జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– మందా గంటయ్య, ముండ్లపాడు
(పులికొండ సాంబశివరావు, విలేకరి, పెనుగంచిప్రోలు)

చిరు వ్యాపారానికి సర్కారు తోడు



మాది సాధారణ కుటుంబం. మా ఆయన పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి సాయం అందకపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. అదే సమయంలో ప్రైవేట్‌గా అప్పు చేసి చిన్నపాటి దుకాణాన్ని ప్రారంభించాం. వ్యాపారం అంతంత మాత్రంగానే సాగుతుండేది. అదే సమయంలో జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. జగనన్న తోడు కింద రూ.10 వేల వడ్డీ లేని రుణం అందింది. మా ఆయన పెద్దిన సన్యాసిరావుకున్న కొద్దిపాటి భూమికి వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతి ఏటా రూ.13,500 వచ్చింది. మా అత్త పెద్దిన రమణమ్మకు వితంతు పింఛన్ వస్తోంది. నా ఇద్దరు పిల్లలు బడికి వెళ్తున్నారు. అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వంతున అందింది. మా వ్యాపారం స్థిరపడింది. మా కుటుంబానికి ఇంత మేలు చేసిన ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– పెద్దిన స్వప్న, భామిని (టంకాల మోహనరావు, విలేకరి, భామిని)

ప్రభుత్వ తోడ్పాటుతో చింతలేని జీవితం



నా భర్త కృష్ణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్ల క్రితం అనుకోకుండా చనిపోయారు. ఆ తరువాత నా బతుకు ప్రశ్నార్థకంగా మారింది. ఆ పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకుంది. ఇద్దరు కుమారులతో విశాఖ జిల్లా భీమిలి జీరుపేటలో నివసిస్తున్నాం. నా భర్త ఉన్నప్పుడు రెండు దఫాలుగా వాహనమిత్ర పథకం ద్వారా రూ.20 వేలు అందించింది. నా ఇద్దరు కుమారులు ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల వంతున అందింది. ప్రతి నెలా రూ.3 వేల వంతున వితంతు పింఛన్ వస్తోంది. ఆనందపురం మండలం బాకూరుపాలెంలో ఇంటి స్థలం ఇచ్చారు. అక్కడ ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వమే సాయం అందించింది. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అర్హులందరికీ పింఛన్లు ఇచ్చేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛన్ ఇస్తున్నారు. ఈ ప్రభుత్వం సాయంతో మేము ఇప్పుడు ఎలాంటి చింత లేకుండా జీవిస్తున్నాం.

– జీరు వెంకటలక్ష్మి, జీరుపేట
(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

చిన్నమ్మా.. ఎందు'కమ్మ'!

కమల దళంలో ఆ సామాజిక వర్గానికే ప్రాధాన్యం

- పార్టీలోనూ, సీట్లలోనూ వారికే అగ్రతాంబూలం
- సామాజిక లింకుంటే చాలు పెద్దపీటే
- పదాధికారుల్లోనూ సగానికి పైగా వారే
- ఇతర సామాజికవర్గాలకు మొండిచేయి
- రగిలిపోతున్న బీజేపీ సీనియర్లు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ కమల దళంలో కలకలం రేగుతోంది. కమలం పార్టీలో ఒక సామాజికవర్గానికే అధిక ప్రాధాన్యమిస్తున్నారంటూ ఇతర సామాజికవర్గ నేతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. పార్టీ పదవుల్లోనే కాదు.. ఇటీవల ప్రకటించిన అసెంబ్లీ, లోక్‌సభ సీట్లలోనూ వారిదే పైచేయిగా ఉందన్న అసంతృప్తి శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. తెలుగుదేశంతో చేతులు కలిపాక ఈ ప్రాధాన్యం మరింత పెరిగిందంటూ నేతలు రగిలిపోతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాపు సామాజికవర్గానికి చెందిన సోము వీర్రాజును తప్పించి వ్యూహాత్మకంగా దగ్గుబాటి పురందేశ్వరి ఆ పదవి దక్కించుకున్నారు. అప్పట్నుంచి పార్టీ పటిష్టానికి కాకుండా తమ సామాజికవర్గం బలోపేతం కావడం కోసమే ఆమె ఎక్కువగా పాటుపడుతున్నారని బీజేపీలోని ఒక బలమైన వర్గం భావిస్తోంది. వీరి వాదన ప్రకారం.. ఒకే సామాజికవర్గానికి చెందిన పార్టీ రాష్ట్ర



అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి తపన్ చౌదరి, మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, సోషల్ మీడియా ఇన్‌చార్జి కేశవ్‌కాంత్, అధికార ప్రతినిధి లంక దినకర్, మీడియా ప్యానలిస్టు వై.రామ్‌కుమార్ తదితరులు పార్టీలో కీలక పదవుల్లో ఉన్నారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర భార్యదీ ఆ సామాజికవర్గమే. రాష్ట్ర పదాధికారుల్లోనూ సగానికిపైగా పురందేశ్వరి సామాజిక వర్గం వారే ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇక త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ సామాజికవర్గానికి చెందిన వారితో పాటు వారితో సంబంధం ఉన్న వారికే సీట్లు కేటాయించడాన్ని బీజేపీ నేతలు ఉదహరిస్తున్నారు.

అసెంబ్లీ నాలుగు.. పార్లమెంటు మూడు

రాష్ట్రంలో పొత్తులోభాగంగా బీజేపీ పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇందులో మూడు స్థానాలు ఆ సామాజికవర్గానికే కేటాయించారు. రెండు సీట్లు క్షత్రియులకు, రెండు బీసీలకు, రెడ్డి, ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. వీరిలో సుజనా చౌదరి విజయవాడ వెస్ట్‌లో, కామినేని శ్రీనివాస్ కైకలూరులో, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఎన్.ఈశ్వరరావు పోటీ చేస్తున్నారు. ధర్మవరం సీటు దక్కించుకున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ సతీమణి కూడా పురందేశ్వరి సామాజిక వర్గానికి చెందిన వారే. లోక్‌సభకు పోటీ చేస్తున్న 6స్థానాల్లో ఆ సామాజిక వర్గానికి మూడు, రెడ్డి, ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. పురందేశ్వరి రాజమండ్రి నుంచి పోటీ చేస్తున్నారు. సీఎం రమేష్ అనకాపల్లి నుంచి, కొత్తపల్లి గీత అరకు నుంచి పోటీలో ఉన్నారు. సీఎం రమేష్ సతీమణి, అరకు అభ్యర్థి కొత్తపల్లి గీత భర్త కూడా పురందేశ్వరి సామాజికవర్గమే కావడం గమనార్హం. ఇలా ఈ ఎన్నికల్లో అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను ఆ కులస్తులకు గానీ, భార్యాభర్తల్లో ఎవరో ఒకరు ఆ వర్గంతో సంబంధం ఉన్న వారికే కేటాయించడం బీజేపీలో పెనుదుమారాన్ని రేపుతోంది. ఎక్కువ జనాభా కలిగిన కాపులకు, గుర్తింపు సంఖ్యలో ఉన్న బ్రాహ్మణులకు అసెంబ్లీ, లోక్‌సభ సీటు ఒక్కటీ ఇవ్వకపోవడంపై పార్టీలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బీజేపీలో బ్రాహ్మణ వర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు (విశాఖ లోక్‌సభ), కాపు సామాజిక వర్గానికి చెందిన సోము వీర్రాజు (రాజమండ్రి అసెంబ్లీ) సీట్లు ఆశించినా అవి దక్కకుండా తమ వారికే ఎక్కువ సీట్లు ఇచ్చేలా చంద్రబాబుతో కలిసి పురందేశ్వరి చక్రం తిప్పారంటూ బహిరంగంగానే చర్చ జరుగుతోంది.



బీజేపీ అభ్యర్థి శివరామకృష్ణను రోడ్డుపైనే అవమానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

కాషాయానికి 'పచ్చ' షాక్

బిక్కవోలు: టీడీపీ కండువా తీసేసి ప్రచారం చేసుకోవాలంటూ ఆ పార్టీ కార్యకర్తలు కూటమి అభ్యర్థిని నిలువరించిన ఘటన బుధవారం తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులో జరిగింది. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించారు. దీంతో అభ్యర్థిగా ములగపాటి శివరామకృష్ణంరాజు ప్రచారం చేసుకుంటున్నారు. బిక్కవోలు మెయిన్‌రోడ్డులో బుధవారం ప్రచారం నిర్వహిస్తున్న ఆయనను టీడీపీ కార్యకర్తలు నిలువరించి ప్రచారంలో తమ పార్టీ కండువా, జెండాలను వాడవద్దని గొడవ చేశారు. పొత్తు ధర్మంలో భాగంగా తనకు సహకరించాలని కోరినా ససేమిరా అని బలవంతంగా ఆయన మెడలోని కండువాని ఆయన చేతే తీయించారు. నడిరోడ్డుపై కూటమి అభ్యర్థిని టీడీపీ కార్యకర్తలు అవమానించిన తీరుపై స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సీఎంను కించపరిచేలా ఉన్నాయి

- ఈసీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ
- బాబు, పవన్ సభలకు జనం మొహం చాటేస్తున్నారు
- ఓటమి భయంతోనే వారు సీఎంపై దిగజారి మాట్లాడుతున్నారు
- టీడీపీ పాట విడుదల కాకుండా చూడాలని ఈసీని కోరాం
- ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఈమేరకు ఆయన బుధవారం వెలగపూడి సచివాలయంలో సీఈవోకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ సభలకు ప్రజలు మొహం చాటేస్తుండటంతో కూటమి అభ్యర్థుల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. బాబు, పవన్ ఓటమిని ముందుగానే గ్రహించి, భయంతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, పదేపదే ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురించి దిగజారి మాట్లాడుతున్నారని తెలిపారు. ఈసీ నోటీసులిచ్చినా బాబు తీరు మారడంలేదని, ముఖ్యమంత్రిపై అక్కసు వెళ్లగక్కడమే పనిగా మారిపోయిందని అన్నారు. టీడీపీ విడుదల చేయబోతున్న 'జరుగు జగన్.. జరుగు జగన్' పాటలోని చరణాలు పూర్తిగా ముఖ్యమంత్రిని కించపరిచేలా ఉన్నాయని, ఆ పాట విడుదల కాకుండా నిలిపివేయాలని ఈసీని కోరామని చెప్పారు. ఇప్పటికే 'సైకో పోవాలి సైకిల్ రావాలి' పాటపైనా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. టీడీపీ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారం, ఆ పార్టీ వాయిస్ మెసేజ్‌లపై ఈసీ స్పందించిన తీరు హర్షణీయమన్నారు.

యూటర్న్‌లకు బాబు బ్రాండ్ అంబాసిడర్

యూటర్న్‌లకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయారని విష్ణు చెప్పారు. ఒక్క వలంటీర్ల విషయంలోనే అనేక సార్లు యూ టర్న్‌లు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు మోదీని నోటికొచ్చినట్లు దూషించి, ఎన్నికలొసరికి బీజేపీతో జతకట్టారన్నారు. అధికారంలో ఉండగా రాష్ట్రంలోకి సీబీఐ రావడానికి వీల్లేదంటూ జీవోలు ఇచ్చిన చంద్రబాబు, అధికారం పోయేసరికి సీబీఐ కావాలన్నారని గుర్తుచేశారు. ఓసారి గవర్నర్ వ్యవస్థ కావాలంటారని, అంతలోనే వద్దంటారని చెప్పారు. బెంజి మంత్రి అంటూ గుమ్మనూరు జయరాంపై మాట్లాడి, చివరకు గుంతకల్లులో సీటు ఇచ్చారన్నారు. బాబు రాజకీయ జీవితమంతా ఇలా డబుల్ స్టాండ్‌తోనే సాగిందని, ఆయన్ని చూసి ప్రజలందరూ అసహ్యించుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబు చివరికి ఉగాది పండుగ రోజు కూడా అబద్ధాలే మాట్లాడారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక టీడీపీ మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన బాబుకు విశ్వసనీయత ఎక్కడుందని ప్రశ్నించారు. కూటమి నేతల దిగజారుడు ప్రవర్తనను ప్రజలందరూ గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారందరికీ మరోసారి గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.



ఎన్నికల ప్రధాన అధికారి మీనాకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పవన్ వ్యాఖ్యలపై ఈసీ కన్నెర్ర

- 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ముకేశ్‌కుమార్ మీనా ఆదేశం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి స్కామ్‌స్టర్, ల్యాండ్ గ్రాబర్, శాండ్ అండ్ లిక్కర్ ఎంపరర్ అంటూ ఈ నెల 7న అనకాపల్లిలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. వ్యక్తిత్వ హననం చేస్తూ.. రెచ్చగొట్టేలా ఉన్న ఈ తరహా వ్యాఖ్యలు ఎన్నికల సంఘం నియమావళిని ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా బుధవారం నోటీసులు జారీ చేశారు. పవన్‌కళ్యాణ్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టు ప్రాథమికంగా నిర్ధారించినట్టు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. గడువులోగా స్పందించి వివరణ ఇవ్వకపోతే.. ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్‌పై అనకాపల్లిలో పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ నాయకులు మలసాని మనోహర్‌రెడ్డి ఈ నెల 8న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

నేటి నుంచి తేలికపాటి వర్షాలు




సాక్షి, విశాఖపట్నం/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. బుధవారం గరిష్ఠంగా 42 డిగ్రీలకు మించలేదు. అత్యధికంగా బుధవారం తూర్పు గోదావరి జిల్లా గోకవరం, విజయనగరం జిల్లా కొత్తవలసల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో 19 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 63 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. గురువారం 11 మండలాల్లో తీవ్ర, మరో 129 మండలాల్లో వడగాడ్పులు, శుక్రవారం 13 మండలాల్లో తీవ్ర, 79 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మరోవైపు గురువారం నుంచి మూడు రోజులపాటు ఉత్తర కోస్తాలోను, శుక్రవారం నుంచి రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం నాటి బులెటిన్‌లో వెల్లడించింది. దక్షిణ కోస్తాలో మాత్రం పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి వానలతో పాటు ఉరుములు, మెరుపులు, అక్కడక్కడా పిడుగులు సంభవించవచ్చని పేర్కొంది. అదే సమయంలో రాష్ట్రంలో ఒకింత వేడి, ఉక్కపోత, అసౌకర్య వాతావరణం నెలకొంటుందని వివరించింది.

చల్లని కబురు చెప్పిన స్కైమేట్

మండే ఎండలో ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమేట్ చల్లని కబురు చెప్పింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా సాధారణ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు ప్రకటించింది. రుతుపవనాల సీజన్‌లో 102 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు ×స్కైమెట్‌¶ ఎండీ జతిన్‌సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎల్‌నినో వాతావరణ పోకడ లానినాగా మారుతోందని పేర్కొన్నారు. దీనివల్ల రుతుపవనాల కదలికలు బలపడొచ్చని, ఫలితంగా మంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు.

నన్ను ఎవరూ కంట్రోల్ చేయలేరు

- టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్



దెందులూరు: 'నన్ను పుట్టించిన తల్లిదండ్రులు, ఎమ్మెల్యేను చేసిన చంద్రబాబే నన్ను కంట్రోల్ చేయలేకపోయారు. నేను ఎవరి కంట్రోల్‌లో ఉండను. నేనెప్పుడూ మారను. నేనింతే..' అంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తేల్చిచెప్పారు. దీంతో జనసేన మహిళా నేత ఘంటసాల వెంకటలక్ష్మి బిత్తరపోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడులో బుధవారం జయహో బీసీ సమావేశం జరిగింది. ఇందులో జనసేన నియోజకవర్గ నేత ఘంటసాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. జనసేనతో టీడీపీ పొత్తు కుదుర్చుకున్నాక చింతమనేని ప్రభాకర్ ప్రవర్తనలో చాలా మార్పు వచ్చిందన్నారు. ఆయన దురుసుతనం తగ్గిందని.. గతంలో మాదిరిగా దూషించడం, కోప్పడటం చేయడం లేదని చెప్పారు. జనసేన ఆయనను కంట్రోల్ చేస్తుందని తెలిపారు. వెంటనే మైక్ తీసుకున్న చింతమనేని తనను కంట్రోల్ చేయడం తన తల్లిదండ్రులు, చంద్రబాబు వల్లే కాలేదన్నారు. ఎవరూ తనను కంట్రోల్ చేయలేరని.. తనకు నచ్చినట్టు తాను ఉంటానని అన్నారు. దీంతో జనసేన మహిళా నేత ఘంటా వెంకటలక్ష్మి షాకయ్యారు. అప్పుడే రెండు పార్టీల మధ్య పొత్తులో లుకలుకలు మొదలయ్యాయని సమావేశానికి వచ్చిన వారు చర్చించుకోవడం కనిపించింది. ఎన్నికల ముందే ఇలా ఉంటే.. తర్వాత పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని వ్యాఖ్యానించారు. మరోవైపు చింతమనేని తీరుతో టీడీపీ, జనసేన శ్రేణులు బిక్కమొహం వేశాయి.

డీకే శివకుమార్‌తో షర్మిల భేటీ



శివాజీనగర: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల బుధవారం కర్ణాటక డిప్యూటీ సీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌తో బెంగళూరులో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి కారణమేమిటనేది తెలియరాలేదు. ఏపీలో పార్టీ వ్యవహారాలు, ఎన్నికల ప్రచారం గురించి చర్చించినట్లు సమాచారం. కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేతలు ఏపీలో అభ్యర్థుల తరఫున ప్రచారానికి రావాలని ఆమె కోరినట్లు తెలిసింది. సమావేశంలో డీకే సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- పది మందితో చెప్పించగలరా?
- పచ్చ పత్రికలపై కేసు వేస్తా
- ఎన్నికల సమయంలోనూ పచ్చ పత్రికలు విషపు రాతలు రాస్తున్నాయి
- రామోజీరావు, రాధాకృష్ణకు సిగ్గు, లజ్జ లేవు
- వైఎస్ జగన్ మరోసారి సీఎం కాకుండా ఉండటమే వారికి కావాల్సింది
- ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: తనపై పచ్చ పత్రిక ఈనాడులో వచ్చిన అవినీతి ఆరోపణలను నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటానని, వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ నుంచి తప్పుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈనాడులో తనపై వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండించారు. తాను ఇచ్చిన ఖండనను తన గురించి ప్రచురించిన విధంగానే స్టేట్ పేజీలో వేయాలన్నారు. రెండు రోజులు వేచి చూస్తానని, లేకుంటే ఆర్టీసీ బస్టాండ్ వద్ద బహిరంగ వేదిక ఏర్పాటు చేస్తామని, దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని 2 లక్షల మంది ఓటర్లలో తాను అంటే ఇష్టపడని వారు లేదా టీడీపీ వారైనా 5 నుంచి 10 మంది వచ్చి తాను అవినీతికి పాల్పడ్డానంటూ ఆధారాలు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పారు. తనపై ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికలు ప్రతి ఎన్నికల సమయంలో తప్పుడు కథనాలు రాసి, ప్రజలను తప్పుదారి పట్టించే కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. నిజంగా తాను మద్యం, మట్టి, గ్రావెల్, రేషన్ బియ్యం అక్రమాలు, దేవాలయ భూముల కబ్జాకు పాల్పడుతుంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి మధ్యలో ఎందుకు రాయవని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రాస్తే ఓటర్లు కొందరైనా నమ్ముతారన్న చౌకబారు ఎత్తుగడలతోనే ఇలా చేస్తున్నారని చెప్పారు. తనకు గానీ, తన కుటుంబ సభ్యులకు గానీ అవినీతి అక్రమాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం లేదన్నారు. ఈ విషయం జగ్గయ్యపేట నియోజకవర్గం ప్రజానీకానికి తెలుసన్నారు. రామోజీరావు, రాధాకృష్ణకు సిగ్గు, లజ్జ లేవని, వైఎస్ జగన్ మరోసారి సీఎం కాకుండా ఉండటమే వారికి కావాల్సిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులపై ఇలా గుడ్డకాల్చి మీద వేసి, ఎంతో కొంత నష్టం చేయాన్నదే వారి ఉద్దేశమని అన్నారు. తనపై రెండు నెలల క్రితం ఇలాగే ఆంధ్రజ్యోతిలో అబద్ధాలతో ఓ కథనం రాశారని, తాను ఖండన ఇచ్చినప్పటికీ నేటి వరకు ప్రచురించలేదన్నారు. ఖండన వేసే ధైర్యం కూడా లేదా వాళ్లకు అని ప్రశ్నించారు. దీనిపై జ్యోతి పేపర్‌పై కోర్టులో కేసు వేశానన్నారు. ఆలయ భూముల అక్రమాలంటూ ఈనాడులో రాశారని, ఆ పత్రిక యాజమాన్యంతో కూడా మాట్లాడతానన్నారు. తాను భక్తుడినని, ఈ ప్రాంతంలో దేవాలయాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నానని, ఇది అందరికి తెలిసిందేనని చెప్పారు. ఈ సమావేశంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రో..చేవారెవరురా?

రాష్ట్రవ్యాప్తంగా కుదేలవుతోన్న కూటమి

- వరుస దెబ్బలతో తేరుకోలేకపోతున్న టీడీపీ
- రాజంపేట కూటమిలో కుంపట్లు.. పోటాపోటీగా ప్రచారం
- ఉండి టీడీపీలో అసమ్మతి ప్రకంపనలు
- తిరుగుబాటు ధోరణిలో సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు
- రఘురామకృష్ణరాజు అభ్యర్థిత్వంపై తీవ్ర మండిపాటు
- హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ పదేళ్లు ఉన్నా అభివృద్ధి చెందలేదన్న విమర్శలు

సాక్షి రాయచోటి/ఏలూరు/అనంతపురం: రాష్ట్రవ్యాప్తంగా టీడీపీకి స్వపక్షం నుంచే వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి కుదేలవుతోంది. టికెట్లు ఆశించి భంగపడిన నేతలు తిరుగు బావుటా ఎగరేస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న తమను నమ్మించి మోసం చేస్తున్నారంటూ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలోనే బాహాబాహీకి దిగుతూ ఆయన్నే ఎదురిస్తున్నారు. దీంతో ఆ పార్టీ వరుస దెబ్బలతో తేరుకోలేకపోతోంది. అన్నమయ్య జిల్లాలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకు దిగజారిపోతోంది. సీనియర్ నాయకులు పార్టీని వీడుతుండటంతో అధిష్టానంలో కలవరం మొదలైంది. టీడీపీ రాయచోటి ఇన్‌చార్జిగా ఉన్న రమేష్ కుమార్‌రెడ్డి రాజీనామా చేయడం పార్టీలో గుబులు రేపుతోంది. అంతేకాకుండా బుధవారం పల్నాడు జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో రమేష్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన వర్గం భారీగా వైఎస్సార్‌సీపీలో చేరడంతో అక్కడ వైఎస్సార్‌సీపీ తిరుగులేని రీతిలో బలపడింది. ఇటీవలే సీఎం సమక్షంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ ఇన్‌ఛార్జి గంటా నరహరి చేరారు. తంబళ్లపల్లెలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని మార్చకపోతే ఆ పార్టీని వీడేందుకు నియోజకవర్గ నేత శంకర్ యాదవ్ సిద్ధమవుతున్నారు. రాజంపేటకు సంబంధించి రాయచోటి టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ, రాజంపేట ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రైల్వేకోడూరులో జనసేనకు సీటు కేటాయించి, తర్వాత మార్చడంతో ఆయా వర్గాల నేతలు లోలోపల కత్తులు దూసుకుంటున్నారు. మదనపల్లెలో టీడీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా అక్కడ ఆ పార్టీ నేత దొమ్మలపాటి రమేష్ ప్రజాసంఘాల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో నిలిచేందుకు సిద్ధపడుతున్నారు.



ఉండిలో ఆమరణ దీక్షలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఉండిలో మూడు ముక్కలాట

పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో టీడీపీ సంకట స్థితిలో పడింది. మాజీ ఎమ్మెల్యే శివరామరాజు టికెట్ ఆశించి భంగపడి రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. టికెట్ దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. ఇప్పుడు రామరాజును కాదని ఎంపీ రఘురామకృష్ణరాజుకు టికెట్ కేటాయించారన్న సమాచారంతో ఆ నియోజకవర్గ టీడీపీలో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. రఘురామకృష్ణరాజు అభ్యర్థిత్వం అధికారికంగా ప్రకటించకపోయినా తీవ్రస్థాయిలో అసమ్మతి స్వరం వినిపిస్తోంది. అందరూ సహకరిస్తే ఇండిపెండెంట్‌గా తాను బరిలో ఉంటానని మరోవైపు రామరాజు చెబుతున్నారు. పదిహేను రోజుల నుంచి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా నరసాపురం ఎంపీ టికెట్ ఆశించి కూటమి చేతిలో భంగపడ్డ ఎంపీ రఘురామకృష్ణరాజుకు ఉండి టికెట్ హామీ రావడంతో రామరాజు వర్గం తేరుకోలేకపోతోంది. చంద్రబాబు నుంచి రఘురామకృష్ణరాజు అభ్యర్థిత్వంపై పరోక్ష సంకేతాలు ఇవ్వడంతో రామరాజు వర్గం ఐదు రోజులుగా వివిధ రకాలుగా నిరసనలు వ్యక్తం చేసి తీవ్రస్థాయిలో పార్టీపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు సాగిస్తోంది. ఈ క్రమంలో రామరాజుకు ఎలాంటి హామీ రాకపోవడంతో కంటతడి కూడా పెట్టారు. ఆయన వర్గీయులు బుధవారం నుంచి ఆమరణదీక్ష ప్రారంభించారు.

బాలకృష్ణ ఓటమి ఖాయం

హిందూపురం అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ ఈ దఫా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ వర్గాలు ఆయనకు పూర్తిగా దూరమయ్యాయి. ఆయన అందుబాటులో ఉండకపోవడం, పీఏలే ఎమ్మెల్యేలుగా చలామణి అవుతుండడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2014లో తొలిసారి హిందూపురం నుంచి పోటీచేసి గెలుపొందిన ఆయన.. తన బావ చంద్రబాబు సీఎంగా ఉన్నా నియోజకవర్గానికి పైసా పని చేయలేకపోయారు. ఈ క్రమంలో ఓటర్లు స్థానిక అభ్యర్థి వైపు మొగ్గు చూపుతున్నారు. ఏడాదికి ఒకటి రెండుసార్లు వచ్చే బాలకృష్ణ కావాలా, స్థానికంగా ఉండే ఎమ్మెల్యే కావాలా అన్న అంశంపై ఇప్పుడు హిందూపురంలో చర్చ జరుగుతోంది. గతంలో బాలకృష్ణ పీఏ బాలాజీ పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. ఇప్పటికీ ఆ కేసు నడుస్తోంది. దీంతో టీడీపీ నాయకులే కాకుండా, ప్రజలు కూడా పీఏలపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. మళ్లీ ఎన్నికల్లోస్తే తప్ప బాలకృష్ణ నియోజకవర్గానికి రారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ తరఫున టికెట్ ఆశించిన పరిపూర్ణానందస్వామి కూడా బాలకృష్ణ ఇక్కడికి ఎన్నిసార్లు వచ్చారని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా ఉంది. మొత్తంగా ఒక్క మాటలో చెప్పాలంటే ఈ సారి బాలకృష్ణ ఓటమి ఖాయం అని .. ఈ దిశగా పలువురు ఒకటికి రెండంటూ బెట్టింగులకు దిగుతున్నారు.

సాకేత్ జోడీకి చుక్కెదురు



బుసాన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత ప్లేయర్ సాకేత్ మైనేని పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. దక్షిణ కొరియాలో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సాకేత్-ప్యాట్రిక్ నిక్లాస్ సాల్మినెన్ (ఫిన్‌లాండ్) ద్వయం 5-7, 2-6తో అలెక్స్ బోల్ట్-లి టు (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓటమి పాలైంది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్ జంట తమ సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయింది.

భారత హాకీ జట్టుకు 'హ్యాట్రిక్' ఓటమి



ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. పెర్త్‌లో బుధవారం జరిగిన మూడో మ్యాచ్‌లో టీమిండియా 1-2 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (41వ ని.లో) ఏకైక గోల్ చేయగా... ఆస్ట్రేలియా జట్టుకు జెరెమి హేవార్డ్ (44వ, 49వ ని.లో) రెండు గోల్స్ అందించి గెలిపించాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 3-0తో ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్ రేపు జరుగుతుంది.

గుకేశ్‌కు రెండో విజయం

హంపి ఖాతాలో నాలుగో 'డ్రా'



గుకేశ్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఐదో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్స్ అజేయంగా నిలిచారు. ఓపెన్ విభాగంలో తమిళనాడు కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేయగా... ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి ఖాతాలో నాలుగో 'డ్రా' చేరగా... తమిళనాడు అమ్మాయి వైశాలి కూడా తన గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. గుకేశ్ 87 ఎత్తుల్లో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)ను ఓడించగా... విదిత్-కరువానా (అమెరికా) గేమ్ 30 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద-నెపోమ్‌నిషి (రష్యా) గేమ్ 44 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. హంపి-గొర్యాచ్‌కినా (రష్యా) గేమ్ 44 ఎత్తుల్లో... వైశాలి-అనా ముజిచుక్ (ఉక్రెయిన్) గేమ్ 49 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఐదో రౌండ్ తర్వాత ఓపెన్ విభాగంలో గుకేశ్ 3.5 పాయింట్లతో నెపోమ్‌నిషితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. 2.5 పాయింట్లతో ప్రజ్ఞానంద నాలుగో ర్యాంక్‌లో, 2 పాయింట్లతో విదిత్ ఆరో ర్యాంక్‌లో ఉన్నారు.

భారత్‌కు తొలి ఓటమి



చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా జోన్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. పటిష్టమైన చైనా జట్టుతో బుధవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 0-3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో సహజ యామలపల్లి 2-6, 3-6తో ప్రపంచ 43వ ర్యాంకర్ జిన్‌యు వాంగ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 0-6, 0-6తో ప్రపంచ 7వ ర్యాంకర్ క్విన్‌వెన్ జెంగ్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో రుతుజా భోస్లే-ప్రార్థన ద్వయం 1-6, 1-6తో హాన్‌యు గువో-జియు వాంగ్ జోడీ చేతిలో పరాజయం పొందడంతో భారత ఓటమి ఖరారైంది. నేడు జరిగే మూడో మ్యాచ్‌లో చైనీస్ తైపీతో భారత్ ఆడుతుంది.

రాయల్స్‌కు టైటాన్స్ షాక్

197 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది... చివర్లో 4 ఓవర్లలో 59 పరుగులు చేయాల్సిన దశలో గెలుపు అసాధ్యంగా అనిపించింది. కానీ తర్వాతి నాలుగు ఓవర్లలో వరుసగా 17, 7, 20, 17 పరుగులు సాధించిన టైటాన్స్ అనూహ్య విజయాన్ని అందుకుంది. అప్పటి వరకు నియంత్రణతో బౌలింగ్ చేసిన రాజస్తాన్ రాయల్స్ పేలవ బౌలింగ్, వ్యూహ వైఫల్యంతో చేజేతులా మ్యాచ్‌ను కోల్పోయి ఈ సీజన్‌లో తొలి ఓటమిని ఎదుర్కొంది.

- చేజేతులా ఓడిన రాజస్తాన్
- 3 వికెట్లతో గుజరాత్ గెలుపు
- రాణించిన గిల్, రషీద్ ఖాన్



రషీద్ ఖాన్

జైపూర్: వరుస విజయాలతో అజేయంగా దూసుకుపోతున్న రాజస్తాన్ రాయల్స్‌కు బ్రేక్ పడింది. బుధవారం జరిగిన పోరులో గుజరాత్ టైటాన్స్ 3 వికెట్ల తేడాతో రాయల్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (48 బంతుల్లో 76; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), సామ్సన్ (38 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (44 బంతుల్లో 72; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, సాయి సుదర్శన్ (29 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టైటాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

శతక భాగస్వామ్యం...

గత మూడు మ్యాచ్‌లలో వైఫల్యాల తర్వాత ఈసారి యశస్వి (19 బంతుల్లో 24; 5 ఫోర్లు) కాస్త మెరుగైన ప్రదర్శన కనబర్చగా, గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన బట్లర్ (8) విఫలమయ్యాడు. పవర్‌ప్లేలో రాజస్తాన్ 43 పరుగులే చేయగా... ఈ దశ నుంచి సామ్సన్, పరాగ్ భారీ భాగస్వామ్యం రాయల్స్‌ను పటిష్ట స్థితికి చేర్చింది. ఇద్దరూ వేగంగా పరుగులు సాధించారు. పరాగ్ 34 బంతుల్లో, సామ్సన్ 31 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నారు. ఎట్టకేలకు 19వ ఓవర్లో పరాగ్‌ను అవుట్ చేసి మోహిత్ ఈ జోడీని విడదీశాడు. అయితే ఉమేశ్ వేసిన చివరి ఓవర్లో సామ్సన్, హెట్‌మైర్ (13 నాటౌట్) చెరో సిక్స్ బాదడంతో మొత్తం 19 పరుగులు వచ్చాయి.

గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్...

భారీ ఛేదనలో టైటాన్స్‌కు సుదర్శన్, శుబ్‌మన్ గిల్ దూకుడైన ఆరంభాన్ని ఇవ్వలేకపోయారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించినా... అందుకు 50 బంతులు తీసుకున్నారు. రాయల్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో వీరి పరుగుల వేగాన్ని నిరోధించింది. బౌల్ట్ తొలి 2 ఓవర్లలో 8 పరుగులే ఇవ్వగా... అవేశ్ బౌలింగ్‌లో 14 పరుగులు రాబట్టడంతో టైటాన్స్ స్కోరు పవర్‌ప్లే ముగిసే సరికి 44 పరుగులకు చేరింది. అయితే కుల్దీప్ సేన్ ఒక్కసారిగా గుజరాత్‌ను దెబ్బ తీశాడు. తన బౌలింగ్‌లో 6 పరుగుల వ్యవధిలో అతను సుదర్శన్, వేడ్ (4), మనోహర్ (1)లను వెనక్కి పంపించాడు. ఈ దశలో కెప్టెన్ గిల్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. 35 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. విజయ్ శంకర్ (16) ప్రభావం చూపలేకపోగా... 28 బంతుల్లో 65 పరుగులు చేయాల్సిన స్థితిలో గిల్ వెనుదిరగడంతో టైటాన్స్ ఆశలు సన్నగిల్లాయి. అయితే కీలక సమయంలో రషీద్ ఖాన్ (11 బంతుల్లో 24 నాటౌట్; 4 ఫోర్లు), రాహుల్ తెవాటియా (11 బంతుల్లో 22; 3 ఫోర్లు) ఆట జట్టును గెలిపించింది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) వేడ్ (బి) ఉమేశ్ 24; బట్లర్ (సి) తెవాటియా (బి) రషీద్ 8; సామ్సన్ (నాటౌట్) 68; పరాగ్ (సి) శంకర్ (బి) మోహిత్ 76; హెట్‌మైర్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 196. వికెట్ల పతనం: 1-32, 2-42, 3-172. బౌలింగ్: ఉమేశ్ 4-0-47-1, జాన్సన్ 4-0-37-0, రషీద్ 4-0-18-1, నూర్ 4-0-43-0, మోహిత్ 4-0-51-1. గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సుదర్శన్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 35; గిల్ (స్టంప్డ్) సామ్సన్ (బి) చహల్ 72; వేడ్ (బి) కుల్దీప్ 4; మనోహర్ (బి) కుల్దీప్ 1; విజయ్ శంకర్ (బి) చహల్ 16; తెవాటియా (రనౌట్) 22; షారుఖ్ (ఎల్బీ) (బి) అవేశ్ 14; రషీద్ ఖాన్ (నాటౌట్) 24; నూర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 199. వికెట్ల పతనం: 1-64, 2-77, 3-79, 4-111, 5-133, 6-157, 7-195. బౌలింగ్: బౌల్ట్ 2-0-8-0, అవేశ్ 4-0-48-1, మహరాజ్ 2-0-16-0, అశ్విన్ 4-0-40-0, చహల్ 4-0-43-2, కుల్దీప్ సేన్ 4-0-41-3.

ఐపీఎల్‌లో నేడు

ముంబై X బెంగళూరు
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	5	4	1	8	0.871
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
పంజాబ్	5	2	3	4	-0.196
ముంబై	4	1	3	2	-0.704
బెంగళూరు	5	1	4	2	-0.843
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్



పీవీ సింధు



ప్రణయ్

శ్రమించి గెలిచిన సింధు, ప్రణయ్

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ పీవీ సింధు, హెచ్‌ఎస్ ప్రణయ్ మాత్రమే బరిలో మిగిలారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 64 నిమిషాల్లో 18-21, 21-14, 21-19తో ప్రపంచ 33వ ర్యాంకర్ గో జిన్ వె (మలేసియా)పై... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 90 నిమిషాల్లో 17-21, 23-21, 23-21తో ప్రపంచ 16వ ర్యాంకర్ లు గ్వాంగ్ జు (చైనా)పై గెలుపొందారు. గతంలో గ్వాంగ్ జుతో ఆడిన మూడుసార్లూ ఓడిపోయిన ప్రణయ్ నాలుగో ప్రయత్నంలో విజయాన్ని అందుకున్నాడు. తొలి గేమ్‌ను కోల్పోయిన ప్రణయ్ రెండో గేమ్‌లో, మూడో గేమ్‌లో మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని నెగ్గడం విశేషం. మహిళల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మాళవిక (భారత్) 18-21, 19-21తో సిమ్ యు జిన్ (కొరియా) చేతిలో, ఆకర్షి కశ్యప్ 10-21, 11-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ 19-21, 15-21తో టాప్ సీడ్ షి యుకీ (చైనా) చేతిలో, కిడాంబి శ్రీకాంత్ 14-21, 13-21తో రెండో సీడ్ జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో, ప్రియాన్షు 9-21, 13-21తో లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) జోడీ 2-21, 12-21తో లియు షెంగ్ షు-టాన్ నింగ్ (చైనా) జంట చేతిలో ఓటమి పాలైంది.

బోపన్న జోడీ అవుట్



మోంటెకార్లో (మొనాకో): పురుషుల టెన్నిస్ డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో టాప్ సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిముఖం పట్టింది. తొలి రౌండ్ 'బై' పొందిన బోపన్న-ఎబ్డెన్ జంట బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 3-6, 6-7 (6/8)తో మాట్ పావిచ్ (క్రొయేషియా)-మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్) జోడీ చేతిలో ఓడిపోయింది. బోపన్న-ఎబ్డెన్‌లకు 25,510 యూరోల (రూ. 22 లక్షల 82 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



తెలంగాణ జట్టుకు రజతం

స్వర్ణ పతకం గెలిచిన సరయు

సాక్షి, హైదరాబాద్: జాతీయ టీమ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో వేల్పుల సరయు, గాదె శరణ్య, ఆలపాటి సాయి మహతి, కీర్తిక, దీక్షితలతో కూడిన తెలంగాణ జట్టు 11 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఈ టోర్నీలో తెలంగాణ జట్టు ఐదు మ్యాచ్‌ల్లో నెగ్గి, ఒక మ్యాచ్‌లో ఓడి, మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. 14 పాయింట్లతో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) విజేతగా నిలిచింది. బోర్డు-2పై ఆడిన తెలంగాణ కెప్టెన్, వరంగల్ జిల్లాకు చెందిన సరయు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోవడం విశేషం. ఆరు గేమ్‌లు ఆడిన సరయు ఐదింటిలో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని 5.5 పాయింట్లతో బోర్డు-2 విజేతగా నిలిచింది.

సినిమా

చెబుతావా రత్నం



విశాల్

విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రత్నం'. హరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించారు. కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న తెలుగు, తమిళ్‌లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని శ్రీ సిరి సాయి సినిమాస్ బ్యానర్‌పై తెలుగులో సీహెచ్ సతీష్ కుమార్, కె. రాజ్‌కుమార్ విడుదల చేస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'చెబుతావా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, సింధూరి విశాల్ పాడారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'రత్నం'. 'చెబుతావా..' పాట మెలోడియస్‌గా, ఎమోషనల్‌గా సాగుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, రవితేజ

కర్చీఫ్ మడతపెట్టి...!

సంక్రాంతికి 'కుర్చీని మడతపెటి...' అంటూ 'గుంటూరు కారం'లో మహేశ్‌బాబు చేసిన సందడి ఇంకా వినబడుతోంది. పండగ వెళ్లి మూడు నెలలు కూడా కాక ముందే వచ్చే సంక్రాంతి కోసం కర్చీఫ్ మడతపెట్టి, పండగ బరిలో సీట్ రిజర్వ్ చేసుకున్నారు కొందరు స్టార్స్. అయితే సంక్రాంతి రిలీజ్ అంటూ ప్రకటనలు రావడం, చివరి నిమిషంలో కొన్ని సినిమాలు తప్పుకోవడం మామూలే. ఇక 2025 సంక్రాంతి రేసులో ఇప్పటివరకూ షురూ అయిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.

విశ్వంభర వస్తున్నాడు

సంక్రాంతికి పండక్కి చాలా హిట్స్ సాధించారు చిరంజీవి. 2023లో 'వాల్తేరు వీరయ్య'తో సంక్రాంతికి వచ్చి మరో హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు. మళ్లీ 2025లో 'విశ్వంభర' సినిమాతో సంక్రాంతి బరిలోకి దిగుతున్నారు. జనవరి 10న రిలీజ్ డేట్ కూడా ఫిక్స్ చేశారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్‌లో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారనీ టాక్. అలాగే ఈ చిత్రంలో చిరంజీవిది హనుమంతుడి భక్తుడి పాత్ర అట.

భార్య.. మాజీ ప్రేయసి.. మధ్యలో మాజీ పోలీసాఫీసర్

ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్ 'సైంధవ్' రిలీజైంది. వచ్చే సంక్రాంతికి కూడా రానున్నారు. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు వెంకటేశ్. ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతికి రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఓ మాజీ పోలీసాఫీసర్, అతని భార్య, అతని మాజీ ప్రేయసి.. ఇలా ఈ మూడు పాత్రల చుట్టూ సాగే క్రైమ్ కామెడీ మూవీ ఇది. 'ఎఫ్ 2, ఎఫ్ 3' చిత్రాల నిర్మాత 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే.. 2017లో శర్వానంద్ హీరోగా నటించిన 'శతమానం భవతి' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'శతమానం భవతి పేజీ 2' ఉందని, 2025 సంక్రాంతికి ఈ సినిమాను రిలీజ్ చేస్తామని ఆల్రెడీ 'దిల్' రాజు ప్రకటించారు. ఇప్పుడు వెంకటేశ్-అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లోని సినిమాను కూడా సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారు.

మళ్లీ బంగార్రాజు వస్తాడా?

'నా సామిరంగ' అంటూ ఈ ఏడాది సంక్రాంతికి హిట్ సాధించారు నాగార్జున. ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో 'సంక్రాంతికి కలుద్దాం' అన్నారు నాగార్జున. సో.. 2025 సంక్రాంతికి కూడా నాగార్జున ఓ సినిమాను రిలీజ్ చేయడానికి రెడీ అవుతున్నారని ఊహించవచ్చు. 2016 సంక్రాంతికి 'సోగ్గాడే చిన్ని నాయనా', 2022 సంక్రాంతికి 'బంగార్రాజు' ('సోగ్గాడే చిన్ని నాయనా'కు సీక్వెల్) సినిమాలతో హిట్స్ అందుకున్నారు నాగార్జున. సో.. 2025 సంక్రాంతికి 'బంగార్రాజు 3'ని రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందా? అనే ఆలోచనలో ఉన్నారట. మరి.. నాగార్జున ఏ సినిమాను రిలీజ్ చేస్తారు? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

లక్ష్మణ్ భేరి రెడీ

రవితేజ హీరోగా నటించిన 'ఈగల్' ఈ ఏడాది సంక్రాంతి బరిలో నిలిచి, చివరి నిమిషంలో ఇండస్ట్రీ మేలు కోసం అంటూ వాయిదా పడింది. ఈ చిత్రం ఫిబ్రవరిలో రిలీజైంది. ఈసారి పక్కాగా సంక్రాంతికి రావాలనుకుంటున్నారు రవితేజ. అందుకే తన కెరీర్‌లోని 75వ చిత్రాన్ని 2025 సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా మారుతున్నారు. ఈ సినిమాలో లక్ష్మణ్ భేరి పాత్రలో కనిపిస్తారు రవితేజ. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా సాగుతుందని టాక్. మరోవైపు 2021 సంక్రాంతికి 'క్రాక్' సినిమాతో వచ్చి రవితేజ హిట్ సాధించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

ఇంకా...

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజా సాబ్' 2025 సంక్రాంతికి వచ్చే చాన్స్ ఉందని ఇటీవల పేర్కొన్నారు ఈ చిత్రనిర్మాత టీజీ విశ్వ ప్రసాద్. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం రిలీజ్‌పై మరోసారి స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఈ ఏడాది సంక్రాంతికి తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'హనుమాన్' మంచి వసూళ్లు రాబట్టిన విషయం తెలిసిందే. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ఇకపై ప్రతి సంక్రాంతికి ఓ సినిమా వస్తుందని పేర్కొన్నారు ప్రశాంత్ వర్మ. మరి.. వచ్చే సంక్రాంతికి ప్రశాంత్ నుంచి వచ్చే సినిమాపై ఇంకా ప్రకటన రాలేదు. ఇలా సంక్రాంతి బరిలో నిలిచే చిత్రాలు మరికొన్ని ఉన్నాయని తెలిసింది.

సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో డబ్బింగ్ చిత్రాలు ఉంటుంటాయి. ఇలా అజిత్ హీరోగా నటించనున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతి విడుదలకు ఖరారైంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. అలాగే సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కూడా 2025 సంక్రాంతికి విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది. ఇంకా కన్నడ ఫిల్మ్ 'కాంతార'కు ప్రీక్వెల్‌గా రూపొందుతున్న 'కాంతార: ది లెజెండ్ చాప్టర్ 1' చిత్రం కూడా సంక్రాంతికి రిలీజ్ అవుతుందనే వార్త వచ్చిన సంగతి తెలిసిందే.

డ్యాన్స్ చేశాం - ఎంఎం కీరవాణి



కీరవాణి, ఆశిష్, వైష్ణవీ చైతన్య

''లవ్ మీ' సినిమాలో 'ఆటగదరా శివ..' అని ఓ టైటిల్ సాంగ్ రాశారు చంద్రబోస్‌గారు. ఈ సినిమాకు పని చేయడానికి మేం స్టూడియోలో డ్యాన్స్ చేశాం. చంద్రబోస్‌గారితో ఫైట్ కూడా చేశాం (నవ్వుతూ). ఈ చిత్రం విజయం సాధించాలి'' అని సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి అన్నారు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మీ'. శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ సినిమా ఆడియో విడుదల వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ- ''ఆడియో రిలీజ్ ఈవెంట్స్‌ని మర్చిపోయి చాలా రోజులైంది. 'లవ్ మీ'తో మళ్లీ ఆ సంస్కృతిని తీసుకొస్తున్నాం'' అన్నారు. ''ఆడియో లాంచ్ ఈవెంట్ చూస్తుంటే సక్సెస్ మీట్‌లా అనిపిస్తోంది'' అన్నారు అరుణ్ భీమవరపు. ''మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు ఆశిష్. ఈ కార్యక్రమంలో వైష్ణవీ చైతన్య, హన్షిత, శిరీష్, హర్షిత్ రెడ్డి, నాగ మల్లిడి, కెమెరామేన్ పీసీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నవ్వు... భయం



తమన్నా

తమన్నా, సుందర్ సి, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాక్'. సుందర్ సి. దర్శకత్వం వహించారు. ఖుష్బూ సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం తమిళ్, తెలుగులో ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ చిత్రం తెలుగు రిలీజ్ హక్కులను సొంతం చేసుకున్న ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భారీగా విడుదలను ప్లాన్ చేస్తున్నారు. కాగా ఈ చిత్రంలో శివానీ పాత్రలో తమన్నా, శివ శంకర్‌గా సుందర్ సి. నటించారు. వారి పాత్రలను పరిచయం చేస్తూ లుక్స్ రిలీజ్ చేశారు. ''హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బాక్'' అన్నారు మేకర్స్.

ఈ చిత్రకథ గొప్పగా ఉంది - సుకుమార్



విరాట్, గణేశ్, సుకుమార్

''జగడం' సినిమా ద్వారా గణేశ్‌ని కొరియోగ్రాఫర్‌గా పరిచయం చేశాను. ఇప్పుడు 'గాడ్ సాబ్'తో తను దర్శకుడిగా మారడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రకథ గొప్పగా ఉంది'' అన్నారు డైరెక్టర్ సుకుమార్. దివంగత నటుడు రెబల్‌స్టార్ కృష్ణంరాజు బంధువు విరాట్ రాజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'గాడ్ సాబ్'. కొరియోగ్రాఫర్ గణేశ్ దర్శకత్వంలో మల్లీశ్వరి సమర్పణలో రాజు, కల్వకోట వెంకటరమణ, కాటారి సాయికృష్ణ కార్తీక్ నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ఆరంభమైంది. 'గాడ్ సాబ్' లోగోను సుకుమార్ లాంచ్ చేశారు. తొలి సీన్‌కి నృత్య దర్శకులు యాని, భాను, జానీ కెమెరా స్విచ్చాన్ చేయగా, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ క్లాప్ కొట్టారు. ''మా విరాట్ లాంచ్ కావడం హ్యాపీగా ఉంది'' అన్నారు కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి. ''ఇది నా కెరీర్‌లో ఉత్తమ చిత్రంగా నిలిచిపోతుంది'' అన్నారు విరాట్ రాజ్. ''లవ్ స్టోరీతో ఈ చిత్రం తెరకెక్కుతోంది'' అన్నారు గణేశ్. ''మంచి యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ'' అన్నారు నిర్మాతలు.

డైరెక్టర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహిస్తాం - దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్



దివంగత దర్శకుడు దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని మే 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. దాసరి జయంతి అయిన మే 4న 'డైరెక్టర్స్ డే'గా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ సెలబ్రేట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ మాట్లాడుతూ- ''దాసరి నారాయణరావుగారి జయంతిని ఈ ఏడాది మే 4న ఎల్బీ స్టేడియంలో ఘనంగా నిర్వహించబోతున్నాం. ఈ ఈవెంట్ ద్వారా ఫండ్ రైజ్ చేసి డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం, మిడ్ డే మీల్స్, అసోసియేషన్‌కు కొత్త బిల్డింగ్ నిర్మాణం, వయసు పైబడిన దర్శకులకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు చేయాలనుకుంటున్నాం. ఈ కార్యక్రమాల కల్చరల్ కమిటీలో డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, శివ నిర్వాణ, నందినీ రెడ్డి, అనుదీప్ కేవీ, విజయ్ కనకమేడల ఉంటారు'' అన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
11-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	354	75,038
నిఫ్టీ ▲	111	22,754

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,111	▽ 197
డోజోన్స్	38,327	▽ 557
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,961	▲ 26
డాక్స్	18,097	▲ 21
షాంఘై	3,027	▽ 21
నికాయ్	39,565	▽ 194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,823
బంగారం (99.5 స్వచ్ఛత)	71,535
వెండి (కేజీ)	82,343

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.82	83.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.37	106.92
€	యూరో	ఎస్‌బీఐ	89.25	91.63
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.31	55.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.26	56.18
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.55	64.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.29	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.76	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

75,000 @ రూ. 400 లక్షల కోట్లు

మార్కెట్ల సరికొత్త రికార్డ్స్

- 75,000 దాటి నిలిచిన సెన్సెక్స్
- 354 పాయింట్లు హైజంప్
- 22,754కు నిఫ్టీ– 111 పాయింట్లు ప్లస్
- రూ. 400 లక్షల కోట్లకు మార్కెట్ విలువ

ఒక్క రోజు గ్యాప్‌లో దేశీ స్టాక్ మార్కెట్లు మరోసారి దుమ్మురేపాయి. ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ తొలిసారి 75,000 పాయింట్లపైన నిలవగా.. నిఫ్టీ 22,754 వద్ద ముగిసింది. వెరసి బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ మళ్లీ రూ. 400 లక్షల కోట్లను అధిగమించింది. తాజా ట్రేడింగ్‌లో చిన్న షేర్లకు సైతం కొనుగోళ్ల మద్దతు లభించింది.

సెన్సెక్స్ జోరిలా


పాయింట్లు	తేదీ
1,000	1990 జూలై
5,000	1999 అక్టోబర్
10,000	2006 ఫిబ్రవరి
20,000	2007 డిసెంబర్
30,000	2017 ఏప్రిల్
50,000	2021 ఫిబ్రవరి
65,000	2023 జూలై
70,000	2023 డిసెంబర్



రంజాన్ సందర్భంగా నేడు(గురువారం) స్టాక్, మనీ మార్కెట్లకు సెలవు. తిరిగి శుక్రవారం యథావిధిగా పనిచేస్తాయి.



అమెరికాలో ద్రవ్యోల్బణం మరోసారి కట్టుతప్పడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆలోచనకు చెక్‌పడే వీలుంది. దీంతో యూఎస్ మార్కెట్లు 1.3 శాతం డీలాపడి ట్రేడవుతున్నాయి.



ముంబై: ఇన్వెస్టర్లు అన్ని రంగాలలోనూ పెట్టుబడులకు ఆసక్తి చూపడంతో దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారంలో రెండోసారి సరికొత్త రికార్డులను సాధించాయి. సెన్సెక్స్ 354 పాయింట్లు జంప్ చేసి మార్కెట్ చరిత్రలో తొలిసారి 75,038 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 111 పాయింట్ల వృద్ధితో కొత్త గరిష్టం 22,754 వద్ద ముగిసింది. ఇంట్రాడేలోనూ సెన్సెక్స్ 75,105 వద్ద, నిఫ్టీ 22,776 వద్ద చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. ఈ ప్రభావంతో బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ సైతం 1–0.5 శాతం మధ్య బలపడ్డాయి. ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల ఉమ్మడి మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)కు రూ. 2,27,025 కోట్లు జమయ్యింది. మొత్తం విలువ రూ. 402 లక్షల కోట్ల(4.83 ట్రిలియన్ డాలర్లు) ఎగువకు చేరింది.

మూడోరోజూ మెరిసిన పసిడి, వెండి

పసిడి, వెండి ధరలు న్యూఢిల్లీలో వరుసగా మూడవ రోజు బుధవారం కూడా రికార్డుల ర్యాలీ చేశాయి. పసిడి పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర ఒక దశలో లైఫ్‌టైమ్ హై రూ.72,000 తాకింది. అటు తర్వాత క్రితం ముగింపుతో పోల్చితే రూ.200 లాభంతో రికార్డు స్థాయి రూ.71,840 వద్ద ముగిసింది. వెండి కూడా కేజీకి రూ.200 ఎగసి రూ.84,700 వద్ద ముగిసింది. పసిడి ధర గడచిన మూడు రోజుల్లో రూ.690 పెరగ్గా, వెండి ధర ఇదే కాలంలో రూ.1,500 పెరిగింది. కాగా, అంతర్జాతీయ బులిష్ ధోరణులు ఈ రెండు మెటల్స్ తాజా పెరుగుదలకు కారణంకాగా, బుధవారం వెలువడిన అమెరికాలో తీవ్ర ద్రవ్యోల్బణం గణాంకాలు, వడ్డీరేట్లు తగ్గకపోవచ్చని భయాలతో బంగారం, వెండి తక్షణ ర్యాలీకి బ్రేక్ పడవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. అంతర్జాతీయంగా, జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లు క్రితం ముగింపుతో పోల్చితే మైనస్‌లో ట్రేడవుతుండడం ఇక్కడ గమనార్హం.

ఫార్మా మినహా..

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మీడియా, ప్రభుత్వ బ్యాంక్స్, చమురు, ఎఫ్‌ఎంసీజీ, మెటల్ 1.5 శాతంస్థాయిలో పుంజుకోగా.. ఫార్మా 0.3 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో కోల్ ఇండియా, బీపీసీఎల్, ఐటీసీ, కొటక్ బ్యాంక్, హిండాల్కో, ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, అదానీ ఎంటర్, ఏషియన్ పెయింట్స్, ఓఎన్‌జీసీ, ఐషర్, టెక్‌ఎం, ఆర్‌ఐఎల్ 3.6–1% మధ్య లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, మారుతీ, టీవీఎస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2–1% మధ్య క్షీణించాయి. బీఎస్‌ఈలో మొత్తం ట్రేడైన షేర్లలో 1,904 లాభపడితే.. 1,939 బలహీనపడ్డాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 2,778 కోట్లు, దేశీ ఫండ్స్ సైతం రూ. 163 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

నకిలీ వీడియోలతో తస్మాత్ జాగ్రత్త!

ఎన్‌ఎస్‌ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ స్టాక్ రికమండేషన్లు ఇస్తున్నట్లు అవాస్తవ(డీప్‌ఫేక్) వీడియోల సృష్టి జరిగినట్లు స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజం తాజాగా పేర్కొంది. ఆధునిక సాంకేతికతను తప్పుడు మార్గంలో వినియోగించడం ద్వారా ఎన్‌ఎస్‌ఈ లోగో సహా.. ఆశిష్‌కుమార్ ముఖం లేదా గొంతుతో షేర్ల సిఫారసులు చేస్తున్న ఫేక్ వీడియోలను నమ్మొద్దని హెచ్చరించింది.

మైక్రోసాఫ్ట్‌తో టెక్ మహీంద్రా జట్టు



న్యూఢిల్లీ: బిజినెస్, డేటా నిపుణులకు సులభతరంగా ఉండే మైక్రోసాఫ్ట్ ఫ్యాబ్రిక్ ఆధారిత వర్క్‌బెంచ్‌ను రూపొందించేందుకు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపినట్లు టెక్ మహీంద్రా వెల్లడించింది. మైక్రోసాఫ్ట్ ఫ్యాబ్రిక్ వినియోగాన్ని మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు వర్క్‌బెంచ్ సిస్టమ్ ఉపయోగపడగలదని, సంక్లిష్టమైన డేటా వర్క్‌ఫ్లోను సరళతరమైన ఇంటర్‌ఫేస్‌తో సులభంగా రూపొందించవచ్చని టెక్ మహీంద్రా వివరించింది. వ్యాపారాల వృద్ధిలో తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మైక్రోసాఫ్ట్‌తో భాగస్వామ్యం తోడ్పడగలదని పేర్కొంది.

స్విఫ్ట్ కారు కాస్త ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తాజాగా హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ ధరను రూ.25,000 వరకు పెంచింది. గ్రాండ్ విటారా సిగ్మా వేరియంట్ ధర రూ.19,000 అధికం అయింది. దీంతో ఎక్స్‌షోరూంలో స్విఫ్ట్ ధర రూ.5.99 లక్షల నుంచి రూ.8.89 లక్షల వరకు ఉంది. గ్రాండ్ విటారా సిగ్మా ధర రూ.10.8 లక్షలకు చేరింది. సవరించిన ధరలు ఏప్రిల్ 10 నుంచి అమలులోకి వచ్చినట్టు మారుతీ సుజుకీ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-4-2024 ఫామ్ ధర...

విశాఖ	405–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	390–00
విజయవాడ	390–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375–00
వరంగల్	377–00
రిటైల్ ధర	4.35

భారత పర్యటనకు ఎలాన్ మస్క్

ఈ నెలలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యేందుకు అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ ఈ నెలలో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో తమ కంపెనీ పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మస్క్ పర్యటన ఏప్రిల్ నాలుగో వారంలో ఉండొచ్చని, ఆయనతో పాటు కంపెనీ అధికారులు కూడా రావొచ్చని పేర్కొన్నాయి. దేశీయంగా తయారీని ప్రోత్సహించే క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని కేంద్రం ఇటీవల సవరించిన నేపథ్యంలో మస్క్ రాక ప్రాధాన్యం సంతరించుకుంది. దీని ప్రకారం భారత్‌లో కనీసం 500 మిలియన్ డాలర్లతో తయారీ ప్లాంటును పెట్టే విదేశీ కంపెనీలు తక్కువ సుంకాలతో ఎలక్ట్రిక్ కార్లను దిగుమతి చేసుకునేందుకు వెసులుబాటు లభిస్తుంది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో తయారైన కారును (సీబీయూ) దిగుమతి చేసుకుంటే 70 శాతం నుంచి 100 శాతం వరకు కస్టమ్స్ సుంకాలు వర్తిస్తున్నాయి. భారత మార్కెట్లో ప్రవేశించేందుకు టెస్లా వంటి కంపెనీలకు ఇది అవరోధంగా ఉంటోంది. దీంతో సుంకాలను తగ్గించాలంటూ కొన్నాళ్లుగా కేంద్రాన్ని కోరుతున్నాయి. దానికి అనుగుణంగా దేశీయంగా తయారీతో ముడిపెట్టి పాలసీని ప్రభుత్వం సవరించింది. గతేడాది మోదీ అమెరికాలో పర్యటించిన సందర్భంగా ఆయనతో మస్క్ సమావేశమయ్యారు. భారత మార్కెట్లో టెస్లా ఎంట్రీకి సంబంధించి 2024లో తాను వచ్చే అవకాశమున్నట్లు అప్పట్లో ఆయన చెప్పారు.

వన్‌ప్లస్ విక్రయాలు నిలిపేస్తున్నాం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయినందుకు వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్స్, ట్యాబ్లెట్స్, వేరబుల్స్ విక్రయాలను మే 1 నుంచి నిలిపివేస్తున్నట్టు సౌత్ ఇండియన్ ఆర్గనైజ్డ్ రిటైలర్స్ అసోసియేషన్ (ఓఆర్‌ఏ) నిర్ణయించింది. అతి తక్కువ మార్జిన్స్, వారంటీ క్లెయిమ్స్ ఆలస్యం కావడం, బలవంతంగా కొన్ని ఉత్పత్తులను రిటైలర్లపై రుద్దడం వంటి సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అసోసియేషన్ వెల్లడించింది. ఆన్‌లైన్‌కు అనుకూలంగా వన్‌ప్లస్ వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు వన్‌ప్లస్ టెక్నాలజీ ఇండియా సేల్స్ డైరెక్టర్ రంజీత్ సింగ్‌కు ఓఆర్‌ఏ లేఖ రాసింది. పూర్విక, బిగ్–సి, సంగీత, హ్యాపీ, బీ–న్యూ, సెలెక్ట్, సెల్ పాయింట్ వంటి 23 ప్రముఖ మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్స్ ఓఆర్‌ఏ సభ్యులుగా ఉన్నాయి. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లో సుమారు 4,500 స్టోర్లతో కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

అనిల్ అంబానీ అదృష్టం తారుమారు

గ్రూప్ సంస్థకు అనుకూలంగా ఉన్న రూ.8,000 కోట్ల ఆర్బిట్రేషన్ అవార్డు కొట్టివేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత సంపన్నులకు సంబంధించి 2008లో వెలువడిన జాబితాలో ఆరవస్థానంలో నిలిచిన అనిల్ అంబానీకి వరుస ఎదురు దెబ్బలు కొనసాగుతున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ సంస్థల్లో ఒకటైన– ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు(డీఏఎంఈపీఎల్) అనుకూలంగా గతంలో వచ్చిన ఆర్బిట్రేషన్ అవార్డును సుప్రీంకోర్టు తాజాగా కొట్టేసింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ– డీఏఎంఈపీఎల్ అలాగే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) మధ్య కుదిరిన ''రాయితీ ఒప్పందం'' విషయంలో తలెత్తిన ఒక వివాదానికి సంబంధించి రూ.8,000 కోట్ల అవార్డుతో ఆయన కష్టాలు కొంత గట్టెక్కుతాయన్న అంచనాలను తాజా పరిణామం దెబ్బతీసింది. ఆర్బిట్రేషన్ అనుగుణంగా గతంలో డీఎంఆర్‌సీ చెల్లించిన రూ.3,300 కోట్లను వాపసు చేయాలని సుప్రీం డీఏఎంఈపీఎల్‌ని ఆదేశించింది. అయితే తీర్పు వల్ల తనకు వచ్చిన ఇబ్బందేమీ లేదని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేర్కొంది. అటు డీఎంఆర్‌సీ నుంచి కానీ ఇటు గ్రూప్ సంస్థ డీఏఎంఈపీఎల్ నుంచి తనకు ఎటువంటి డబ్బూ అందలేదని వివరించింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

3712 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ నోటిఫికేషన్ విడుదల

కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కంబైన్డ్ హయ్యర్ సెకండరీ(10+2) లెవెల్ ఎగ్జామినేషన్– 2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో మొత్తం 3712 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3712
» **పోస్టుల వివరాలు:** లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో), డేటా ఎంట్రీ ఆపరేటర్ (గ్రేడ్ ఏ).
» **అర్హతలు:** 10+2/ఇంటర్మీడియెట్ తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. 01.08.2024 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈఓ), డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 18–27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10–15ఏళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ రూ.19,900–63,200; డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో) రూ.29,200–92,300; డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ రూ.25,500–81,100 వేతన శ్రేణి లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** టైర్1, టైర్ 2 పరీక్షల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 07.05.2024
» **దరఖాస్తుల సవరణ తేదీలు:** 10.05.2024 నుంచి 11.05.2024
» **టైర్ 1 పరీక్ష తేదీలు:** జూలై 1–12 తేదీల్లో.
» **టైర్ 2 పరీక్ష తేదీలు:** తర్వాత వెల్లడిస్తారు.
» **వెబ్‌సైట్:** https://ssc.gov.in

ఐజీఆర్‌యూఏ, అమేథీలో సీపీఎల్ ప్రోగ్రామ్

అమేథీ(యూపీ)లోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ(ఐజీఆర్‌యూఏ)..సెప్టెంబర్ 2024 సెషన్ కమర్షియల్ పైలట్ లైసెన్స్(సీపీఎల్) ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 125.
» **కోర్సు వ్యవధి:** 24 నెలలు.
» **అర్హత:** కనీసం 45శాతం మార్కులతో 10+2(ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు కనీసం 158సెం.మీ.ఎత్తు ఉండాలి.
» **వయసు:** 17 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, పైవా/ఇంటర్వ్యూ, ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.05.2024
» **అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ ప్రారంభం:**24.05.2024
» **ఆన్‌లైన్ రాతపరీక్ష తేది:** 03.06.2024.
» **ఇంటర్వ్యూ/వైవా ప్రారంభం:** 16.07.2024.
» **వెబ్‌సైట్:** https://igrua.gov.in

ఎస్‌పీఏవీ, విజయవాడలో పీహెచ్‌డీ ప్రవేశాలు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టోరల్ ప్రోగ్రామ్స్(పార్ట్ టైమ్/ఫుల్ టైమ్)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **డాక్టోరల్ ప్రోగ్రామ్స్:** పీహెచ్‌డీ ఇన్ ప్లానింగ్, పీహెచ్‌డీ ఇన్ ఆర్కిటెక్చర్, పీహెచ్‌డీ ఇన్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ, సర్వే నెం.4/4, ఐటీఐ రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.05.2024.
» **దరఖాస్తుల షార్ట్‌లిస్ట్ తేది:** 10.05.2024.
» **పరీక్ష–ఇంటర్వ్యూ తేది:** 21.05.2024, 22.05.2024.
» **వెబ్‌సైట్:** https://www.spav.ac.in

ఐసీఎస్ఐ, న్యూఢిల్లీలో 30 సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన సీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **అర్హత:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్‌లో మెంబర్ అయి ఉండాలి. పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.04.2024 నాటికి 31 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 60,000.
» **పనిచేయాల్సిన ప్రదేశం:** సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్, కార్పొరేషన్ భవన్, ఐఐసీఏ, మనేసర్, గుడ్‌గావ్(హర్యానా).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.04.2024
» **వెబ్‌సైట్:** https://www.icsi.edu

ఆలస్యమే.. అవకాశం!

» ఎన్నికలతో వాయిదాపడిన సివిల్స్ ప్రిలిమ్స్
» మే 26కు బదులు జూన్ 16న నిర్వహణ
» అవకాశంగా మలచుకోవాలంటున్న నిపుణులు
» 1,056 పోస్టులకు సివిల్స్ ప్రిలిమ్స్–2024 పరీక్ష
» ఆరు లక్షల మంది హాజరయ్యే అవకాశం

సివిల్స్ ప్రిలిమ్స్-2024.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా 21 కేంద్ర సర్వీసుల్లో అభ్యర్థుల ఎంపికకు తొలిదశ పరీక్ష! మే నెల 26వ తేదీన జరగాల్సిన సివిల్స్ ప్రిలిమ్స్.. దేశంలో లోక్‌సభ ఎన్నికల కారణంగా జూన్ 16కు వాయిదా పడింది. పరీక్ష వాయిదాను ఆలస్యంగా భావించకుండా.. అందివచ్చిన అవకాశంగా మలచుకోవాలన్నది నిపుణుల సూచన! ఈ నేపథ్యంలో.. సివిల్స్ అభ్యర్థులు మారిన ప్రిలిమ్స్ పరీక్ష తేదీకి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించడంపై ప్రత్యేక కథనం..



పోటీ పరీక్షలకు సీరియస్‌గా ప్రిపరేషన్ సాగించేవారు.. అవి వాయిదా పడితే నిరాశకు గురవడం సహజం. ముఖ్యంగా దాదాపు ఏడాదిన్నర పాటు ఎంపిక ప్రక్రియ సాగే సివిల్స్ విషయంలో ఈ ధోరణి కొంత ఎక్కువగానే ఉంటుంది. జూన్‌లో జరుగనున్న ప్రిలిమ్స్‌కు దాదాపు ఆరు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా మెయిన్స్‌కు ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్య 13 వేల వరకూ ఉంటుంది. ఇలాంటి వడపోత పరీక్షలో నెగ్గడం అంత తేలికకాదు. కాబట్టి పరీక్ష వాయిదాతో అదనంగా లభించిన సమయంలో తమ ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టుకుని విజయావకాశాలను మెరుగుపరచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

అదనంగా 20 రోజులు

వాస్తవానికి మే 26న సివిల్స్ ప్రిలిమ్స్ జరగాల్సి ఉంది. కానీ లోక్‌సభ ఎన్నికల కారణంగా రీ–షెడ్యూల్ చేసి జూన్ 16న నిర్వహించనున్నారు. అంటే.. ప్రిలిమ్స్ అభ్యర్థులకు అదనంగా లభించిన సమయం 20 రోజులు. మొత్తంగా చూస్తే ఇప్పటి నుంచి 65 రోజుల సమయం అందుబాటులో ఉంది. ఆయా సబ్జెక్ట్‌లపై మరింత పట్టు సాధించేందుకు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు టైం మేనేజ్‌మెంట్‌ను తప్పనిసరిగా పాటించాలి. జనరల్ స్టడీస్ పేపర్ సిలబస్‌లో పేర్కొన్న ఏడు విభాగాలకు సంబంధించిన సిలబస్‌ను పరిశీలించి.. ప్రతి సబ్జెక్ట్‌ను ప్రతి రోజూ చదివేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ప్రతిరోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించాలి. దీంతో పాటు ప్రతి వారం సెల్ఫ్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా ఉపకరిస్తుంది.

కరెంట్ అఫైర్స్‌తో సమ్మిళితం

ప్రస్తుతం అభ్యర్థులు ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశం.. కరెంట్ అఫైర్స్. తాజా పరిణామాలను చదవడమే కాకుండా.. సిలబస్‌లో పేర్కొన్న కోర్ టాపిక్స్‌ను సమ్మిళితం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఆయా అంశాల నేపథ్యం, ప్రభావం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అంచనా వంటి వాటిని విశ్లేషించుకుంటూ చదవాలి. ఇటీవల కాలంలో ప్రిలిమ్స్‌లో అడుగుతున్న ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ సమ్మిళితంగా ఉంటున్నాయి.

ప్రాధాన్య అంశాల గుర్తింపు

అభ్యర్థులు సబ్జెక్ట్‌ల వారీగా ముఖ్యాంశాలను గుర్తించి.. వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి.. ఆయా సబ్జెక్ట్‌ల నుంచి అడుగుతున్న ప్రశ్నల సంఖ్య.. ఏఏ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందో గుర్తించాలి. ఉదాహరణకు చరిత్రనే పరిగణనలోకి తీసుకుంటే..ఆర్ట్ అండ్ కల్చర్, స్వాతంత్ర్యోద్యమం ముఖ్యమైనవిగా పేర్కొనొచ్చు. ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌లో గత ఏడాది కాలంలో సంభవించిన ముఖ్యమైన పరిణామాలపై దృష్టి సారించాలి. వార్తల్లో నిలిచిన ప్రాంతాలు, వ్యక్తులు, సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి.

రివిజన్.. రివిజన్

ప్రస్తుతం అభ్యర్థులు తమకు అందుబాటులో ఉన్న సమయంలో ప్రతి సబ్జెక్ట్‌ను కనీసం రెండుసార్లు పునశ్చరణ చేసుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌ల సిలబస్‌ను మే మొదటి వారానికి పూర్తి చేసుకునే విధంగా సమయ పాలన సిద్ధం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల రెండుసార్లు రివిజన్ చేసేందుకు సమయం లభిస్తుంది. రివిజన్ చేసేందుకు ఉపకరించే విధంగా ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి.

కొత్త అంశాలు వద్దు

ప్రస్తుత సమయంలో ఇప్పటికే చదివిన అంశాలపై మరింత పట్టు లభించేలా కృషి చేయడం మేలు. ఇప్పుడు కొత్త టాపిక్స్ చదవడం మొదలుపెడితే.. అనవసరపు ఆందోళనకు గురవడం, ఇది ఇతర అంశాల ప్రిపరేషన్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త అంశాలను చదవాలనుకుంటే.. వాటికి సంబంధించి సినాప్సిస్, కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి.

సెల్ఫ్ మెమొరీ టిప్స్

ప్రిపరేషన్ సాగించే సమయంలో అభ్యర్థులు మెమొరీ టిప్స్ అనుసరించాలి. ఇది పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబర్చడానికి దోహదం చేస్తుంది. పాయింటర్స్, ఫ్లో చార్ట్స్, విజువలైజేషన్ టెక్నిక్స్, నుమానిక్స్ వంటి వాటిని అనుసరించాలి. ముఖ్యమైన సంవత్సరాలు, గణాంకాలను గుర్తుంచుకునేందుకు వాటిని వ్యక్తిగతంగా అన్వయించుకోవచ్చు. ఆయా అంశాలను విభిన్న కోణాల్లో విశ్లేషించగలిగే విధంగా అభ్యసిస్తే పరీక్షలో ప్రతిభ చూపొచ్చు.

గత ప్రశ్న పత్రాల సాధన

ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. గత ప్రశ్న పత్రాల సాధన. పరీక్షకు నెల రోజుల ముందు నుంచి ప్రతి రోజు ఒక ప్రీవియస్ పేపర్ ప్రాక్టీస్ చేసేలా సమయం కేటాయించుకోవాలి. దీనిద్వారా తమ బలాలు, బలహీనతలపై అవగాహన ఏర్పడుతుంది.

సబ్జెక్ట్‌ల వారీగా ముఖ్యంశాలపై పట్టు

- చరిత్రలో.. ప్రాచీన చరిత్రలో సింధూ నాగరికత, బౌద్ధ, జైన మతాలు; మౌర్యులు, గుప్తులు, విజయనగర సామ్రాజ్యం, ఢిల్లీ సుల్తానులు, మొఘలులు, ఆధునిక భారత చరిత్ర, జాతీయోద్యమం, ప్రాచీన, మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ–సామాజిక–ఆర్థిక చరిత్ర; ఆధునిక చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన–పరిపాలన విధానాలు; బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు –ఉద్యమాలు (ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం), సంస్కరణోద్యమాలపై దృష్టి సారించాలి.
- పాలిటీలో.. రాజ్యాంగం, రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ, పీఠిక, ఇప్పటివరకు జరిగిన ముఖ్య రాజ్యాంగ సవరణలు–వాటికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు, రాజకీయ వ్యవస్థ, పార్లమెంటరీ వ్యవస్థ, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల సంఘం, ఫైనాన్స్ కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్, వాటికి సంబంధించి రాజ్యాంగ ప్రకరణలు చదవాలి. అదే విధంగా.. పంచాయతీరాజ్ వ్యవస్థ–బల్వంత్‌రాయ్ మెహతా, అశోక్‌మెహతా,హన్మంతరావ్,జి.వి.కె.రావ్, సింఘ్వీ కమిటీల సిఫార్సులు,73వ రాజ్యాంగ సవరణ చట్టాలపై అవగాహన పొందాలి. అదేవిధంగా కేంద్ర–రాష్ట్ర సంబంధాలు; గత కొద్ది రోజులుగా చర్చనీయాంశంగా మారిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఎకానమీలో.. ఆర్థికాభివృద్ధిలో సహజ వనరులు–మూలధన వనరుల పాత్ర; ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి (వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం); ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలో ఆర్థిక–సాంఘికాభివృద్ధి; పారిశ్రామిక తీర్మానాలు–వ్యవసాయ విధానం; బ్యాంకింగ్ రంగం–సంస్కరణలు వంటి వాటిపై పట్టు సాధించాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీలో.. గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు, గగన్‌యాన్, చంద్రయాన్, ఆదిత్య ఎల్–1 వంటి ప్రయోగాలు; వ్యాధులు–కారకాలు; సైబర్ సెక్యూరిటీ యాక్ట్; రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు; ముఖ్యమైన వన్యమృగ సంరక్షణ కేంద్రాలు; పర్యావరణ పరిరక్షణ ఒప్పందాలు, చర్యలపై అవగాహన పెంచుకోవాలి.
- జాగ్రఫీలో.. సౌర వ్యవస్థ, భూమి అంతర్ నిర్మాణం, శిలలు, జియలాజికల్ టైం స్కేల్, రుతుపవనాలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, ఉష్ణోగ్రత విలోమం, భూకంపాలు, సునామీలు; మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ; రుతుపవనాలు, ఎల్‌నినో, బయో డైవర్సిటీ, పర్యావరణ సమస్యలు తదితరాలపై దృష్టిపెట్టాలి.

త్వరలో విశాఖకు ఫ్లిప్‌కార్ట్

- గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- 1000 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు

సాక్షి, విశాఖపట్నం: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ వైపు దిగ్గజ సంస్థలు అడుగులు వేస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ తన కార్యకలాపాల్ని విశాఖలో విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విశాఖలో గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ స్పష్టం చేసింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా.. వినియోగదారులకు సేవల్ని మరింత వేగవంతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. 24 గంటల్లోనే ఆర్డర్ చేసిన సరుకుల్ని డెలివరీ చేసే విధంగా.. ఈ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపింది. 77,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రాబోతున్న జీఎఫ్‌సీ ద్వారా 1000 మంది స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నామనీ.. చిరు వ్యాపారులు, ఎంఎస్ఎంఈలు, స్థానిక వ్యవసాయ సంఘాలకు చేయూతనందించనున్నామని ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. స్థానిక ఉత్పత్తులకు కూడా బ్రాండింగ్ కల్పించేందుకు ఫ్లిప్‌కార్ట్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

రంగోత్సవ్ విజేత ఆరాధ్య

సాక్షి, హైదరాబాద్: రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో తెలుగమ్మాయి ఆరాధ్యకృతి కొల్లాజ్ మేకింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఏడేళ్ల ఆరాధ్యకృతి.. నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డి పాలెం మండలం, కాశయకాగల్లులోని నెల్లూరు చంద్రారెడ్డి హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. ముంబై కేంద్రంగా కార్యక లాపాలు నిర్వహిస్తున్న 'రంగోత్సవ్ సెలబ్రేషన్-ఏన్ ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంపిటీషన్స్' సంస్థ సెలబ్రేషన్ ఆఫ్ కలర్స్ అంశంగా పాఠశాల విద్యార్థులకు కలరింగ్, హ్యాండ్ రైటింగ్, కొల్లాజ్ మేకింగ్, కార్టూన్, గ్రీటింగ్ కార్డ్, టాటూ మేకింగ్, ఫింగర్ అండ్ థంబ్ పెయింటింగ్, స్కెచింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించింది. జాతీయస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన ఆరాధ్య కృతి.. అంతర్జాతీయ పోటీల్లో కొల్లాజ్ మేకింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకుంది.

టికెట్ రద్దయితే.. రైల్వేకు పండగే!

- టికెట్ క్యాన్సిలేషన్ ద్వారా రూ.కోట్లు ఆర్జిస్తున్న రైల్వే శాఖ
- రూ.60 నుంచి రూ.240 వరకూ రైల్వే ఖాతాలోకి
- 2022–23లో టికెట్ క్యాన్సిలేషన్ ద్వారా రూ.2,109 కోట్లు ఆదాయం

2023-24లో ప్రయాణికుల నుంచి రూ.1,762 కోట్లు



సాక్షి, విశాఖపట్నం: దూర ప్రయాణాలకు వెళ్లాలంటే అందరికీ గుర్తొచ్చేది రైలే. మూడు నెలల ముందే టికెట్ తీసుకుంటే గానీ బెర్త్ దొరకని పరిస్థితి. ఒక్కోసారి టికెట్ కన్ఫర్మ్ కాదు. చివరి నిమిషంలోనైనా బెర్త్ దొరకదా.. కనీసం ఆర్ఏసీ అయినా అవ్వదా అనే ఆశతో ప్రయాణికులు ఉంటారు. చివరి వరకు టికెట్ కన్ఫర్మ్ కాకపోతే క్యాన్సిల్ చేస్తుంటాం. కొన్నిసార్లు.. అత్యవసరంగా టికెట్ రద్దు చేసుకుంటుంటాం. రద్దు చేసుకున్నప్పుడు కొంతమేర డబ్బులకు కోత విధించి.. రైల్వే శాఖ రీఫండ్ చేస్తుంటుంది. క్యాన్సిలేషన్ రుసుం కింద కోత విధించిన సొమ్ము రైల్వే ఖాతాలోకి జమ అవుతుంది.

ఏటా సగటున రూ.2 వేల కోట్లు: వెయిటింగ్ లిస్ట్‌లో రూ.240 టికెట్ బుక్ చేసుకుని క్యాన్సిల్ చేసుకుంటే.. కేవలం రూ.180 మాత్రమే రీఫండ్ వస్తుంది. అంటే.. రైల్వే సేవలేవీ వినియోగించుకోకుండానే ఆ శాఖకు సర్వీస్ చార్జ్‌ని ప్రయాణికులు చెల్లిస్తున్నట్లే. ఇలా టికెట్ క్యాన్సిలేషన్ ద్వారా రూ.కోట్లలో ఆదాయాన్ని ఆర్జిస్తోంది రైల్వే మంత్రిత్వ శాఖ. 2022–23 సంవత్సరంలో టికెట్ క్యాన్సిలేషన్, క్లర్కేజ్ చార్జీల ద్వారా రూ.2,109.74 కోట్ల ఆదాయం వచ్చిందని రైల్వే బోర్డు వెల్లడించింది. అదేవిధంగా 2023 ఏప్రిల్ 2023 డిసెంబర్ వరకూ రూ.1,762.62 కోట్లు జమ అయింది. అంటే గతేడాదితో పోలిస్తే.. 2023–24లోనూ పూర్తి లెక్కలు తేలాక రూ.2,200 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన టికెట్ క్యాన్సిలేషన్స్ ద్వారా రైల్వే శాఖకు ఏటా సగటున రూ.2 వేల కోట్ల వరకూ ఆదాయం లభిస్తోంది.

రూ.60 నుంచి రూ.240 వరకూ కట్

ప్రయాణ తరగతి ఆధారంగా టికెట్ రద్దు రుసుంలు మారుతూ ఉంటాయి. రెండో తరగతి టికెట్ క్యాన్సిలేషన్‌కు రూ.60 నుంచి మొదలై.. ఏసీ ఫస్ట్ క్లాస్ లేదా ఎగ్జిక్యూటివ్ క్లాస్‌కు రూ.240 వరకు చార్జీలు ఉంటాయి. సెకండ్ ఏసీకి అయితే రూ.200, థర్డ్ ఏసీ, ఏసీ చైర్ కార్ అయితే రూ.180 వసూలు చేస్తారు. స్లీపర్ క్లాస్‌కు రూ.120 వరకూ రుసుం కింద రైల్వే శాఖ కట్ చేసుకుంటుంది. ట్రైన్ బయలుదేరడానికి నాలుగు గంటలలోపు టికెట్లను రద్దు చేస్తే క్యాన్సిలేషన్ చార్జి 50 శాతం ఉంటుంది. ఒక వేళ ట్రైన్ బయలుదేరడానికి 72 గంటలలోపు, అంటే మూడు రోజుల ముందే టికెట్లను రద్దు చేస్తే క్యాన్సిలేషన్ చార్జీలు ఉండవు. వారికి పూర్తి రీఫండ్ లభిస్తుంది.

వేసవికి ప్రత్యేక రైళ్లు..

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడప నున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ ఓ ప్రకటలో తెలిపారు. హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు(07165) ఈ నెల 16, 23, 30 తేదీల్లో అంటే ప్రతి మంగళవారం హైదరాబాద్ నుంచి కటక్ వరకు, తిరుగు ప్రయాణంలో ఈ రైలు(07166) ఈ నెల 17, 24, మే 1 తేదీల్లో అంటే ప్రతి బుధవారం కటక్ నుంచి హైదరాబాద్ మధ్య నడవనున్నాయి. సికింద్రాబాద్-సత్రగచ్చి ప్రత్యేక రైలు(07223) ఈ నెల 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం సికింద్రాబాద్ నుంచి సత్రగచ్చి మధ్య, సత్రగచ్చి-సికింద్రాబాద్ మధ్య నడిచే రైలు(07224) ఈ నెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం, సికింద్రాబాద్-షాలిమార్ మధ్య నడిచే రైలు(07225) ఈ నెల 15 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం, షాలిమార్ నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే రైలు(07226) ఈ నెల 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం నడవనున్నాయి. సికింద్రాబాద్-కొల్లం(07193) ఈ నెల 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26 తేదీల్లో ప్రతి బుధవారం సాయంత్రం 6.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 11.25 గంటలకు కొల్లం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(07194) ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో అంటే ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు కొల్లంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఆయనకు తిక్క... రాజకీయంగా తప్పిన లెక్క

- నిలకడ లేని నాయకుడు... నిలవలేకపోతున్న అనుచరులు
- పార్టీలో ఇమడలేక బయటకు క్యూ కడుతున్న నేతలు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో జనసేన నుంచి భారీగా వలసలు
- పార్టీపై నమ్మకం కోల్పోతున్న అటు కాపు, ఇటు బీసీ నేతలు
- ప్రచారంపైనా నిబద్ధత లేక తలలు పట్టుకుంటున్న కేడర్
- పూటకో మాటతో తల్లడిల్లుతున్న పవన్ అనుచర వర్గం
- ఓ పూట పిఠాపురం... మరోపూట హైదరాబాద్ పయనం
- ఇదీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యవహారం


హైదరాబాద్ ప్రయాణంలో పవన్‌కళ్యాణ్


ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంపీ వంగా గీత

సాక్షి ప్రతినిధి, విజయవాడ/సాక్షిప్రతినిధి, కాకినాడ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అనుసరిస్తున్న విధానాలు కేడర్‌ను అయోమయంలో పడేస్తున్నాయి. పొత్తుల పేరుతో టికెట్లు కోల్పోయిన నేతలు కార్యకలాపాలకు దూరమవుతూ... కొందరు పార్టీని వీడి బయటకు వెళ్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆ పార్టీ చాలావరకూ ఖాళీ అయింది. విజయవాడ నగర పార్టీ అధ్యక్షుడు పోతిన మహేశ్ మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతోపాటు విజయవాడ పట్టణ ఉపాధ్యక్షుడు వెన్న శివశంకర్, పశ్చిమ డివిజన్ అధ్యక్షుడు షేక్ అమీర్‌బాషా, పి.శ్రీనివాసరావు, ఎస్.రాముగుప్తా, పిల్లా వంశీకృష్ణ, సోమి గోవిందరావు, ఎం.హనుమాన్, సయ్యద్ మొబీనా, జెల్లి రమేష్ తదితరులు ఉన్నారు. ఇప్పటికే కైకలూరు టికెట్ ఆశించి భంగపడ్డ బీసీనేత బి.వి.రావు పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గతంలో విజయవాడ తూర్పు నియోజక వర్గంలో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన బత్తిన రాము, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రచార కమిటీ, కార్యక్రమాల సమన్వయ కర్త యడవల్లి సతీష్ పార్టీని వీడి ఇప్పటికే వైఎస్సార్‌సీపీలో చేరారు. అవనిగడ్డ నియోజక వర్గంలోనూ వలసలు ఎక్కువయ్యాయి.

బెజవాడలో జనసేనకు కోలుకోలేని దెబ్బ

విజయవాడ వెస్ట్ నియోజక వర్గంలో బలమైన బీసీ నేతగా జనాల్లో గుర్తింపు తెచ్చుకున్న పోతిన మహేశ్ పార్టీని వీడటంతో కూటమికి కోలుకోని దెబ్బ తగిలింది. తొలుత ఈ స్థానాన్ని మైనారిటీలకు ఇస్తామని టీడీపీ అధినేత ప్రకటించారు. అంతకుముందే జనసేన తరఫున పోతినకు టిక్కెటిస్తామని పవన్‌కళ్యాణ్ చెప్పారు. తీరా పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించి తనకు అత్యంత సన్నిహితుడైన సుజనా చౌదరికి టికెట్ దక్కేలా పావులు కదిపారు. దీంతో నియోజక వర్గంలో మైనార్టీలు, బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డలో సైతం టీడీపీ అభ్యర్థికి జనసేన టికెట్ కేటాయించడాన్ని అక్కడి సైనికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పిఠాపురంపైనా సన్నగిల్లుతున్న ఆశలు

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆయన వ్యవహార శైలివల్ల పిఠాపురంలోనూ ఆశలు సన్నగిల్లుతున్నాయని సొంత పార్టీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ మొక్కుబడి పర్యటనలు, గాలిలో చక్కర్లు కొడుతుంటే ప్రజలు ఎలా నమ్ముతారని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన పక్షం రోజుల వరకూ పవన్‌కళ్యాణ్ అక్కడ అడుగు పెట్టలేదు. గత నెల 30న వచ్చిన ఆయన నాలుగు రోజుల పాటు నియోజకవర్గంలో ఉంటారని షెడ్యూల్ ప్రకటించారు. తొలి రోజు ఆలస్యంగా వచ్చి గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బహిరంగ సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి ఆ రోజు రాత్రి పిఠాపురంలో బస చేశారు. మరునాడు పిఠాపురంలో ఆలయాల దర్శనాలతో సరిపెట్టారు. మార్చి 31వ తేదీ సాయంత్రమే హైదరాబాద్ వెళ్లి పోయారు. ఈ నెల ఒకటిన తిరిగొచ్చిన ఆయన నాయకులతో సమావేశాలు నిర్వహించి తిరిగి హైదరాబాద్ చెక్కేశారు. మళ్లీ రెండో తేదీన కొత్తపల్లి మండలంలో పర్యటించి సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ వెళ్లి పోయారు.

పర్యటనల్లో ప్లానింగ్ కరువు

ప్రచార పర్యటనల్లో ప్లానింగ్ లోపించడంతో భద్రత కల్పించే పోలీసులకు తలనొప్పిగా మారింది. ఎటువంటి అనుమతి లేకుండానే కొత్తపల్లిలో మహిళలతో సమావేశం ఏర్పాటు చేయగా, చివర్లో అధికారులు దానిని రద్దు చేయాల్సి వచ్చింది. కొత్తపల్లి మండలంలో ప్రచారంలో పవన్ ఎక్కడా పట్టుమని పది నిమిషాలు కూడా ఆగకుండా సుడిగాలి పర్యటన చేశారు. దానివల్లే ఆయనకు జ్వరం రావడంతోఓ ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళ్లిపోయారు. మళ్లీ మంగళవారం ఉగాది పంచాగ శ్రవణంలో పాల్గొని గొల్లప్రోలు మండలం చేబ్రోలులో అద్దె ఇంటిలో గృహప్రవేశం చేశారు. ఆ రోజు కూడా కేవలం ముచ్చటగా మూడు గంటలు మాత్రమే ఉండి తిరిగి ప్రజలను కలవకుండానే వెళ్లిపోయారు.

గీతపై గెలుపు అంత ఈజీ కాదు..

పవన్‌కళ్యాణ్ ఎన్నికలు ప్రారంభంలోనే పట్టుమని పది రోజులు కూడా ప్రచారం చేయకుండా హైదరాబాద్-పిఠాపురం మధ్య గాలిలో చక్కర్లు కొడుతుంటే... నిత్యం ప్రజల్లోనే ఉండే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగాగీతను ఎలా ఎదుర్కోగలరని పార్టీ శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి. గీత నియోజకవర్గంలో ప్రతీ పల్లె చుట్టేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వివిధ పదవుల్లో కొనసాగిన ఆమె ప్రతి పల్లెలోనూ పది మందిని పేరు పెట్టి పిలవగలిగేంత పరిచయాలు పెంచుకున్నారు. ఏ సమస్య వచ్చినా ఫోన్ చేస్తే పలుకుతారనే నమ్మకాన్ని ఆమె సంపాదించుకున్నారు. అటువంటి చరిష్మా కలిగిన మహిళా ప్రజాప్రతినిధిని ఎదుర్కోవడం పవన్‌కు అంత సులువు కాదంటున్నారు.

జనసేన ఓ నటుల సంఘం: పోతిన మహేశ్

'నటుడు ఎప్పటికీ రాజకీయ నాయకుడు కాలేడు. ఇచ్చిన మాట మీద నిలబడలేడు. జనసేన రాజకీయ పార్టీ కాదు. అది కేవలం నటుల సంఘం మాత్రమే' అని ఆపార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన పోతిన మహేశ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇన్నాళ్లు తెలీక ఆ పార్టీలో నిబద్ధతతో పని చేశానని, ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పెత్తందార్లు, పెట్టుబడి దారుల వైపు నిలబడి, నిబద్ధతతో పని చేసిన వారికి రాజకీయ ఉరితాడు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుడంటే నమ్మకం, విశ్వాసం, భవిష్యత్తుకు భరోసా ఇచ్చే వాడై ఉండాలని పవన్‌కళ్యాణ్‌లో ఈ లక్షణాలేమీ లేవన్నారు. ఈ రాష్ట్రంలో సంక్షేమ రథసారథి సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరానని, సీఎం జగన్ నేతృత్వంలో తన రాజకీయ భవిష్యత్తు అద్భుతంగా ఉండబోతుందని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి సుజనా చౌదరిని ఓడించడమే తన ముందున్న లక్ష్యమన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



దుర్గమ్మకు విశేష పుష్పార్చన
వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గమ్మకు బుధవారం గులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. పుష్పార్చన అనంతరం పంచహారతుల సేవ జరిగింది. -IIలో



చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు
ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద అధికారులు బుధవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సెబ్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి తనిఖీల్లో పాల్గొన్నారు. -IIలో



స్ట్రాంగ్ రూమ్ పరిశీలన
నందిగామ: స్థానిక కేవీఆర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను ఏసీపీ రవికిరణ్ బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తుపై ఇన్‌స్పెక్టర్ హనీఫ్‌తో చర్చించారు.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. విజయవాడ శాంతినగర్‌కు చెందిన కొత్తమాసు వంశీధర్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.


ఉత్తమ బహుమతికి రెండు నవలలు ఎంపిక
విజయవాడ కల్చరల్: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో సిరికోన - జొన్నలగడ్డ రాంభట్ల సరోజనమ్మ స్మారక నవలా రచన పోటీకి వచ్చిన వాటి నుంచి రెండింటిని ఉత్తమ నవలలుగా ఎంపిక చేశామని సిరికోన సాహితీ అకాడమీ బాధ్యుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు చిత్రకళకు జీవం పోసిన మహానటుల్లో ఒకరైన నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఈ పోటీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. కళానుభవం, పాత్రల చిత్రీకరణ, నవలా శిల్పం అంశాలను పరిగణలోకి తీసుకొని రెండు నవలలను ఎంపిక చేశామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ పాణ్యం దత్తశర్మ రచించిన 'శ్రీమద్రమా రమణ', హ్యూస్టన్ నగరానికి చెందిన కోసూరి ఉమా భారతి రచించిన 'హృదయగానం : నేడే విడుదల' నవలలను ఎంపిక చేశామని వివరించారు. మంధా భానుమతి రచించిన 'కచ్ఛపి నాదం' నవలను ప్రత్యేక బహుమతికి ఎంపిక చేశామని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారిగా శివప్రసాద్ యాదవ్



విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారిగా ఎస్.వి.శివప్రసాద్‌యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నందిగామ ఏపీడీగా పనిచేస్తున్న శివప్రసాద్‌ను డీపీఓ(ఎఫ్ఏసీ)గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు విజయవాడ రూరల్ ఈఓపీఆర్డీ బి.ఎల్.వి.శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.టి.వి.రమణ, జిల్లా నాయకులు గంటా రామ్మోహనరావు, రాజేంద్ర ప్రసాద్, ప్రకాష్‌నాథ్, గంటా మస్తాన్‌రావు, మురళీమోహన్‌రావు, చెన్న కేశవులు, డీపీఓ ఆఫీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి
జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక



చిలకలపూడి(మచిలీపట్నం): కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో మచిలీపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయవాదులు లోక్ అదాలత్‌ను వినియోగించి కక్షిదారులకు సత్వర పరిష్కారం అందించేలా చూడాలన్నారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంతో ప్రాచీనమైన మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాను ఎన్నికవడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కొత్త కోర్టుల ఏర్పాటు ప్రతిపాదనలపై హైకోర్టు, ప్రభుత్వాధికారులతో సంప్రదిస్తానని, ప్రతి సభ్యుడికీ అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ఎస్.సాయిబాబు మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి విలువలు కాపాడుతూ బార్ అసోసియేషన్ ఉన్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు నూతన అధ్యక్ష, కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.

అమ్మచేతి కమ్మని గోరుముద్ద

- ఇంటి భోజనం కన్నా మిన్నగా జగనన్న గోరుముద్ద
- ఈ పథకం కింద ఎన్టీఆర్ జిల్లాలో నెలకు రూ.1.8 కోట్ల ఖర్చు
- ఐదేళ్లలో రూ.90 కోట్లకు పైగా వెచ్చించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

జి.కొండూరు: అమ్మచేతి గోరుముద్ద కమ్మదనం అమృతం లాంటిదని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయితే అదే స్థాయిలో కమ్మనైన గోరుముద్దను పేద విద్యార్థులకు అందించినప్పుడే వారు సంపూర్ణ ఆరోగ్యంతో విద్యపై దృష్టి సారించగలరని వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. జగనన్న గోరుముద్ద పేరుతో ఊహించని స్థాయి మెనూతో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టింది.

కార్పొరేట్ స్థాయిలో..

పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూను సైతం కార్పొరేట్ హాస్టళ్లకు దీటుగా తీర్చిదిద్దింది. ప్రతి రోజూ రకరకాల ఆహార పదార్థాలతో మెనూను తయారు చేయడంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా రాగి మాల్ట్‌ను సైతం విద్యార్థులకు అందిస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం అంటే 50 శాతం మంది విద్యార్థులు కూడా ఆసక్తి చూపని పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో తీసుకొచ్చిన మార్పుల వల్లన 90 శాతానికి పైగా విద్యార్థులు పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.



చెవుటూరు జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఎన్టీఆర్ జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

కేటగిరి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య	మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	621	32,480	27,054	25,381
ప్రాథమికోన్నత	132	11,006	9,188	9,069
ఉన్నత	163	54,974	42,323	34,901
మొత్తం	916	98,460	78,565	69,351

జిల్లాలో రూ.90 కోట్లకు పైగా ఖర్చు

జగనన్న గోరుముద్ద పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో ఎన్టీఆర్ జిల్లాలో రూ.90 కోట్లకు పైగా ఖర్చు చేసింది. కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద ఇస్తున్న నిధులతో ఒకటి నుంచి 8వ తరగతి వరకు పరిమితమైన మెనూతోనే మధ్యాహ్న భోజనం అందించే వీలుంటుంది. అయితే ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న ప్రతి విద్యార్థికీ మధ్యాహ్న భోజనం అందించాలనే లక్ష్యంతో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి మెనూతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరు ముద్ద పథకాన్ని అమలు చేస్తోంది.

జగనన్న గోరుముద్ద కింద ప్రస్తుతం విద్యార్థులకు వడ్డిస్తున్న మెనూ వివరాలు

వారం	మెనూ
సోమవారం	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు/వెజ్ పలావ్ విత్ ఎగ్ కర్రీ, చిక్కి
మంగళవారం	నిమ్మకాయ పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి మాల్ట్
బుధవారం	వెజిటబుల్ రైస్, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డు, రాగిమాల్ట్
గురువారం	సాంబారు బాత్/ లెమన్‌రైస్ విత్ టమాటా చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి మాల్ట్
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, రాగిమాల్ట్
శనివారం	ఆకుకూర అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి మాల్ట్



భోజనం రుచి బాగుంది



నేను పాఠశాలలో రోజూ మధ్యాహ్న భోజనం చేస్తున్నాను. జగనన్న గోరు ముద్ద పథకం కింద అందిస్తున్న భోజనం రుచి చాలా బాగుంటోంది. రోజుకొక రకం వంటకాలను వడ్డిస్తున్నారు. రాగి మాల్ట్ కూడా ఇస్తున్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా తిన్నంత అన్నం పెడుతున్నారు. భోజనం క్వాలిటీ కూడా చాలా బాగుంది.

– బిందు మాధవి,

మెనూ ప్రకారం భోజనం



మా పాఠశాలలో ఏ రోజు మెనూ ప్రకారం ఆ రోజు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. క్వాలిటీ చాలా బాగుంటోంది. ప్రతి రోజూ మెనూ మార్చి రుచికరమైన వంటకాలను అందిస్తున్నారు. మా పాఠశాలలో విద్యార్థులందరం మధ్యాహ్న భోజనం చేస్తున్నాం. ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకోవడంలేదు.

– అజయ్ వెంకట భవాని, విద్యార్థిని, చెవుటూరు జెడ్పీ హైస్కూలు

పీఓ, ఏపీఓలకు నాణ్యమైన శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి పాత్ర చాలా కీలకమని, వారికి నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని ఆర్వో, ఏఆర్వో, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ల (ఏఎల్‌టీ)ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆర్వో, ఏఆర్వో, ఏఎల్‌టీలకు బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బందికి షెడ్యూల్ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 13, 14న పీఓలు, ఏపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పీఓలు, ఏపీఓల్లో ఆత్మస్థైర్యం నింపేలా ఏఎల్‌టీలు శిక్షణ ఇవ్వాలని సూచించారు. డిస్పాచ్ సెంటర్, పోలింగ్ మెటీరియల్, పోలింగ్ పార్టీలు, రూట్లు, సెక్టార్లు, పీఓ డైరీ, పీఓ రిపోర్టులు, ఫొటోఎలక్టోరల్ రోల్, పీబీ మార్కింగ్, పోలింగ్ స్టేషన్ లేఅవుట్, పోలింగ్ ప్రక్రియ, క్లోజ్ బటన్ ప్రాధాన్యం, రిసెప్షన్ సెంటర్.. ఇలా ప్రతి అంశంపైనా ఓ క్రమపద్ధతిలో ప్రాక్టికల్ అప్రోచ్‌తో శిక్షణ ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేశారు. పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యేందుకు అవకాశం ఉంది.. వాటిని ఎలా పరిష్కరించాలనే దానిపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. పీఓలు నిర్వహించాల్సిన రిజిస్టర్లు, ఫారాలు తదితరాలపై వివరించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల విషయంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టతనివ్వాలన్నారు. మొత్తం మీద కచ్చితమైన ప్రణాళికతో పోలింగ్ నిర్వహణకు సిద్ధమయ్యేలా పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీఓలు బి.హెచ్.భవానీ శంకర్, కె.మాధవి, ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్వో జి.వెంకటేశ్వర్లు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

నేడు ఈద్ ఉల్ ఫితర్

- చంద్ర దర్శనంతో ముగిసిన రంజాన్ నెల
- గురువారం ఈద్ నమాజ్ చేయనున్న ముస్లింలు
- పండుగ నమాజ్ కోసం ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ధన, ఆరోగ్యాలపై బీమా జకాత్.. ఫిత్రా రూ.130గా ఖరారు

సాక్షి, మచిలీపట్నం: పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. శవ్వాల్ నెల ప్రారంభ సూచికగా బుధవారం సాయంత్రం చంద్రదర్శనంతో ముస్లింలు ఈద్ నమాజ్‌కు సిద్ధమయ్యారు. గురువారం ఈద్ ఉల్ ఫితర్ పండుగ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నెల రోజులు కఠోర రోజాలు, నమాజ్, సహెర్, ఇఫ్తార్, ఖురాన్ పఠనం, ధాన ధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపారు. ఎండ 38 డిగ్రీలు దాటినా దీక్షలు సడలించకుండా పాటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అంటే 14 గంటలకుపైగా చుక్క మంచినీరు కూడా తాగకుండా నిష్ఠతో దీక్షలు పాటించారు. చివరకు చంద్రదర్శనంతో పండుగ చేసుకోనున్నారు.

ఈద్ నమాజ్‌కు సిద్ధం

ఈదుల్ ఫితర్ నమాజ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈద్గాహ్‌లతో పాటు మసీదుల్లో సౌకర్యాలు కల్పించారు. పండగ రోజు ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ఈదుల్ ఫితర్ నమాజ్ చేస్తారు. నెల రోజుల తమ ప్రార్థనలు ఫలించాలని, సర్వమానవాళి సంతోషంగా ఉండాలని కోరుతూ అల్లాహ్‌తో దువా చేస్తారు. మచిలీపట్నం, విజయవాడతో పాటు పట్టణాల్లోని ఈద్గాలు, మసీదుల్లోనూ ఈద్ నమాజ్ నిర్వహిస్తారు.



ప్రార్థనలకు సిద్ధమైన విజయవాడ ఏలూరు రోడ్డులో మసీదు

2.50 శాతం జకాత్

రంజాన్‌లో దాన ధర్మాలకు అధిక ప్రాధాన్యత ఉంది. ధనికులే కాదు.. పేదలు సైతం పండుగ చేయాలన్నదే ఈ మాసం ముఖ్య నిర్వచనం. మనిషి ఆరోగ్యం, తాను సంపాదించిన ధనంపై అల్లాహ్ సూచించిన బీమాయే జకాత్, ఫిత్రా దానాలు. 52.5 గ్రాముల వెండి లేదా 75 గ్రాముల బంగారం లేదా అంతకు మించి విలువైన ధన/ఆస్తులు కలిగితే జకాత్‌కు అర్హుడు. వాటి వెల లెక్కకట్టి 2.5 శాతం పేదలకు పంచాలి. ఇది రంజాన్‌లో ఇస్తే 70 శాతం అధికంగా పుణ్యం లభిస్తుంది.

రూ.130గా ఫిత్రా

సాధారణ ముస్లిం రంజాన్ సందర్భంగా 1,750 గ్రాముల గోధుమలు, లేక సమానమైన డబ్బు పేదలకు దానం చేయడమే ఫిత్రా. రంజాన్‌లో ఏర్పడిన లోపాలను సరిచేసుకునేందుకు ఫిత్రా చెల్లిస్తారని మతపెద్దలు చెబుతారు. పేదరికంతో పండగకు నోచుకోని అభాగ్యులకు ఫిత్రా దానం ఇవ్వాలి. సద్ఖా-ఏ-ఫిత్రాతో ఆరోగ్య బీమాను అల్లాహ్ కల్పిస్తారంటారు. ఈ ఏడాది మచిలీపట్నం మత పెద్దలు రూ.130 ఫిత్రా ఇవ్వాలని ఖరారు చేశారు. దీని కంటే ఎక్కువ ఇవ్వవచ్చు కానీ తగ్గించరాదు. పండుగ నమాజ్‌కు ముందే ఫిత్రా చెల్లిస్తే పేదలు సైతం పండుగ చేసుకునే వీలుంటుంది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి పేరుతో ఫిత్రా రూ.130 దానం చేయాలి.



లబ్బీపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ఈద్ నమాజ్‌లోపే ఫిత్రా



రంజాన్‌లో ఎంతో ఎంతో నిష్ఠతో ఉపవాసాలు పాటిస్తారు. అయితే ఎవైనా పొరపాట్లు, కొదువ ఉంటే.. వీటి కోసం ఫిత్రా చెల్లించాలని మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం సూచించారు. ఈద్ నమాజ్‌లోపే పేదలకు ఇవ్వాలి. లేకపోతే అల్లాహ్ ఉపవాసాలను అంగీకరించరు. పేదలు సైతం పండుగ చేసుకునేలా దాన ధర్మాలు చేయాలి.

– ముఫ్తి రఫీక్ ఆలం, ఖతీబ్ ఓ ఇమామ్, జామా మసీదు, మచిలీపట్నం

సద్గుణాలు అలవాటు చేసుకోవాలి



రంజాన్‌లో ఎంతో భక్తి శ్రద్ధలతో గడుపుతాం. నిష్ఠతో ఉపవాస దీక్షలు పాటిస్తాం. నమాజ్, జకాత్, ఫిత్ర, సద్ఖా దానధర్మాలు చేసి అల్లాహ్ మెప్పు పొందే ప్రయత్నం చేస్తాం. పండగ తరువాత కూడా ఇదే స్ఫూర్తితో జీవించేందుకు సద్గుణాలను అలవాటు చేసుకోవాలి.

– ఎండీ సద్రుద్దీన్ ఖురేషి, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి

అందుబాటులో 10 వేల టన్నుల గిడ్డంగులు



నూతనంగా నిర్మించిన గోదాములు

గన్నవరం: రైతులు ఆరుగాలం శ్రమించిన పంటలకు అధిక ధరలు వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం భారీ గోదాములను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్థానిక ఏఎంసీ ఆవరణలో రూ.11.98 కోట్లతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ పది వేల టన్నుల సామర్థ్యంతో రెండు అతిపెద్ద గోదాములను నిర్మించింది. వీటికి అనుసంధానంగా 60 టన్నుల సామర్థ్యంతో వేబ్రిడ్జిని ఏర్పాటు చేసింది. ఈ గోదాముల్లో నిల్వ చేసే ఆహార, వాణిజ్య పంట ఉత్పత్తులను నాణ్యతగా ఉంచే కెమికల్ ట్రీట్‌మెంట్‌ను, శిక్షణ పొందిన సిబ్బందిని కేటాయించారు. ఇక్కడ పంట ఉత్పత్తులు నిల్వ చేసే రైతులకు అనేక ప్రయోజనాలతో పాటు ఇన్సూరెన్స్, రాయితీలను కూడా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కల్పిస్తోంది.

బ్యాంకుల నుంచి రుణ సదుపాయం

గోదాముల్లో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే రైతులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ద్వారా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కూడా పొందొచ్చు. గోదాముల్లో నిల్వ చేసుకున్న ఉత్పత్తులకు గిడ్డంగుల సంస్థ నిల్వ రశీదు జారీ చేస్తుంది. ఈ రశీదుతో సదరు పంట విలువపై 75 శాతం వరకు బ్యాంకులు అతి తక్కువ వడ్డీకే రుణాలను రైతులకు ఇస్తాయి. తద్వారా రైతు నిల్వ చేసుకున్న పంట ఉత్పత్తులు అధిక ధర వచ్చాక విక్రయించుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇక్కడ నిల్వ చేసే పంట ఉత్పత్తులకు ఇన్సూరెన్స్ క్లయిమ్ చేసుకునే సదుపాయం ఉంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతు ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ఈ ప్రాంత రైతులకు మేలు చేసేలా పది వేల టన్నుల సామర్థ్యంతో ఆధునిక సాంకేతికతతో గోదాములను నిర్మించాం. ఇక్కడ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే రైతులకు అనేక సదుపాయలు కల్పిస్తున్నాం. వాటిని ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కరీముల్లా షేక్ అమీన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్

ఎన్నికల తరువాత టీడీపీ కనుమరుగు

ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)

పెనుగంచిప్రోలు: ఈ ఎన్నికల తరువాత రాష్ట్రంలో టీడీపీ కనపడదని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. మండలంలోని ముచ్చింతాల, శివాపురం, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు గ్రామాల్లో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభానుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కేశినేని నాని మాట్లాడుతూ.. తన స్కామ్‌ల నుంచి రక్షణ కోసం చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్నికల తరువాత పార్టీని బీజేపీలో విలీనం చేసి తెలంగాణ పారిపోవటం ఖాయమన్నారు. 30 రోజులు అందరూ కష్టపడి పనిచేస్తే మనందరి జగనన్న ప్రభుత్వం వస్తుందన్నారు. చంద్రబాబు పాలన తరువాత జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రం పది రెట్లు అభివృద్ధి చెందిందన్నారు. నీతి అయోగ్ చెప్పిన లెక్కల ప్రకారం చంద్రబాబు పాలనలో పేదరికం 11 శాతం ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాలుగు శాతానికి తగ్గిందని వివరించారు. చంద్రబాబు అమరావతి కోసం రూ.10 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని, జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాలు నిర్మించి రూ.30 వేల కోట్లు, పాఠశాలల అభివృద్ధికి రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఉదయభాను మాట్లాడుతూ.. జగనన్న పాలనలో జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని కోరారు. నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, పార్టీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ల డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జగ్గయ్యపేట మునిసిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, పక్కన ప్రభుత్వవిప్ ఉదయభాను

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివసామ్రాజ్యం

చిలకలపూడి(మచిలీపట్నం): సముద్రంలో ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేటను నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వి.శివసామ్రాజ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 61 రోజుల పాటు వేటను నిషేధించామని పేర్కొన్నారు. సముద్రజలాల్లో వివిధ చేపలు, రొయ్యలు సంతానోత్పత్తి కాలం కావడంతో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించి, వాటి సంతతి పెరుగదల, మత్స్య సంపద సుస్థిరతను సాధించటం ఈ నిషేధానికి ముఖ్య కారణమని వివరించారు. చేపలవేటకు వెళ్లే యాంత్రీక పడవలు, మెకనైజ్డ్, మోటారు బోట్లు సముద్రంలో ఎటువంటి చేపలవేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిషేధ ఉత్తర్వులను ధిక్కరించి చేపలవేట చేస్తే బోటు యజమానులపై ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. బోట్లలో ఉన్న మత్స్య సంపదను కూడా స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. డీజిల్ ఆయిల్‌పై రాయితీ సౌకర్యాన్ని నిలుపుదల చేస్తామని తెలిపారు. నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడం కోసం మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేశామని, వారికి మత్స్యకారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు



కంచికచర్ల/నందిగామ/జగ్గయ్యపేట: ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, నగదు తరలించే వాహనాలను సీజ్ చేయడంతోపాటు సంబంధిత వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి హెచ్చరించారు. దొనబండ, జొన్నలగడ్డ, గరికపాడు చెక్‌పోస్టులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. దొనబండ చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని సెబ్ సిబ్బంది తనిఖీ చేయాలని చెప్పారు. విజయవాడ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ ఆర్‌వీ రామశివ, కంచికచర్ల, జగ్గయ్యపేట సెబ్ సీఐలు సత్యనారాయణ, మణికంఠ, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు. జొన్నలగడ్డ చెక్‌పోస్టులో వాహనాలను స్వయంగా తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గరికపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. తెలంగాణ మద్యం రవాణాను అరికట్టాలని తెలిపారు.

రెడ్డి సామాజిక వర్గంపై కక్ష సాధింపు తగదు



కృష్ణలంక(విజయవాడతూర్పు): రెడ్డి సామాజికవర్గాన్ని నిత్యం ద్వేషించడం మానకపోతే వచ్చే ఎన్నికల్లో టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. టీడీపీతో పాటు కొన్ని పత్రికలు పురందేశ్వరితో కలిసి రెడ్లపై విషం చిమ్ముతూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం తగదని పేర్కొన్నారు. నిజాయితీ గల పోలీస్, సివిల్ సర్వీస్ అధికారులైన జవహర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, అమ్మిరెడ్డి రఘురామిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డిలతో పాటు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పైనా నిందలు మోపుతూ సమాజంలో రెడ్డి అధికారులను అసహ్యించుకునే రీతిలో చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు తన సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చి పోలీస్, రెవిన్యూ, మున్సిపల్ తదితర విభాగాలలో సమర్థవంతులైన రెడ్లకు ప్రాధాన్యత పోస్టులు దక్కకుండా చేసి అణచివేసింది నిజం కాదా అని ప్రశ్నించారు.

పోటీ పరీక్ష ఏదైనా.. విజయబావుటానే..

- ఆదర్శంగా నిలుస్తున్న అనిగండ్లపాడు గ్రామం
- ఏపీ రెసిడెన్షియల్ ఎంట్రన్స్‌లో ఏటా 20 మందికి సీట్లు



అనిగండ్లపాడు గ్రామం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఏ పోటీ పరీక్ష అయినా గ్రామానికి చెందిన ఒకరిద్దరు అయినా విజయం సాధించి తీరాల్సిందే. మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన వారు అన్ని శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. అలాగే ప్రైవేట్ కొలువులతో పాటు, ప్రతి కుటుంబం పట్టాలు కుడుతూ ఉపాధిని పొందుతున్నారు. గ్రామంలో 3 వేల మందికి పైగా జనాభా పరదా పట్టాలు కుట్టి ఉపాధి పొందుతున్నారు.

గురుకుల పాఠశాలల్లో 20 సీట్లు వీరికే...

ప్రతి ఏడాది ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో చేరేందుకు నాల్గో తరగతిలో ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తారు. ఐదు నుంచి పదో తరగతి వరకు అక్కడ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారు. పులిగడ్డ, నిమ్మకూరు, ముసునూరు, తాడికొండలో ఉన్న గురుకుల పాఠశాలల్లో ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు సీట్లు సంపాదించి చదువుతున్నారు. మొదట నన్నిదానం నరసింహారావు అనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్ష కోసం కోచింగ్ ఇచ్చేవారు. తరువాత దోసపాటి దానయ్య, జి.వెంకటేశ్వరరావుతో పాటు కొందరు ఉచితంగా కోచింగ్ ఇచ్చేవారు. ప్రస్తుతం కనకపూడి రమేష్ ట్యూటర్స్‌ను ఏర్పాటు చేసి ఎంట్రన్స్ కోసం కోచింగ్ ఇస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో మొత్తం 80 సీట్లు ఉంటే అనిగండ్లపాడు గ్రామానికి చెందిన విద్యార్థులే 20 మంది ఉంటారు. ప్రభుత్వం నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు ఏకంగా 46 మంది సాధించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు.

ఉద్యోగుల వివరాలు.....

గ్రామంలో ఉపాధ్యాయులుగా 53 మంది, పోలీసు శాఖలో 30 మంది, కండక్టర్లుగా 35 మంది, రైల్వేలో 10 మంది, వ్యవసాయ శాఖలో 20 మంది, పశుసంవర్ధక శాఖలో 20 మంది, బ్యాంక్‌ల్లో 18 మంది, రైల్వేలో 8 మంది ఉండగా వీరితో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 500 మందికి పైగా ఉన్నారు.

గ్రామంలో విద్యాలయాలు....

గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, యూపీ పాఠశాల, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల కాలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గినా మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగానే ఉంది. ఒక ప్రైవేట్ పాఠశాల ఉంది.

కష్టపడి లక్ష్యాన్ని చేరుకున్నాం



అత్యంత పేద కుటుంబంలో పుట్టినా ఉపాధ్యాయుడు కావాలనే లక్ష్యంతో చదివి విజయం సాధించాం. గ్రామంలో పేద విద్యార్థులకు కోచింగ్ ఇచ్చి గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించేందుకు కృషి చేస్తున్నాం. మేము చదువుకునే రోజుల్లో సరైన సౌకర్యాలు లేకున్నా కష్టపడ్డాం.

–దైదా దానయ్య, ఉపాధ్యాయుడు

పట్టుదలతో చదివి ఉద్యోగాలు



గ్రామంలోని ఎక్కువమంది గురుకుల పాఠశాలలో చదవటంతో పాటు, గ్రామంలో ఉద్యోగం పొందిన వారిని చూసి మేము కూడా సాధించాలనే పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధిస్తున్నాం. సచివాలయంలో గ్రామ కార్యదర్శి ఉద్యోగం సాధించాను. గ్రామంలో పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ ఉద్యోగాలతో పాటు విద్యుత్ శాఖలో పలువురు పోస్టులు పొందటం సంతోషంగా ఉంది.

–అళ్ల నరేష్, సచివాలయ కార్యదర్శి

దుర్గమ్మకు విశేష పుష్పార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బుధవారం గులాబీలు, కనకాంబరాలతో అర్చన చేశారు. ఉత్సవాల్లో రెండో రోజున నిర్వహించిన ప్రత్యేక పుష్పార్చనను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలతో వైదిక కమిటీ సభ్యులు మురళీ, అర్చకులు, ఆలయ అధికారులు ప్రధాన ఆలయంలోని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పార్చన వేదిక వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల మధ్య అమ్మవారికి గులాబీలు, కనకాంబరాలతో అర్చన నిర్వహించారు. అమ్మవారి విశేష పుష్పార్చనను వీక్షించేందుకు పెద్ద



కనకాంబరాలతో అమ్మవారికి అర్చన

ఎత్తున భక్తులు, ఉభయదాతలు వేదిక వద్దకు చేరుకున్నారు. పుష్పార్చన అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. అనంతరం భక్తులకు అమ్మవారికి అర్చన నిర్వహించిన పుష్పాలను పంపిణీ చేశారు.

కాపర్ వైర్ చోరీ ముఠాలపై నిఘా

విజయవాడస్పోర్ట్స్: వ్యవసాయ భూముల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో కాపర్ తీగలను చోరీ చేస్తున్న ముఠాల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ డి.గంగాభవాని తెలిపారు. వేసవిలో వ్యవసాయ భూముల్లో సాగు తక్కువగా ఉటుందని, ఈ తరుణంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లలో కాపర్ వైర్‌ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని హనుమాన్‌జంక్షన్, నూజివీడు రూరల్, నందిగామ, మైలవరం, గుడివాడ, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఈ తరహా దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. గత ఏడాదిలో ఈ తరహా చోరీలు 119 జరగ్గా, ఈ ఏడాది 58 జరిగాయని, ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధారణంగా పాత ట్రాన్స్‌ఫార్మర్‌లలోనే కాపర్ వైర్ ఉంటుందని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌లలో అల్యూమినియం కోర్ ఉంటుందన్నారు. కాపర్ వైర్ కోసం కొందరు దొంగలు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో దొంగిలించే కాపర్ వైర్‌తో దొంగలకు రూ. 2 వేలు కూడా రావని, అదే ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు రూ. 86 వేలు (16 కేవీ), రూ. 1.40 లక్షలు (25 కేవీ), రూ.3.20 లక్షలు (100 కేవీ) ఖర్చు అవుతుందన్నారు. ఈ దొంగతనాలకు పాల్పడిన పలువురు వ్యక్తులను అరెస్ట్ చేసి న్యాయ స్థానాల్లో హాజరుపర్చినట్లు చెప్పారు. మరి కొన్ని ముఠాలను అదుపులోకి తీసుకునేందుకు గ్రామాల్లో ప్రత్యేక టీం లను ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టే వస్తువులు కలిగిన వ్యక్తులు తారస పడితే వెంటనే 100, 94408 11790కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

రూ.20.70 లక్షలు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఎటువంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.20.70 లక్షల నగదును విజయవాడ కృష్ణలంక పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కృష్ణలంక పోలీసులు వారధి చెక్‌పోస్ట్ దగ్గర బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంలో గుంటూరు వైపు నుంచి విజయవాడ వస్తున్న నాన్ స్టాప్ బస్సులో తనిఖీలు చేయగా తోట భీమార్జున్ కుమార్ అనే ప్రయాణికుడి వద్ద ఉన్న సంచిలో రూ.20.70 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వివరణ కోరగా తాను మినుముల వ్యాపారం చేస్తున్నానని, దానికి సంబంధించిన నగదని తెలిపారు. కానీ, సరైన రసీదులు చూపపోవడంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు.

గ్రామానికి చేరుకున్న మృతదేహాలు



కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన తల్లీకూతుళ్ల కమతం గీతాంజలి (32), హానిక (6) గత నెల 31న అమెరికాలోని పోర్టులాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఘటనలో భర్త నరేష్, కుమారుడు బ్రమన్ గాయాలతో బయటపడ్డారు. హానిక సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, గీతాంజలి బ్రెయిన్‌డెడ్‌తో ఏప్రిల్ 1న మృతి చెందింది. దీంతో తల్లీకూతుళ్ల మృతదేహాలు మంగళవారం రాత్రికి స్వగ్రామం కొణకంచి చేరుకున్నాయి. అమెరికా నుంచి మృతదేహాలను విమానంలో గన్నవరం తీసుకురాగా అక్కడి నుంచి అంబులెన్స్‌లో కొణకంచి చేర్చారు. మృతదేహాలు రాగానే కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎంతో సంతోషంగా సాగుతున్న కుటుంబంలో జరిగిన దారుణ సంఘటనపై గ్రామస్తులు కూడా కంటతడి పెట్టారు. బుధవారం ఉదయం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్ గోనెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, పారామౌంట్ అధినేత సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

త్వరలో తిరువూరు సబ్‌జైలు పునరుద్ధరణ



తిరువూరు: ఇరవై ఏళ్ల కిందట మూసివేసిన సబ్‌జైలును త్వరలో తిరిగి ప్రారంభించేందుకు జైళ్ల శాఖ నిర్ణయించింది. అత్యంత పటిష్టమైన కట్టడాలున్న ఈ జైలులో డ్రైయినేజీ సమస్య కారణంగా గతంలో తాత్కాలిక మరమ్మతుల కోసం మూసివేశారు. ఇక్కడి విచారణ ఖైదీలను నూజివీడు, ఏలూరు జైళ్లకు తరలించారు. అప్పటి నుంచి తిరువూరు కోర్టులలో కేసుల్లో ఉన్న విచారణ ఖైదీలను పోలీసు బందోబస్తుతో రిమాండుకు తరలిస్తున్నారు. ఇది అత్యంత వ్యయప్రయాసలతో కూడినందున ఈ జైలును తిరిగి ప్రారంభించాలని న్యాయవాదులు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా జైళ్ల సూపరింటెండెంట్ ప్రసాద్ ఈ జైలును పరిశీలించారు. త్వరలో ఈ జైలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని విలేకరులకు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణ



గుడివాడ మార్కెట్‌యార్డ్‌లో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ లోపల పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ
- స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలన

గుడివాడరూరల్/పామర్రు/పెనమలూరు: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. జిల్లాలోని గుడివాడ, పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూంలను బుధవారం ఆయన పరిశీలించారు. గుడివాడ, పామర్రు మార్కెట్ యార్డులలో స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలానే పెనమలూరు నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్ గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేయాలని తెలిపారు. నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూముల వద్ద ఎంట్రీ, భద్రత సిబ్బంది కనపడే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల కిటికీలు, డోర్లు పటిష్టమైన మెటీరియల్‌తో క్లోజ్ చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ కోసం ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుడివాడ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో పి.పద్మావతి, డీఎస్పీ పి.శ్రీకాంత్, పామర్రు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీదేవి, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సుభాకర్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీ పల్లవి, ఎన్నికల టీడీ జగన్‌మోహన్‌రెడ్డి, పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, ఆర్‌డీఓ డి.రాజు, తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి...

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ డీకే బాలాజీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన సంఘటనల విషయంలో ఎప్పటికప్పుడు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతిరోజు ముఖ్యమైన సంఘటనల వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వాటిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం పనికారిదని స్పష్టం చేశారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తప్పనిసరిగా గట్టి బందోబస్తు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు కట్టుదిట్టంగా చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్క ఉద్యోగి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని విధాల ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చక్రాల కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. వారికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కె చంద్రశేఖరరావు, రిటర్నింగ్ అధికారులు పి వెంకటరమణ, దాసి రాజు, ఎం వాణి, బాలసుబ్రహ్మణ్యం, పి పద్మావతి, శ్రీదేవి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ప్రసాదం పోటులో మంటలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ వారి ఆలయ ప్రసాదాల తయారీశాలలో బుధవారం అకస్మాత్తుగా మంటలు వ్యాపించటంతో భక్తులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఆలయ క్యూలైన్ పక్కన ఉన్న లడ్డూ, పులిహోర ప్రసాదాల శాలలో లడ్డూలు తయారు చేసే సమయంలో కళాయిలోని మిగిలిన దుగ్గను పక్కకు నెడుతున్నారు. ఈక్రమంలో దుగ్గ కళాయి నుంచి పక్కకు వేయగానే నిప్పులు పడి నెయ్యికి మంటలు వ్యాపించాయి. దీంతో లడ్డూలు తయారు చేస్తున్న కార్మికులు ఒక్కసారిగా బయటకు పరిగెత్తారు. సిబ్బంది వెంటనే బయట ఉన్న గ్యాస్ సిలిండర్ల వద్ద గ్యాస్ ఆపివేశారు. ఆలయంలో ఉన్న సిలిండర్లతో, నీళ్లతో మంటలు ఆదుపు చేశారు. జగ్గయ్యపేట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చే సరికే మంటలు ఆర్పేయటంతో పెద్ద పెనుప్రమాదం తప్పింది. దీనిపై ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడును వివరణ కోరగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామన్నారు.



మంటల్లో కాలిన లడ్డూ ప్రసాదాల తయారీ పాత్రలు

కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. కారులో ఉన్న నూతన వధూవరులు అదృష్టవశాత్తు గాయపడకుండా బయటపడ్డారు. మండలంలోని తుమ్మలపాలెం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని సత్యనారాయణపురం (కాచవరం) గ్రామానికి చెందిన వాసిరెడ్డి గోపీనాథ్‌కు రాయనపాడుకు చెందిన వాసవికి ఈ నెల 5న వివాహం జరిగింది. నిద్రలు చేసేందుకు రాయనపాడు వచ్చిన నవ దంపతులు తమ బంధువులతో కలసి కారులో కాచవరం తిరుగుప్రయాణం అయ్యారు. కారును ఓవర్‌టేక్ చేస్తున్న లారీని తపించబోయిన డ్రైవర్ కంగారులో పంట పొలంలోకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో కారు రెండు పల్టీలు కొట్టి పొలంలో ఆగింది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. పెండ్లి కుమారుడి తండ్రి నరసింహారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన పెద్ద కుమారుడు, కోడలకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



తుమ్మలపాలెం వద్ద అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన కారు

దుర్గగుడి కేశఖండనశాలలో చక్రం తిప్పిందెవరు?

- నాడు ప్రభుత్వ జీవోనే కాదన్నారు
- నేడు అమలు చేయించేందుకు పావులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఏడాది కిందట ప్రభుత్వం జారీ చేసిన జీవోని వద్దన్న వారు ఇప్పుడు జీవో ప్రకారమే కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేనా పది నెలల కాలంలో ఉన్న వ్యత్యాసం మొత్తాన్ని దేవస్థానం నుంచి వసూలు చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ మేరకు ఈవో నుంచి అనుమతులు పొందేందుకు దుర్గగుడి కేశ ఖండనశాలలో చక్రం తిప్పుతున్నది ఎవరు..? దీనిపై ఆలయ ఈవో దృష్టి సారించి దేవస్థాన నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. నాయీ బ్రాహ్మణులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన జీవోను దిక్కరించిన వారు ఇప్పుడు ఆ జీవో ప్రకారమే కమీషన్ ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లోని కేశఖండన శాలలో విధులు నిర్వహించే నాయీ బ్రాహ్మణులకు తలనీలాలు తీసిన ప్రతి ఒక్క టికెట్‌కు రూ. 40 కమీషన్ చెల్లించాలని ప్రభుత్వం గత ఏడాది మే 1న జీవో జారీ చేసింది. దీంతో తాము ఆర్థికంగా నిలదొక్కుకుంటామని నాయీ బ్రాహ్మణులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అయితే శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 96 మందిలో 60 మంది జీవోకు అంగీకారం తెలపగా, మరో 36 మంది ఈ జీవోను వ్యతిరేకించారు. ఈ జీవో తమకు వద్దని గతంలో ఇచ్చిన విధంగా రూ.25 ఇవ్వాలని అప్పటి ఈవో భ్రమరాంబ, చైర్మన్ రాంబాబు, దేవస్థాన శాఖ కమిషనర్‌లకు లేఖ రాశారు. జీవోను వ్యతిరేకించిన నాయీ బ్రాహ్మణుల ఇష్ట ప్రకారమే టికెట్ ఒక్కింటిపై రూ.25 కమీషన్ ఇవ్వాలని, మిగిలిన 60 మందికి రూ.40 చొప్పున కమీషన్ ఇవ్వాలని గత ఏడాది సెప్టెంబర్ 4న కమిషనర్ ఆర్డర్ ఇచ్చారు. అప్పటికే జీవో వచ్చి నాలుగు నెలలు కాగా ఆ నాలుగు నెలల్లో ఉన్న వ్యత్యాసం మొత్తాన్ని దేవస్థానం వారికి చెల్లించింది. ఇప్పుడు మిగిలిన 36 మంది తమకు కూడా రూ.40 కమీషన్ చెల్లించాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై దుర్గగుడి ఈవో, చైర్మన్‌ల అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ నెల 14వ తేదీన 36 మందికి రూ.40 చొప్పున చెల్లించాలని కమిషనర్ ఆర్డర్ ఇచ్చారు. ఈ ఆర్డర్‌లో ఎక్కడా కూడా 10 నెలల్లో ఉన్న వ్యత్యాసం మొత్తాన్ని చెల్లించాలని పేర్కొనలేదు. ఈ విధంగా చెల్లిస్తే దేవస్థానానికి సుమారు రూ. 38 లక్షల మేర ఖజానాకు గండి పడే అవకాశం ఉంది. ఈ వ్యవహారాన్ని చక్కబెట్టేందుకు కేశ ఖండనశాలలో విధులు నిర్వహిస్తున్న సూపరిండెంటెంట్ స్థాయి అధికారి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. ఆర్డర్‌లో లేని విషయాన్ని మబ్బున పెట్టి అమ్మవారి నిధులను ఖర్చు చేయాలని చూస్తున్నారు. ఆలయ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి అమ్మవారి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో నిండు గర్భిణి మృతి

కోనేరుసెంటర్: అనుమానాస్పద స్థితిలో ఓ నిండు గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఆర్‌పేట పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మచిలీపట్నం ఇనకుదురుపేటకు చెందిన దాసరి దుర్గ (29)కు అదే ప్రాంతానికి చెందిన సూర్య సత్యనారాయణతో 2017 లో వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా ప్రస్తుతం దుర్గ ఆరు నెలల గర్భిణి. ఇది ఇలా ఉండగా ఈ నెల 8వ తేదీ న పక్కింట్లో అద్దెకు ఉంటున్న జ్యోతి అనే మహిళ దుర్గాతో గొడవ పడింది. తన భర్తతో సన్నిహితంగా ఉంటున్నావ్ అంటూ నిందలు వేసింది. దీంతో మనస్థాపానికి గురైన దుర్గ దంపతులు అదేరోజు ఇల్లు ఖాళీ చేసి నిజాంపేటలో మరో ఇంటికి అద్దెకు వెళ్లారు. రెండు రోజుల పాటు భర్త పిల్లలతో సరదాగా గడిపిన దుర్గ బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ యాదవ్, ఎస్‌ఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. జ్యోతి అనే మహిళ నిందలు వేయడంతోనే తన భార్య ఆత్మహత్య చేసుకుందని భర్త సూర్య సత్యనారాయణ పోలీసులు చెప్పగా మృతురాలి సోదరుడు గాడిచర్ల సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కేసు విచారణ అధికారి ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

ముస్లింలకు అవినాష్ రంజాన్ శుభాకాంక్షలు



గుణదల (విజయవాడ తూర్పు): ముస్లింలు పవిత్రంగా జరుపుకొనే రంజాన్ పండుగ అందరి జీవితాలలో శాంతిని నింపాలని వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాలకు దేవుని దీవెనలు మెండుగా లభించాలని ఆకాంక్షించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



పటమట(విజయవాడతూర్పు): మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. సోమవారం సాయంత్రం 19వ డివిజన్ పోలీస్ క్వార్టర్స్‌లోని మసీదులో జరిగిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఉపవాస దీక్ష ముగిసిన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వటం గొప్ప పుణ్యకార్యమన్నారు. అనంతరం ముస్లింలతో కలసి అవినాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ కన్వీనర్ మున్నీర్ అహ్మద్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, కోఆప్షన్ సభ్యుడు అలీం, వైఎస్సార్ సీపీ నాయకుడు రిజ్వాన్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

97 మంది వలంటీర్లు రాజీనామా



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో మరో 97 మంది వలంటీర్లు బుధవారం తమ విధుల నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు తూర్పు జోనల్ కమిషనర్‌ను కలిసి తమ రాజీనామా లేఖలను అందజేశారు. రాజీనామా చేసిన వారిలో 2, 8, 12, 14, 19 డివిజన్‌లకు చెందిన వలంటీర్లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తుంటే తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం సేవలు అందించామని వారు గుర్తు చేశారు.

భర్త, అత్త, మామలు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ నేతాజీ కాలనీలో మీసాల సుమలత తన భర్త విజయ్ కుమార్‌తో కలసి నివసిస్తున్నారు. వీరికి 2016లో వివాహం అయింది. ఇరువురు సంతానం ఉన్నారు. వివాహం అయిన దగ్గర నుంచి భర్త, అత్తమామలు సుమలతను మానసికంగా వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో బాలిక అదృశ్యం అయిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన బాలిక (16)ఇటీవల పది పరీక్షలు రాసింది. ఆమెను హాస్టల్‌లో పెడతామని తల్లితండ్రులు తెలిపారు. కాగా మంగళవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వాయిదాలకు హాజరుకాని నిందితుడికి రిమాండ్

ఉంగుటూరు: అక్రమంగా గంజాయి రవాణా కేసులో నిందింతుడిని ఆత్కూరు పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడ ఎంఎస్‌పి సేషన్స్ కోర్టులో బుధవారం హాజరుపరచినట్లు ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ వివరాలను వెల్లడి చేశారు. గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉన్న తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన రవిశంకర్ ఏడాది నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో న్యాయమూర్తి అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఆత్కూరు పోలీసులు మధురై వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 14రోజులు రిమాండ్‌కు విధించారు.

శివకామేశ్వరీ అమ్మవారికి అష్ట గంధంతో పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వ ర్యాన గంధం, అష్ట గంధంతో పూజలు చేశారు.

టీడీపీకి ఓట్లు అడిగే అర్హత లేదు



కరపత్రాలు అందజేస్తున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా సంక్షేమాన్ని విడిచిపెట్టి, పేదల జీవితాలను రోడ్డున పడవేసిన తెలుగు దేశం పార్టీ నాయకులకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. నగరంలోని ఐదవ డివిజన్ పరిధిలోని అరుణ్‌నగర్ కొండ ప్రాంతంలో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టీడీపీ హయాంలో జన జీవితం అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాల్ మనీ, సెక్స్ రాకెట్ వంటి కుంభకోణాలతో రాష్ట్రాన్ని దోచుకున్న ఘనత తెలుగు తమ్ముళ్లకే దక్కుతుందని విమర్శించారు. చంద్రబాబు విధివిధానాలు పేదల పాలిట శాపంగా మారాయని దుయ్యబట్టారు. ప్రతిపక్షంలో ఉన్న ఈ ఐదేళ్ల కాలంలో ప్రజా సమస్యలపై దృష్టి సారించలేదని, ఫలితంగా ప్రజా క్షేత్రంలో తెలుగు దేశం పార్టీ నేతలు విశ్వసనీయత కోల్పోయారని దుయ్యబట్టారు. సొంత వ్యాపారాలు చేసుకుంటూ ఇళ్లకు పరిమితమైన టీడీపీ నాయకులకు ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదని స్పష్టం చేశారు.

వలంటీరు వ్యవస్థపై చంద్రబాబు అక్కసు..

సంక్షేమ పథకాలను పేదలకు చేర్చుతున్న వలంటీరు వ్యవస్థపై కన్నుకుట్టిన చంద్రబాబు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని



వికలాంగుడితో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

దేవినేని అవినాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లు విధులకు హాజరు కాకుండా కుటిల రాజకీయాలకు తెరతీస్తున్న చంద్రబాబుకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని తెలిపారు. పింఛన్లు సకాలంలో అందకుండా అడ్డుపడిన చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో ఓటమిపాలు కాక తప్పదని స్పష్టం చేశారు.

అభివృద్ధి అంటే ఇదీ...

విజయవాడ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఐదేళ్లలోనే అంబేద్కర్ స్మృతి వనం, కృష్ణలంక కరకట్ట రిటైనింగ్ వాల్, కొండ ప్రాంతాల అభివృద్ధి ఇలా... నగర సర్వతోముఖాభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు లోకేష్, ప్రసాద్, విశల్ తదితరులు పాల్గొన్నారు.

● ఈద్-ముబారక్



లబ్బీపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

శ్రీరాముడు సకల గుణాభిరాముడు

విజయవాడ కల్చరల్: శ్రీరాముడు సకల గుణాభిరాముడని ఆధ్యాత్మికవేత్త మండలీక శ్రీ కృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు పున్నమ్మతోటలోని టీడీడీ కల్యాణమండపంలో నిర్వహించే శ్రీమద్రామాయణ సప్తాహం కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమంలో శ్రీరామ జననంతో ప్రారంభించి శ్రీరామపట్టాభిషేకం వరకు జరిగిన అంశాలను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బైక్ ఢీకొని టీ వెండర్‌కు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు రోడ్డు ఆర్‌సీఎం స్కూల్ ప్రాంతానికి చెందిన ఎ. తులసీరావు ఫ్లాస్కోలో టీ పెట్టుకుని షాపులకు అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టీ తీసుకుని చిట్టినగర్ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ వచ్చి ఢీ కొట్టింది. దీంతో తులసీరావుకు కుడికాలు మోకాలు వద్ద గాయమైంది. వెంటనే తులసీరావును 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాయబ్ ఖాజీగా అబ్దుల్ మాలిక్

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలో నూర్ ఏ ఇలాహీకు సంబంధించిన ఏరియా మినహాయించి పాత రాజరాజేశ్వరి పేట, కొత్త రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి ప్రభుత్వ నాయబ్ ఖాజీగా సయ్యద్ అబ్దుల్ మాలిక్ ను నియమించినట్లు విజయవాడ సిటీ ఖాజీ అబ్దుల్ ఖాదిర్ చిష్టి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నివశించే వారు వివాహాల కోసం సయ్యద్ మాలిక్ 74166 84737 ను సంప్రదించవచ్చునని తెలిపారు.

నా ఆరోగ్యం.. నా హక్కుపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గురుప్రసాద్

పటమట(విజయవాడతూర్పు): ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వాల బాధ్యతని, ప్రభుత్వాల బాధ్యతతో పాటు ఆహారం, అలవాట్లు, వ్యాయామం, నిద్ర వంటి అంశాల్లో ప్రజలు కూడా శ్రద్ధ వహించాలని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ పి.గురుప్రసాద్ అన్నారు. వాసవ్య నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఆయన బుధవారం నా ఆరోగ్యం.. నా హక్కు అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు వ్యాధి నిరోధక టీకాలు, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య విద్య గురించి అన్ని స్థాయిల్లో బాధ్యత వహించాలన్నారు. ప్రజలకు అవసరమైన మందులు, వ్యాధులకు సంబంధించిన పరీక్షలు, చికిత్సలు నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, ఆహార పదార్థాల కల్తీలపై శ్రద్ధ వహించాలని, ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వంటి వాటిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మారు పాల్గొన్నారు.

జగనన్న పాలనకే ప్రజల ఓటు

మంత్రి జోగి రమేష్



పెనమలూరులో నేతలు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన జగనన్నకే ప్రజలు ఓటు వేస్తారని, నేతలు, కార్యకర్తలు ఓటర్లు అండగా ఉండి ఓట్లు వేయించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. పెనమలూరు గ్రామంలో బుధవారం నేతలు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని క్యాడర్‌కు దిశనిర్దేశం చేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో జగనన్న మాత్రమే చేశారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు.

కూటమి అతుకుల బొంత..

రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ జనసేన కూటమి అతుకుల బొంత అని జోగి రమేష్ విమర్శించారు. 2014లో ఇదే కూటమి ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి గెలిచి దగా చేశారని ఆరోపించారు. ఎన్నికల తరువాత కూటమి పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారని అన్నారు. టీడీపీ జనసేన పార్టీని ఈ ఎన్నికల్లో మింగేస్తుందని, అలాగే ప్రజలు టీడీపీని ఇంటికి పంపుతారన్నారు. ఈ రాష్ట్రానికి ఏమీ చేయని బీజేపీ ఈ ఎన్నికల్లో గల్లంతవుతుందని అన్నారు.

పెనమలూరుకు మహర్దశ..

జగనన్న తిరిగి ముఖ్యమంత్రి అయిన తర్వాత పెనమలూరుకు మహర్దశ పడుతుందన్నారు. తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణం, విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి ఆరు లైన్‌లుగా అభివృద్ధి, బందరు పోర్టు నిర్మాణం పూర్తి చేస్తారన్నారు. బందరు పోర్టు కారణంగా అనేక పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకొని రాష్ట్రంలోనే పెనమలూరు అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ కొడాలి సుష్మా, పంచాయతీ వార్డు సభ్యులు వీరంకి రాఘవులు, షేక్. మీరాబి, మరీదు నరేష్, గాలంకి లక్ష్మి, ఎం.ఉపేంద్ర, నేతలు శీలం శ్రీరాములు, మరీదు శివ, చిగురుపాటి దామోదరరావు, అంగ్రాజు శ్రీనివాసరావు, కొల్లి రామచంద్రరావు, మాణిక్యాలరావు, దేవరపల్లి దిలీప్, శీలం రమేష్, శీలం బుజ్జి , తాళ్లూరి అజయ్, గాలంకి సుబ్బారావు, బుజ్జిబాబు, వసంతరావు, జోజి, గ్రామ ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం చోడవరం గ్రామంలో కూడా మంత్రి జోగి రమేష్ పార్టీ క్యాడర్‌కు, ముఖ్యనేతలకు సమావేశం నిర్వహించారు.

విజయవాడ జోన్ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న శ్రీచైతన్య ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడంతో పాటుగా వారి సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి శ్రీచైతన్య విద్యాసంస్థలు అవలంబిస్తున్న విద్యావిధానం అభినందనీయమని ఐఏఎస్ అధికారి (ముఖ్యమంత్రి కార్యాలయ జాయింట్ సెక్రటరీ) భరత్‌గుప్తా అన్నారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఎన్‌టీఎస్‌ఓ) పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించే కార్యక్రమం మొగల్రాజపురంలో శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో బుధవారం జరిగింది. భరత్ గుప్తా హాజరై విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. చైతన్య విద్యాసంస్థల విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ మాట్లాడుతూ జాతీయస్థాయిలో రెండు లెవెల్స్‌లో వివిధ సబ్జెక్టుల్లో జరిగిన ఎన్‌టీఎస్‌ఓ పరీక్షలో విజయవాడ జోన్‌లోని చైతన్య విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపి అత్యధిక బహుమతులను పొందారని చెప్పారు. మొదటి బహుమతిగా 12 ల్యాప్ టాప్‌లు, రెండో బహుమతిగా 37 ట్యాబ్‌లు, 12,042 మంది గోల్డ్ మెడల్స్‌తో పాటుగా సర్టిఫికెట్స్ పొందారని మురళీకృష్ణ వివరించారు.

గన్నవరం డివిజన్ సివిల్ జడ్జి సీహెచ్ శ్రీనివాసబాబు హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఆల్ ఇండియా చైతన్య పాఠశాల కో–ఆర్డినేటర్ బి.సతీష్, పాఠశాల ఆర్‌ఐలు రావి పద్మ, రామారావు, రాజేష్ బాబు, పాఠశాల విజయవాడ జోన్ కో–ఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భాష మారకుంటే బుద్ధి చెబుతాం

కంకిపాడు: సభ్యత, సంస్కారం లేకుండా అడ్డగోలుగా మాట్లాడితే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్‌ను హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌పై బోడె ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రస్థాయిలో ఖండించారు. కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంటే చులకన అన్నారు. పెత్తందారీ పోకడలతో మంత్రి జోగి రమేష్‌పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. టీడీపీ హయాంలో గొల్లగూడెంలో నాన్ లేఅవుట్ వేసి ప్రజల్ని దోచుకున్నది గుర్తులేదా?, మౌలిక వసతులు లేక స్థలాలు కొనుగోలు చేసిన పేదలు ఇబ్బందులకు గురవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కాల్ మనీ, సెక్స్ రాకెట్, దొంగ పరీక్ష అభియోగాల్లో ఆరోపణలు ఎదుర్కోవటం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ఓటమి పాలయ్యేందుకు బోడె సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంత రావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబ రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు తంబాబత్తుల ఓంకారం, నాయకులు కరీముల్లా, మల్లు, చీలి అనిల్, పి.కుమారస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా

తూర్పులో దేవినేని క్రాంతి, దేవినేని సుధీర, కేశినేని హైమ విస్తృత ప్రచారం



లబ్బీపేటలో ప్రచారం చేస్తున్న దేవినేని క్రాంతి, కార్పొరేటర్ మాధురి



9వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దేవినేని సుధీర, కేశినేని హైమ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి, సతీమణి దేవినేని సుధీర విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం దేవినేని క్రాంతి 7వ డివిజన్‌లోని ప్రజాశక్తినగర్, లబ్బీపేట ప్రాంతాల్లో పర్యటించగా, కేశినేని నాని కుమార్తె హైమతో కలిసి దేవినేని సుధీర 9వ డివిజన్ పటమటలంక, 5వ డివిజన్ క్రీస్తురాజుపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్తూ ప్రజలకు మేలు చేసిన వారిని గెలిపించాలని కోరుతున్నారు. అందులో భాగంగా వైఎస్సార్‌సీపీ పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాలుగున్నరేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చినా అండగా ఉన్న దేవినేని అవినాష్‌ను ఆశీర్వదించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, పేదలకు మేలు చేయాలనేది ఆయన ఆశయమన్నారు. రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాల్సిన అవసరాన్ని వాళ్లు ప్రజలకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, 13వ డివిజన్ ఇన్‌చార్జి రామాయణపు శ్రీనివాస్, 9వ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, నాయకులు గద్దే కళ్యాణ్‌రామ్, ఇందుపల్లి సుభాషిణి, అశోక్ ఇతర నేతలు పాల్గొన్నారు.

మాలలు చంద్రబాబును ఎన్నటికీ నమ్మరు

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలలకు తీరని అన్యాయం చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ అన్నారు. మాలలు ఎన్నటికీ చంద్రబాబును నమ్మరని ఆయన అన్నారు. నగరంలోని మాచవరంలో బుధవారం చందా కిరణ్‌తేజ మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల కిందట కొందరు స్వార్థపరులైన మాల నాయకులు చంద్రబాబును కలవడం వారి దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. నాడు మాలల పంతం ..చంద్రబాబు అంతం అన్న వారే నేడు వెళ్లి ఎలా కలిశారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాలలకు అన్ని రకాలుగా మేలు చేశారని, మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్రంలోని మాలలంతా ఎదురు చూస్తున్నారని కిరణ్‌తేజ అన్నారు. మాలలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తారని, చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. పేద వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు జగన్ దోహదపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పథకాల అమలు



ఎన్నికల ప్రచారం చేస్తున్న 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీని గెలిపిస్తేనే పేదల సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగుతాయని 18వ డివిజన్ కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం రాణిగారితోట, 18వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు డివిజన్‌లోని పలు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ను, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత పదేళ్లలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నియోజకవర్గంలో చేయలేని అభివృద్ధిని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న దేవినేని అవినాష్ ఐదేళ్లలోనే చేసి చూపించారన్నారు. అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తున్న అవినాష్‌ను ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్ ఎంట్రన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జానకీరామ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఏపీ పాలిటెక్నిక్ డిప్లొమా జాయింట్ డైరెక్టర్ జానకిరామ్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పాలిసెట్ లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. నిరుపేద విద్యార్థుల కోసం ఏటా ఉచిత పాలిసెట్ కోచింగ్ ఏర్పాటు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలను అభినందించారు. ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్స్ అందజేసిన జానకిరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి.కుమార్ స్వామి, మాధవ్, సంతోష్, భార్గవ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సైగలకు మాటలొచ్చాయి



న్యాయవాది **అడ్వా సారా సన్ని** భారతదేశపు మొట్టమొదటి వినికిడి లోపం గల రిజిస్టర్డ్ ప్రాక్టీసింగ్ లాయర్‌గా చరిత్ర సృష్టించారు. ఏప్రిల్ 4న ఆమెకు సహాయం చేయడానికి సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ ద్వారా సర్టిఫైడ్ ఇంటర్ ప్రెటర్ సేవలను పొందాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఫలితంగా ఏప్రిల్ 8న కర్ణాటక హైకోర్ట్ రిజిస్టర్డ్ సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడి లోపం ఉన్న న్యాయవాది నుంచి వాదనలు విన్నది. దీంతో అడ్వకేట్ సారా సన్నీతోపాటు కర్ణాటక హైకోర్ట్ కూడా దివ్యాంగులకు ఒక గొప్ప బాసటగా నిలిచినట్లయింది. ఇది న్యాయ నిపుణులకు మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న పౌరులకు కూడా సమగ్ర న్యాయవ్యవస్థకు మార్గం మరింతగా సుగమం చేస్తుంది.


జస్టిస్ ఎం నాగప్రసన్న, అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్‌లతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ అడ్వా సన్నీ నమోదును ప్రశంసించింది. ఏఎస్‌జీ కామత్ మాట్లాడుతూ 'ఇంటర్‌ప్రెటర్ ద్వారా హియరింగ్, స్పీచ్ ఇంపెయిర్‌డ్ అడ్వకేట్ వాదనను విన్న మొదటి హైకోర్టుగా కర్ణాటక హైకోర్టు చరిత్రలో నిలిచిపోతుంది. సారా సన్నీ సంకేత భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడిలోపం, ప్రసంగం బలహీనంగా ఉండటం వల్ల కలిగే వైకల్యాన్ని ఓడించింది. అందుకు సారా సన్నీని అభినందించాల్సిందే. సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వాదప్రతివాదనలు జరిగినప్పటికీ ప్రశంసలు రికార్డులలో నమోదు అవుతాయి' అని తెలియజేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 'భారత న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాల నుండి ఎక్కువ మంది మహిళలు చేరాల'ని పదే పదే ప్రస్తావించారు.

ప్రోత్సహించడానికి... అడ్వా సారా సన్నీ కేరళలోని కొట్టాయం వాసి. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుకున్నారు. కేవలం స్వీయ ఆసక్తితో మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న ఇతరులను కూడా ప్రోత్సహించడానికి న్యాయవాద వృత్తిని ఎంచుకుంది. అడ్వకేట్ సన్నీ ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అండ్ హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో యాక్టివ్ మెంబర్. సెప్టెంబరు 2023లో న్యాయవాది సన్నీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఒక కేసు వాదించిన, వినికిడి లోపం ఉన్న మొట్ట మొదటి లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంలో సన్నీ 'డీవై చంద్రచూడ్ ఓపెన్ మైండ్ ప్రత్యేక సామర్థ్యం ఉన్న వ్యక్తుల కోసం తలుపులు తెరిచింది' అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సన్నీ కోర్టు సబ్‌మిషన్స్‌లో సహాయం చేయడానికి సంకేత భాషా ఇంటర్‌ప్రెటర్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు గతంలో తన రిజిస్ట్రీని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు అది అమలు అయ్యింది. వైకల్యాలున్నవారు తమ అడ్డంకులను అధిగమించడంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అయ్యింది.

సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్!

నేడు రమజాన్



అల్లాహు
అక్బర్..
అల్లాహు అక్బర్..
లాయిలాహ ఇల్లల్లాహు
వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలి
ల్లాహిల్ హంద్..!

ఈ రోజు ఎటువిన్నా ఈ స్తోత్ర గానమే, ఆ దయామయుని కీర్తిగానమే వినిపిస్తూ హృదయాలను పులకింపజేస్తూ ఉంటుంది. ఊరు, వాడ, పల్లె, పట్నం, చిన్నా పెద్దా, ఆడా మగా, ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఈ అమృత వచనాలే జాలువారుతూ ఉంటాయి.

కొత్తబట్టలు, కొత్తహంగులు, తెల్లని టోపీలు మల్లెపూలలా మెరిసిపోతుంటాయి. అత్తరు పన్నీరు పరిమళాలు, అస్సలాము అలైకుం, ఈద్ ముబారక్‌లు, చిరునవ్వుల కరచాలనాలు, ఆలింగనాల ఆనంద తరంగాలు, అలయ్ బలయ్‌లతో విశ్వాసుల హృదయాలు సంతోషసాగరంలో ఓలలాడుతూ ఉంటాయి.

సేమ్యాలు, షీర్ ఖుర్మాలు, బగారా, బిర్యానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో ముస్లిముల లోగిళ్ళు కిలకిల నవ్వుతూ, కళకళలాడుతూ ఉంటాయి. ఇళ్ళలో ఆడాళ్ళ హడావిడికి, పిల్లల సందడికి హద్దులే ఉండవు. ఎందుకంటే ఇది ఒక్కనాటి పండుగ కాదుగదా! నెల్లాళ్ళపాటు భక్తిప్రపత్తులతో జరుపుకున్న పండుగకు అల్విదా చెబుతున్న ముగింపు ఉత్సవం.

రమజాన్ నెలరోజులూ ముస్లింల వీధులు 'సహెరీ','ఇఫ్తార్'ల సందడితో నిత్యనూతనంగా కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ వింత అనుభూతుల్ని పంచుతుంటాయి. భక్తులు పవిత్ర గ్రంథ పారాయణా మధురిమను గ్రోలుతూ వినూత్న అనుభూతులతో పరవశించి పోతుంటారు. అవును.., ఇలాంటి అనుభూతులు, ఆనందాలు, ఆహ్లాదాలు, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే పండుగ. ఇలాంటి ఓ అద్భుతమైన, అపురూప సందర్భమే 'ఈదుల్ ఫిత్ర్'. దీన్నే రమజాన్ పండుగ అంటారు. ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఇది మొదటిదీ, అతి పవిత్రమైనదీను. ఈ నెలలో ముస్లింలు అత్యంత నియమనిష్ఠలతో రోజా వ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తూ, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స)వారిపై సలాములు పంపుతూ ఉంటారు. దైవనామస్మరణలో అనునిత్యం వారి నాలుకలు నర్తిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు. ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాసదీక్షలు నెలరోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటితేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. ఈ పండుగ సంబంధం రమజాన్ నెలతో ముడివడి ఉన్న కారణంగా ఇది రమజాన్ పండుగగా ప్రసిద్ధి చెందింది. రమజాన్ ఉపవాస దీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకు పోయి ఉంది.

మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాస దీక్షల అసలు లక్ష్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, సూర్యోదయం కాకముందే భుజించడం(సహెరి), సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, రోజూ ఐదుసార్లు దైవారాధనచేస్తూ సూర్యాస్తమయం తరువాత రోజా విరమించడం(ఇఫ్తార్), మితాహారం తీసుకోవడం, మళ్ళీ అదనపు ఆరాధనలు అంటే తరావీహ్ నమాజులు చేయడం, మళ్ళీ తెల్లవారు ఝామున లేవడం – ఈవిధంగా రమజాన్ ఉపవాస వ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుతమైన, బాధ్యతాయుతమైన, దైవభక్తి పరాయణతతో కూడుకున్న జీవనవిధానానికి అలవాటు చేస్తుంది. మానవుల్లో ఇంతటి మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ త్రికరణ శుద్ధిగా పాటించ గలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతాపూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే, పవిత్ర రమజాన్ నెలలోనే సమస్త మానవాళి సన్మార్గ దీపిక అయిన మహత్తర గ్రంథరాజం ఖురాన్‌ను దేవుడు మానవాళికి ప్రసాదించాడు. సమస్త మానవజాతికీ మార్గదర్శక జ్యోతి పవిత్ర ఖురాన్. సన్మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథరాజం మానవులందరికీ సన్మార్గ బోధన చెయ్యడానికి అవతరించిన ప్రబోధనా జ్యోతి.

దైవ ప్రసన్నతను చూరగొనడానికి రోజా పాటించడం,'తరావీహ్'లు ఆచరించడం, దానధర్మాలు చేయడంతో పాటు, ఈ నెల చివరిలో'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత అమూల్యమైన రాత్రి అని అర్థం.

ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయన్నారు. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటివారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతం వరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. అందుకే 'ఈద్'(పండుగ)ను శ్రామికుని వేతనం(ప్రతిఫలం)లభించే రోజు అని చెప్పడం జరిగింది. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఒక ఉన్నతమానవీయ విలువలుకలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాదివేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర్ – రమజాన్ పర్వదిన పరమార్థం.

ఈ కాలంలోనే ఆర్థికంగా కలిగిన వాళ్ళు తమ ధనంలోని ఒక నిర్ణీతభాగాన్ని పేదసాదలకు దానం చేస్తారు. 'జకాత్' నిజానికి దానంకాదు. పేదవారి హక్కు. తమ నిల్వ ఆదాయంలోంచి నూటికి రెండున్నర శాతం తీసి దానం చేస్తారు. అలాగే ఫిత్రాలు కూడా! ఇది ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా కాస్తో కూస్తో కలిగిన వారందరూ చెల్లించాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పండుగ జరుపుకునే స్థోమతలేని వారికి ఫిత్రా దానం వల్ల గొప్ప ఊరట లభిస్తుంది. దీనివల్ల పేదసాదలు కూడా కొత్త బట్టలో, పండుగ సామగ్రో కొనుక్కోగలుగుతారు. ముస్లిములు, ముస్లిమేతరులు అన్న భేద భావం లేకుండా సమాజంలోని పేదసాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రమజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగవిలాసాలకు తమ ధనం వృథా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. అందుకే ప్రవక్త వారు రమజాన్‌ను 'సానుభూతుల నెల' అన్నారు.

సదాచరణల సంపూర్ణప్రతిఫలం లభించిన సంతోషంలో అంబరాన్నంటేలా సంబురాలు జరుపుకొని ఆనంద తరంగాల్లో తేలియాడే రోజు ఈదుల్ ఫిత్ర్. – ఆరోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిఖ్ఖు సోదరులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు.

పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదనుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ణి దైవదూతగా మలిచింది. అజ్ఞానం అంధకారాల కారు చీకట్ల నుండి వెలికి తీసి, విజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాధాలనుండి పైకిలాగి పవిత్రతా శిఖరాలపై నిలిపింది. మానవుల్లోని పశుప్రవృత్తిని మానవీయ పరిమళంతో పారద్రోలింది. ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి మనుషుల్ని మానవోత్తములుగా సర్వతోముఖంగా తీర్చిదిద్దింది. మానవాళికి ఇంతటి మహదానుగ్రహాలు ప్రసాదించి, వారి ఇహపరలోకాల సఫలతకు పూబాటలు పరిచిన నిఖిల జగన్నాయకునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకోవడమే ఈ పండుగ ఉద్దేశ్యం.

ఈదుల్ ఫిత్ర్ పర్వదిన శుభాకాంక్షలు

– మదీహా అర్జుమంద్

ఘనత



కింద గాఢంగా పారే చీనాబ్ నది. పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి. కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు. దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజినీర్ **మాధవీ లత** కృషి కీలకం. 'వరల్డ్ హైయ్యెస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం.

ఆమె నదిని దాటించింది

ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజినీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత.



మాధవీ లత

చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్

భారతీయ రైల్వే 2004లో జమ్ము–కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజినీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి.

ప్రొఫెసర్‌గా పని చేస్తూ...

ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజినీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా కూడా ఉంటూ సైన్స్‌ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజినీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీలత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు.

అవకాశం ఇలా...

ఉధంపూర్ – బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ ఆర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలు కొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజినీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్–5 భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి



కంచికి వెళ్లిన కథను ఇంటికి తెద్దాం

ఒకప్పుడు మనదేశంలో ప్రతి ఇల్లూ కథాకారులను తయారు చేసే గొప్ప సాంస్కృతిక వేదిక. కథాకారులు కనీసం ఇంటికొక్కరైనా ఉండేవారు. వీధిలో ఒకరిద్దరు నిష్ణాతులుండేవారు. ఆ నిష్ణాతులు కథ చెప్పడం మొదలు పెడితే చాలు, ఆ వీధిలోని అన్ని ఇళ్లలోని పిల్లలూ అక్కడే ఉండేవాళ్లు. శ్రోతలను కట్టిపడేసేటట్లు కథ చెప్పడానికి నియమిత శిక్షణ ఉండేది కాదు. వాళ్లు కథ చెప్పడంలో ఏ యూనివర్సిటీలోనూ కోర్సు చేయలేదు. అయినా సరే... కథ పూర్తయ్యేటప్పటికి హౌస్‌ఫుల్ అన్నట్లు ఆ ఇంటి వరండా నుంచి వీధి అరుగు వరకు జనంతో నిండి పోయేది. అలాంటి కథలు ఇప్పుడేమయ్యాయి?

మాయమవుతున్న కథాకారులు

గ్రామాలు కుచించుకుపోతున్నాయి, నగరాలు విస్తరిస్తున్నాయి. ప్రతి ఊరి నుంచి తరానికి కొందరు పట్టణాలకు వలసపోతున్నారు. పిల్లలకు కథలు చెప్పడానికి తగినంత ఖాళీ సమయం ఉన్న పెద్దవాళ్లు గ్రామాల్లో ఉండిపోవడం, పిల్లలు తల్లిదండ్రులతో నగరాలకు తరలి వెళ్లడంతో తరాలను కలిపి ఉంచిన కథ అనే అందమైన బంధం కూడా తెగిపోయింది. నగరాల్లో పిల్లలకు కథ చెప్పే బాధ్యతను తల్లిదండ్రులే తీసుకుందామనుకుంటే డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆ అవకాశాన్ని కూడా మింగేసింది. ఆ అగాథాన్ని గుర్తించిన విద్యావ్యవస్థ పిల్లలకు కథలు చెప్పడాన్ని సిలబస్‌లో చేర్చింది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికీ కార్పొరేట్ స్కూళ్ల దగ్గరే ఉంది. ఒక విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పగలిగిన సాధనం కథ. అంతటి ప్రభావవంతమైన సాధనాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామని ఆలోచించిన గీతారామానుజమ్ కథను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు.

ఇంటింటా కథాకారులు

'కథ కంచికి మనం ఇంటికి' అని ముగించే కథను కంచి నుంచి ఇంటికి తీసుకువచ్చే ప్రయత్నం మొదలైంది. కథల భాండాగారానికి పడి ఉన్న పీటముడిని విప్పుతున్నారు గీతారామానుజమ్. ఆమె వృత్తిరీత్యా శాస్త్రీయ గాయని. ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్‌గా అనుభవం ఉంది. రేడియో కార్యక్రమాల సమన్వయ కర్త కూడా. ఆమె 1996లో తోలుబొమ్మలతో పిల్లలకు కథ చెప్పడం మొదలుపెట్టారు. పిల్లలు కథలకు దూరం కావడానికి కారణం నగరాలకు వలసలతోపాటు నానమ్మ– తాతయ్యలకు దూరం కావడం ఒక కారణమైతే, టీవీలు స్మార్ట్ ఫోన్‌లు అంతకంటే ప్రమాదమైన భూమిక పోషిస్తున్నాయంటారామె. కథలను తిరిగి మన జీవితంలోకి తీసుకు రావడానికి బెంగళూరులో కథాలయ ఇంటర్నేషనల్ అకాడెమీ స్థాపించారు. ఆమె క్రమం తప్పకుండా సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేడుకలు నిర్వహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నారు. గత ఏడాది అరవైకి పైగా కథాకారులతో(కథ చెప్పేవాళ్లు) 'గాథ– ముంబయి ఇంటర్నేషనల్ స్టోరీ టెల్లింగ్ ఫెస్టివల్' నిర్వహించారు. పాతికేళ్ల ప్రయాణంలో ఆమె వేలాదిమంది కథాకారులను తయారు చేశారు. ఒక విషయాన్ని తెలియ చేయడానికి, విన్న వారిలో స్ఫూర్తిని అందించడానికి, ఉత్సాహపరచడానికి, చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడే అత్యంత ప్రభావవంతమైన సాధనం కథ. కథ చెప్పేటప్పుడు వినిపించేది గొంతు మాత్రమే. కానీ పలికేది గొంతు మాత్రమే కాదు. కథాకారుల ముఖం భావాలను పలుకుతుంది. గొంతు వాచకంతోపాటు నవరసాలను పలుకుతుంది. అంతకంటే ఎక్కువగా కళ్లు మాట్లాడుతాయి. అందుకే పిల్లలు చిన్నప్పుడు విన్న కథలు వారికి వృద్ధాప్యం వరకు తోడుగా వస్తాయి. వాళ్ల మనుమలకు చెప్పేవరకు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. ఇది దండలో దారంలా పైకి కనిపించని ఒక సంప్రదాయ పరంపర. ఈ పరంపరకు అంతరాయం కలగకూడదు. ఇప్పటికే ఏర్పడిన విరామానికి తెర దించుదాం. కంచికి వెళ్లిపోయిన కథను తిరిగి ఇంటికి తీసుకువద్దాం. 'అనగనగా ఒక రాజు' అంటూ కొత్త కథలను చెబుదాం. ప్రతి ఒక్కరం కథాకారులమవుదాం. పిల్లలున్న ప్రతి ఇంటినీ కథల నిలయంగా మారుద్దాం.



కథకారిణి గీతా రామానుజమ్



చిన్నారులకు కథలు చెబుతున్న ట్రైనర్



ఆసక్తిగా వింటున్న ప్రేక్షకులు